PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 148 | విజయవాడ, ఆదివారం 31 డిసెంబర్ 2023 | 8 + 8 పేజీలు + స్నేహ | వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 31 December 2023 | Rs

బిజెపిని ఓడించండి

- 12న విజయవాడలో సదస్సు
- భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక

లోపలి పేజీలో..

240 డిగ్రీ లెక్చరర్ పోస్టులకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 240 లెక్చరర్ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 11 సబ్జెక్టులకు సంబంధించిన పోస్టులు ఉన్నాయని కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 13 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. పరీక్షలు ఏప్రిల్/మే లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఒక్కో పేపర్ 150 మార్కులు చొప్పున రెండు పేపర్లలో పరీక్ష ఉంటుంది. ప్రతి తప్పుడు సమాధానానికి 1/3వ వంతు నెగిటీవ్ మార్కులు ఉంటాయని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం కమిషన్ వెబ్‌సైట్ జూ౦ఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ ను సందర్శించాలని తెలిపారు.

నెల్లూరులో పోలీసుల దాష్టీకం

- అంగన్‌వాడీల అడ్డగింత • పలువురికి గాయాలు • నాయకత్వాన్ని ఎంపిక చేసి అరెస్టులు - ఉద్రిక్తత
- నిరసనగా ప్రదర్శనలు • రాష్ట్ర వ్యాప్తంగా మంత్రుల ఇళ్ల ముట్టడి



నెల్లూరులో పోలీసు వ్యాన్‌ను అడ్డుకుంటున్నా అంగన్‌వాడీలు
(ఇన్‌సెట్‌లో) నెల్లూరు పోలీసులు కర్కశంగా వ్యవహరించడంతో గాయపడిన అంగన్‌వాడీ కార్యకర్త

ప్రజాశక్తి- యంత్రాంగం

నెల్లూరులో అంగన్‌వాడీలపై పోలీసులు దాష్టీకానికి దిగారు. మంత్రికి వినతిపత్రాన్ని ఇవ్వనీయకుండా అడ్డుకున్నారు. నాయకత్వాన్ని ఎంపిక చేసి అరెస్ట్ చేశారు. అడ్డుకున్న అంగన్‌వాడీలపై దుశ్శాసన పర్వానికి దిగారు. చీరలు గుంజుతూ, జుట్టు పట్టుకు లాగుతూ ఒకపక్కకు తోసివేశారు. ఈ తోపులాటలో పలువురు అంగన్‌వాడీలకు గాయాలయ్యాయి. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అంగన్‌వాడీలపట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై జిల్లాలో కార్మికలోకం భగ్గుమంది. పలు చోట్ల నిరసన ప్రదర్శనల నిర్వహించారు. ఈ ప్రదర్శనల్లో మున్సిపల్ కార్మికులు, ఆటో డ్రైవర్లు, ఐద్వా, యువజన సంఘంతో పాటు పలువురు ఇతరులు పాల్గొన్నారు. యువజనసంఘం, ఐద్వా ఆధ్వర్యంలో కూడా ప్రదర్శనలు జరిగాయి. అంగన్‌వాడీ సంఘాల పిలుపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మంత్రుల ఇళ్లను ముట్టడించారు. వేలాదిమంది ఎక్కడికక్కడ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నెల్లూరులో మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చేందుకు ఆయన క్యాంపు కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్తున్న అంగన్‌వాడీలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున తోపులాట చోటుచేసుకుంది. ఎంపిక చేసిన నాయకత్వాన్ని బలవంతంగా అరెస్ట్ చేసి వ్యాన్‌లలో ఎక్కించారు. దీంతో వ్యాన్‌కు అడ్డంగా అంగన్‌వాడీలు బైఠాయించారు. ఈ సందర్భంగా మరోసారి పోలీసులకు, అంగన్‌వాడీలకు మధ్య జరిగిన తోపులాటలో పలువురు అంగన్‌వాడీలు గాయపడ్డారు.

వీరిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు అమానవీయంగా వ్యవహరించిన విషయంవిషయం తెలుసుకున్న మున్సిపల్ కార్మికులు, జనసేన పార్టీ నాయకులు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. ఈ అరెస్టులను సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఖండించారు.

అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో మంత్రి ఉషశ్రీ చరణ్ ఇంటిని అంగన్‌వాడీలు ముట్టడించారు. వీరిని పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకునే ప్రయత్నం చేసినా నిర్బంధాన్ని ఎదిరించి పెద్ద సంఖ్యలో ర్యాలీగా వచ్చి మంత్రి ముందు బైఠాయించారు. అనంతపురం నుంచి వస్తున్న అంగన్‌వాడీల వాహనాలను కల్యాణదుర్గం రోడ్డులో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో, వారు అక్కడే రోడ్డుపై బైటాయించారు. ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీలను, సిఐటియు నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. వారిని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పరామర్శించారు.

సమ్మె విరమించి విధులకు హాజరు కాకపోతే తొలగిస్తాం : డిప్యూటీ సిఎం బెదిరింపులు

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ ఇంటిని అంగన్‌వాడీలు ముట్టడించారు. దీంతో, ఆయన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సిపిఎం, సిఐటియు నేతలు రెచ్చగొట్టి నా ఇంటిపైకి మిమ్మల్ని పంపారు. సమ్మె విరమించి విధులకు హాజరుకండి. లేకపోతే మిమ్మల్ని తొలగించి కొత్తవారిని పెట్టుకుంటాం' అంటూ బెదిరింపులకు దిగారు. . దీంతో, ఆయనపై అంగన్‌వాడీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ జీతాలు పెంచాలని 19 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. బెదిరింపు చర్యలు మిగతా 2లో



సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు (సిపిఎం), హరినాథ్ (ఎంఎల్ లిబరేషన్), రవికాంత్ (ఆర్ఎస్‌పి), మంతెన సీతారాం, డి రమాదేవి

సమ్మె న్యాయ సమ్మతం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- అంగన్‌వాడీలకు వామపక్షాల మద్దతు
- స్పందించకపోతే ప్రత్యక్ష సంఘీభావ ఆందోళనలు

లోపలి పేజీలో..



బొగ్గు రవాణా అదానీకే

రాయలసీమ థర్మల్‌లో రివర్స్ మాయాజాలం

మొదట్లో ఎల్-3గా ఉన్నా... తరువాత ఎల్-1గా

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో అదానీ వ్యాపార సామ్రాజ్య విస్తృతి కొనసాగుతోంది. తాజాగా బొగ్గు రవాణా రంగంలోనూ ఆ సంస్థ అడుగుపెటింది. రాయలసీమ థర్మల్ విద్యుత్ కేంద్రానికి అవసరమైన బొగ్గును సరఫరా చేసే కాంట్రాక్టును ఆ సంస్థ దక్కించుకున్నట్లు తెలిసింది. సాధారణ టెండర్ విధానంలో కాకుండా రివర్స్ టెండర్ మాయాజాలంలో ఆ సంస్థ ఈ టెండర్‌ను దక్కించుకుంది. ఈ మేరకు త్వరలోనే జెన్‌కో అధికారిక ప్రకటన చేయనున్నట్లు తెలిసింది. ఏడాదికి 40 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున మొత్తం 80 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గును సరఫరా చేసేందుకు బిడ్లు ఆహ్వానించగా, అందులో ఏకంగా 60 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరాను అదానీకి అప్పగించనున్నట్లు సమాచారం. దీనిపై విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యం మిగిలిన 20 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు సరఫరాను వేరే సంస్థకు అప్పగించాలని నిర్ణయించారు. వాస్తవానికి ఈ బొగ్గును సముద్ర, రైల్, రోడ్డు మార్గాల ద్వారా సరఫరా చేసేందుకు బిడ్లను ఆహ్వానించగా మొత్తం ఆరు సంస్థలు ముందుకొచ్చాయి. ఈ నెల 11వ తేదీన బిడ్లను తెరువగా, అందులో అదానీ సంస్థ ఎల్-3గా నిలిచింది. ఎల్-1గా రిప్లే సంస్థ, ఎల్-2గా ఎంబిజి సంస్థ నిలిచాయి. దీంతో టెండర్ రిప్లే సంస్థకే ఖాయమనుకున్న దశలో రివర్స్ టెండర్‌కు మళ్లీ బిడ్లు పిలిచారు. దీనిని అదాని గ్రూపు దక్కించుకున్నట్లు చెబుతున్నారు. తొలుత దాఖలు చేసిన టెండర్లలో రిప్లే సంస్థకు, అదానీ సంస్థ కేవలం 11 రూపాయల వ్యత్యాసమే ఉంది. అయితే రివర్స్ టెండరింగ్‌లో అదానీ తన సొంత ఓడరేవుగా ఉన్న కృష్ణపట్నం నుంచి బొగ్గు అందించేందుకు నిర్ణయించగా, రిప్లే సంస్థ మాత్రం చెన్నై ద్వారా అందించేందుకు ప్రతిపాదించాయి. ఇదే సమయంలో మెట్రిక్ టన్నుకు విలువను కూడా మరింతగా తగ్గించేందుకు అదానీ, రిప్లే సంస్థలు పోటీపడడంతో రివర్స్ టెండరింగ్‌లో దాదాపు 16.62 శాతం టెండర్ విలువ తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు. పోర్టు నుంచి ఆర్‌టిపిపికి బొగ్గు సరఫారా ఛార్జీలను అదానీ మరింతగా తగ్గించి కోట్ చేసినట్లు సమాచారం.

ముందే సన్నాహాలు

అదానీకి టెండర్ ఖరారు చేసినప్పటికీ ఇంకా బోర్డు అనుమతి ప్రకటించాల్సి ఉంది. అయితే అదానీ సంస్థ మాత్రం ఈ నెల 22వ తేదీ నుంచే సరఫరా పనులు ప్రారంభించేందుకు జెన్‌కో అనుమతి కోరడం విశేషం. అమాగే తాల్చేర్ నుంచి అదే రోజు రేక్‌ల ద్వారా బొగ్గు లోడింగ్ కూడా ప్రారంనించినట్లు తెలుస్తోంది. ఇంత హడావుడిగా అదానీ టెండర్ ఖరారు చేయడమే కాకుండా బోర్డు అనుమతికి ముందుగానే సరఫరా పనులకు కూడా ఆమోదం తెలపడం చర్చనీయాంశంగా మారింది.

వైఎస్ షర్మిల వెంటే నడుస్తా

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి- మంగళగిరి (గుంటూరు జిల్లా)



వైఎస్ షర్మిల వెంట తాను నడుస్తానని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఇటీవల వైసిపికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన ఆయన మీడియాతో శనివారం మాట్లాడారు. తాను వైఎస్ఆర్ కుటుంబానికి సన్నిహితుడునన్నారు. వైఎస్ షర్మిల ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని, ఇప్పటికే ఆమెను కలిశానని చెప్పారు. వైసిపికి సిద్ధాంతాలు లేవని విమర్శించారు. మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం రూ.1,200 కోట్లు మంజూరు చేసిందని, అయితే, రూ.120 కోట్లు మాత్రమే విడుదల చేసిందని తెలిపారు. కాంట్రాక్టర్ బిల్లుల విషయంలో అనేక పర్యాయాలు సిఎం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో తాను కోటి రూపాయలు అప్పు తెచ్చి చెల్లించానన్నారు. ఎవరు తప్పు చేసినా కోర్టుకు వెళ్లి న్యాయ పోరాటం చేస్తానని, చంద్రబాబుపై తాను పెట్టిన కేసులపై న్యాయపోరాటం కొనసాగిస్తానని చెప్పారు.

ఆలయంతోనే ఉపాధి!

- అయోధ్య రోడ్‌షోలో ప్రధాని మోడీ



అయోధ్య ధామ్ పునరభివృద్ధి ప్రాజెక్టు ప్రారంభోత్సవం చేస్తున్న ప్రధాని మోడీ తదితరులు

అయోధ్య : దేవాలయం ఉంటే అయోధ్యలో ఉపాధి పెరుగుతుంది! శనివారం అయోధ్యలో రోడ్‌షో అనంతరం జరిగిన సభలో ప్రధాని నరేంద్ర మోడీ పలికిన పలుకులివి. అయోధ్యలో రామ మందిరాన్ని ఏర్పాటు చేయడం వల్ల అక్కడి పూల వ్యాపారులు, పూజా సామాగ్రి అమ్మేవారు, చిన్న వ్యాపారుల ఆదాయం పెరుగుతుందని ప్రధాని సెలవిచ్చారు. రామమందిరాన్ని అదే స్థాయిలో ఉంచడం ద్వారా దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలకు ముందు బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ మళ్లీ మతతత్వ కార్డును ఉపయోగిస్తున్నదని చాలా మంది భావిస్తున్నారు. 2014లో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరుద్యోగుల సంఖ్య క్రమంగా పెరిగింది. ఆ నిరుద్యోగ సమస్యను రామమందిరంతో కప్పిపుచ్చాలని బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ భావిస్తోంది. తన నియోజకవర్గం వారణాసిలో జరిగిన ఒక కార్యక్రమంలో, బేకరీని నిర్మూలించే సరళమైన మార్గాన్ని కూడా ప్రధాని హైలైట్ చేశారు. డిసెంబరు 19న, "ఈ భారీ ఆలయాన్ని చూడటానికి చాలా మంది వస్తారని, దాని ఫలితంగా చుట్టుపక్కల గ్రామాలన్నింటికీ ఆదాయం వచ్చే వ్యాపారం పెరుగుతుంది" అని ప్రధాని చెప్పారు, అలాగే ప్రధాన మంత్రి కూడా ఒక సులభమైన మార్గం ఇచ్చారు. పేదరికాన్ని నిర్మూలించండి. 'ప్రతి ఒక్కరు ఒక్క పేద కుటుంబానికి సహాయం చేయాలి, భారతదేశంలో పేదరిక నిర్మూలనకు ఇదే మార్గం' అన్నారు. శనివారం నాటి ప్రధాని ప్రసంగం ఆద్యంతం అయోధ్యలో ఉపాధి చుట్టూనే తిరిగింది.. పదేళ్లలో తమ ప్రభుత్వం ఎన్ని కొత్త ఉద్యోగాలు కల్పించిందో ఆయన చెప్పలేకపోయారు. జనవరి 22న రామ మందిర స్థాపన వైపే ప్రపంచం మొత్తం చూస్తోందని ప్రధాన మంత్రి అన్నారు. ఆ రోజు ఇంట్లో దీపాలు వెలిగించాలని ఆయన దేశప్రజలకు విజ్ఞప్తి చేశారు. రోడ్‌షో అనంతరం ఆయన ఆధునీకరించిన రైల్వేస్టేషన్‌ను, విమానాశ్రయాన్ని ప్రారంభించారు. రెండు అమృత్ భారత్, ఆరు వందేభారత్ రైళ్లను కూడా ప్రారంభించారు. రూ.15,700 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు మోడీ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆధునీకరించిన అయోధ్య ధామ్ జంక్షన్ రైల్వే స్టేషన్‌ను, రైళ్లను ప్రారంభించారు. ఆ తరువాత అక్కడ నుంచి నేరుగా బయలుదేరి మహర్షి వాల్మీకి ఎయిర్ పోర్టును ప్రారంభించారు.

సమ్మె విచ్ఛిన్నానికి కుట్ర

- పోటీ కార్మికులతో పని
- అడ్డుకున్న మున్సిపల్ కార్మికులు
- పల్నాడులో ట్రాక్టర్‌తో ఢీ
- విశాఖలో 300 మంది అరెస్టు





నరసరావుపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు

విశాఖలో బయటకు తెచ్చిన క్లాప్ వాహనాలను అడ్డుకుంటున్న కార్మికులు

ప్రజాశక్తి - యంత్రాంగం

మున్సిపల్ కార్మికుల సమ్మె విచ్ఛిన్నానికి అధికారులు ప్రయత్నించారు. పోటీ కార్మికులతో చెత్త వాహనాలను బయటకు తీసేందుకు యత్నించగా సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకున్నారు. పలు చోట్ల కార్మికులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. అనంతరం విడుదల చేశారు. పల్నాడులో పోటీ కార్మికుడు మున్సిపల్ కార్మికుడిని ట్రాక్టర్‌తో ఢీకొట్టారు. సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె కొనసాగుతుందని, పోటీ కార్మికులను అడ్డుకుంటామని మున్సిపల్ కార్మికులు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వంటావార్పు, నల్ల దుస్తులు, ఉరితాళ్లతో కార్మికులు నిరసన తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో పోటీ కార్మికులతో చేయిస్తున్న పనులను మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ట్రాక్టర్‌కు అడ్డుగా మిగతా 7లో

సమ్మె విరమించకపోతే తీవ్ర చర్యలు

- మున్సిపల్ కార్మికులకు మంత్రి సురేష్ బెదిరింపులు

లోపలి పేజీలో..



ఐలు అఖిల భారత మహాసభలో మాట్లాడుతున్న పాలగుమ్మి సాయినాథ్

ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నే కరువు

- దేశంలో మీడియా అతిపెద్ద వ్యాపారం
- బిల్లుల ఆమోదానికే ప్రతిపక్ష ఎంపిల సస్పెన్షన్
- బ్రిటిష్ పాలన నాటి అసమానతలు పునరావృతం
- ఐలు అఖిల భారత మహాసభలో పాలగుమ్మి సాయినాథ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో మీడియా అతిపెద్ద వ్యాపారంగా మారిందని ప్రముఖ పాత్రికేయులు, రామన్ మెగాసేసే అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్ అన్నారు. ప్రధాన స్రవంతి మీడియా కార్పొరేట్ల చేతుల్లో ఉందని, అందువల్ల ఆ మీడియా 80 శాతం ప్రజల సమస్యలను రిపోర్టు చేయకుండా మినహాయిస్తుందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను కూడా మీడియా ప్రశ్నించటం లేదని తెలిపారు. కలకత్తాలోని హౌరాలో శనివారం జరిగిన ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) 14వ అఖిల భారత మహాసభలో సాయినాథ్ ప్రసంగించారు. న్యాయవాదులు, జర్నలిస్టులు మధ్య దగ్గర సంబంధం ఉందని, చాలా మంది మిగతా 7లో

గృహ నిర్మాణాల్లో భారీ అవినీతి

- సిబిఐతో విచారణ చేపట్టాలని ప్రధానికి పవన్ లేఖ

లోపలి పేజీలో..



నయా ఉదారవాద విధానాలతో...

ఉపాధి ధ్వంసం

- స్థూల జాతీయోత్పత్తి రేటు పెరిగినా నిరుద్యోగం తగ్గలేదు
- ఎన్‌పిఆర్ స్మారకోపన్యాసంలో ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్

ఎల్ఐసికి సాటిలేరెవరూ..

98.5 % బీమా క్లెయింల పరిష్కారం



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్యూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) జీవిత బీమా క్లెయింల పరిష్కారంలో మెరుగైన పనితీరును కనబర్చింది. ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఐఆర్‌డిఎ) గణంకాల ప్రకారం.. 2023 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 98.5 క్లెయింలను పరిష్కరించింది. కాగా.. ఇంతక్రితం ఏడాదిలో 98.7 శాతం క్లెయింల పరిష్కారంతో పోల్చితే స్వల్పంగా తగ్గినప్పటికీ.. ప్రయివేటు రంగ బీమా సంస్థలతో పోల్చితే అత్యంత మెరుగైన పనితీరును కనబర్చింది. బీమా పరిశ్రమలో దాదాపు 60 శాతం పైగా వాటాతో మార్కెట్ లీడర్‌గా ఉంది. కేవలం ఒక్క అంకె, రెండు అంకెల మార్కెట్ వాటా కలిగిన అనేక సంస్థలు క్లెయింల పరిష్కారంలో వెనుకబడి ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో ప్రయివేటు జీవిత బీమా సంస్థలు 98 శాతం క్లెయింలను మాత్రమే పరిష్కరించాయి. ఇంతక్రితం ఏడాది ఈ నిష్పత్తి 98.1 శాతంగా ఉంది. ఆర్థిక సంవత్సరం 2022-23లో గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో అన్ని బీమా కంపెనీలకు కలిపి 12.5 లక్షల క్లెయింలు రాగా.. 12.4 లక్షల క్లెయింలు పరిష్కారం అయ్యాయి. కాగా.. గ్రూప్ క్లెయింల్లో ఎల్ఐసి దాదాపు 99 శాతం పరిష్కరించింది. ప్రయివేటు సంస్థలు 99.4 శాతం సెటిల్ చేశాయి. జీవిత బీమా వ్యాపారంలో సరెండర్లు లేదా ఉపసంహరణల క్లెయింలు 25.6 శాతం పెరిగి రూ.2 లక్షల కోట్లకు చేరుకున్నాయి. వీటిలో ఎల్ఐసి చెల్లించినవే 56.3 శాతం పాలసీలు ఉన్నాయి. మొత్తం జీవిత బీమా పరిశ్రమ పాలసీదార్లకు చెల్లించిన ప్రయోజనాల విలువ రూ. 5 లక్షల కోట్ల వరకూ ఉంది. ఇది నికర ప్రీమియం ఆదాయంలో 64 శాతం. వ్యక్తిగత జీవిత బీమా వ్యాపారంలో 10.8 లక్షల డెత్ క్లెయింలు రాగా, కంపెనీలు 10.6 లక్షల క్లెయింలను పరిష్కరించి రూ. 28,611 కోట్లు చెల్లించాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సాధారణ, వైద్య బీమాకు సంబంధించిన 2.36 కోట్ల క్లెయింలు పరిష్కారం అయ్యాయి. వీటి విలువ రూ70,930 కోట్లుగా ఉంది. ఇంతక్రితం ఏడాది రూ.69,498 కోట్ల విలువ చేసే వైద్య బీమా క్లెయింలు సెటిల్ చేయబడ్డాయి. ఇదే సమయంలో క్లెయింల సగటు విలువ రూ.30,087గా నమోదయ్యింది. కాగా.. 2022-23లో ఇది రూ.30,087గా ఉంది.



చైనా ఇంటర్నెట్ టెక్నాలజీ టెస్ట్ శాటిలైట్ విజయవంతం

బీజింగ్ : ఇంటర్నెట్ టెక్నాలజీ టెస్ట్ శాటిలైట్‌ను శనివారం చైనా విజయవంతంగా ప్రయోగించింది. శనివారం ఉదయం లాంగ్ మార్చ్-2సి రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించినట్లు చైనా ప్రభుత్వ అంతరిక్ష సంస్థ చైనా ఏరోస్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్ (సిఎఎస్‌సి) తెలిపింది. ఈ ఉపగ్రహాన్ని చైనా అకాడమీ ఆఫ్ స్పేస్‌క్రాఫ్ట్ టెక్నాలజీ కార్పొరేషన్ (సిఎఎస్‌టి) ద్వారా సిఎఎస్‌సి అభివృద్ధి చేసింది. వాయువ్య చైనాలోని గన్సు ప్రావిన్స్‌లోని జియుక్వాన్ శాటిలైట్ లాంచ్ సెంటర్ నుంచి ప్రయోగించారు. ముందుగా నిర్ణయించిన కక్ష్యలోకి ఉపగ్రహం విజయవంతంగా ప్రవేశించిందని సిఎఎస్‌సి తెలిపింది.

బిజెపిని ఓడించండి

- 12న విజయవాడలో సదస్సు
- భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక


రాజ్యాంగపరిరక్షణ వేదిక సదస్సులో అభివాదం చేస్తున్న వివిధరంగాలకు చెందిన నాయకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిజెపి, దానికి మద్దతు పలికే ఇతర పార్టీల ఓటమే లక్ష్యంగా ' మోడీ హఠావో - దేశ్ బచావో' నినాదంతో విజయవాడలో 12వ తేది భారీ సదస్సు నిర్వహించాలని భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక నిర్ణయించింది. విజయవాడ ఆటోనగర్‌లోని ఎగ్జిబిషన్ సొసైటీ హాలులో పరిరక్షణ వేదిక కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు, అధ్యక్షతన శనివారం జరిగిన మేధోమధనం ఆ సదస్సుకు భారీగా తరలిరావాలని ప్రజానీకానికి పిలుపునిచ్చింది. సంస్థలు, పార్టీలు, మేధావులు, ప్రజాసంఘాలు, యువత పెద్ద ఎత్తున 12వ తేది సదస్సులో భాగస్వామ్యం కావాలని కోరింది. రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ దేశ సంపదను లూఠీ చేసి అదాని, అంబానీలకు మోడీ ప్రభుత్వం కట్టబెడుతోందని మేధోమధనంలో పాల్గొన్న వక్తలు విమర్శించారు. రాష్ట్రానికి తీవ్రమైన ద్రోహం చేసిన మోడీ, అమిత్‌షా, బిజెపితో పాటు ఆ పార్టీకి మద్దతు పలికే పార్టీలను రాబోవు ఎన్నికల్లో ఓడించాలని సదస్సు తీర్మానం చేసింది. విజయవాడలో నిర్వహించనున్న భారీ సమ్మేళనం స్థాయిలో తిరుపతి, కర్నూలు, విశాఖల్లో కూడా సమ్మేళనాలు నిర్వహించాలని కోరింది. దీనికి సన్నాహకంగా 5,6,7 తేదీల్లో జిల్లా స్థాయిల్లో కూడా సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాం హక్కులను కాలరాస్తూ మౌళిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, లౌకిక తత్వం, ప్రాథమిక హక్కులను మంట గలుపుతోందన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా , వెనుకబడిన ప్రాంతాలైన ఉత్తరాంధ్ర, రాయలసీమ కు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని మోసం చేసిందన్నారు. ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటు వ్యక్తులకు అమ్మకానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రమే బాధ్యత తీసుకుని పూర్తి చేస్తామని ప్రకటించి నేడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ రాష్ట్రానికి బిజెపి అన్యాయం చేస్తోందని విమర్శించారు. బిజెపి ఓటు బ్యాంక్ కోసం మతాన్ని తెరమీదకు తెచ్చిందన్నారు. మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టి లౌకిక శక్తులను బలోపేతం చేసేందుకు బలమైన కూటమి అవసరమన్నారు. భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక చేపట్టే ప్రతి కార్యక్రమానికి ప్రత్యక్షంగా తమ మద్దతు ఉంటుదని ప్రకటించారు. బిజెపికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో సోషల్ మీడియా వేదికను బలోపేతం చేయాలని అభిప్రాయపడ్డారు. టిడిపి, వైసిపిలు సహకారం అనే పేరుతో బిజెపికి దగ్గరగా ఉన్నాయని, ఆయా పార్టీల మీద వత్తిడిని పెంచాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూపరిషత్, బిజెపి అన్ని కలిసి మత అంశాలను ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నాయన్నారు. ప్రతిపక్ష నాయకులపై సిబిఐ, ఇడిలను ప్రయోగించి కేసులను బనాయిస్తోందని చెప్పారు. వీటిని బూచిగా చూపించి ప్రాంతీయ పార్టీల నేతలను లొంగదీసుకుంటోందన్నారు. బిజెపి మతోన్మాదాన్ని ఎదుర్కొనేందుకు లౌకికశక్తులు, ప్రజాతంత్రవాదులు అందరూ కలిసి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్నారు. రాజ్యాంగ రక్షణకు ప్రతి ఒక్కరూ నడుంకట్టాలన్నారు. గ్రామస్థాయి నుంచి బిజెపి వ్యతిరేక పోరాటాలను ఉధృతం చేయాల్సిన ఆవశ్యకత ఉందని వారు సూచించారు. జనవరి 26న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు ఇవ్వాలని, అదే విధంగా రాజ్యాంగ స్ఫూర్తిని మోడీ ప్రభుత్వం ఎలా తూట్లు పొడుస్తుందనే అంశంపై బుక్‌లెట్లు పంపిణీ చేయాలని, మేలుకో కర్నాటక తరహాలో మేలుకో ఆంధ్ర పేరుతో మేధావులను భాగస్వామ్యం చేయాలన్నారు.

ఈ సదస్సులో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.మధు, వైవి, గఫూర్, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు ఓబులేశు, సిఐటియు నాయకులు యు. ఉమామహేశ్వరరావు, ప్రత్యేక హోదా సాధనా సమితి నాయకులు చలసాని శ్రీనివాసరావు, కె. విజయరావు, రైతు సంఘం నాయకులు వి.కృష్ణయ్య, కెవి ప్రసాద్, సినీ నిర్మాత సత్యారెడ్డి, సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు ఆళ్ల గోపాలకృష్ణ, అడ్వకేట్ మేళం భాగ్యారావు, పట్నాయక్, భాస్కరరావు, పాల్గొన్నారు. సదస్సు ప్రారంభంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు వి. వెంకటేశ్వర్లు తీర్మానాలను ప్రవేశ పెట్టారు.

అంగన్‌వాడీలకు అభినందనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమ్మెలో భాగంగా 19వ రోజు మంత్రుల కార్యాలయాలు ముట్టడించిన అంగన్‌వాడీలకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ అభినందనలు తెలిపింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.బేబీరాణి, కె.సుబ్బరావమ్మ శనివారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అందరు మంత్రుల ఇళ్లను తొలిసారిగా ఒకేరోజు ముట్టడించడం పోరాటంలో పాల్గొన్న మహిళల చైతన్యానికి నిదర్శమని పేర్కొన్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేందుకు వరకూ స్ఫూర్తితో ఉద్యమాన్ని కొనసాగించాలని వారు కోరారు.

గోరుముద్ద మెనూ చార్జీలు పెంచాలి

- మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు సైతం ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న 'జగనన్న గోరుముద్ద'కు మెనూ చార్జీలు రూ.20కు పెంచాలని, వర్కర్లు, హెల్పర్లకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. పాఠశాలల విలీనం చేయడం వల్ల ఉపాధి కోల్పోతున్న కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలని కోరుతున్నారు. పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పజెప్పకుండా తగినన్ని నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గ్యాస్ ప్రభుత్వమే అందించాలని, 12 నెలల జీతం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జనవరి 5న విజయవాడలో ధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నా ప్రచార పోస్టర్‌ను శనివారం విజయవాడలోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, పి అజయ్‌కుమార్, జి ఓబులు, కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి ఆవిష్కరించారు. 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రతి నెల 5లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బీమా, ఇఎస్ఐ వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. 5న జరిగే ధర్నాలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

బకాయిలు విడుదల చేయాలి

- దశల వారీ ఆందోళనలు
- యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్‌ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. విజయవాడలోని యుటిఎఫ్ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష నేతగా ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నెరవేర్చడం లేదని, మెరుగైన పిఆర్‌సి, సకాలంలో డిఎలు ఇవ్వకపోగా వేతనాలు కూడా సకాలంలో ఇవ్వడం లేదన్నారు. ప్రతి నెలా 17 వరకు జీతాలు, పెన్షన్లు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం మాత్రం ఉద్యోగులకు జీతాల కోసమే అప్పులు చేయాల్సివస్తోందన్నట్లుగా తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వివిధ అవసరాల కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవ్ చెల్లింపులు కూడా సకాలంలో చెల్లించకుండా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మొత్తంగా రూ.18,096 కోట్లు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉందని, ఇది కాకుండా సిపిఎస్ ఉద్యోగుల ఖాతాలకు మరో రూ.2500 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఆగస్టు 24న జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో 2023లో సెప్టెంబర్ నాటికి అన్ని బకాయిలు చెల్లిస్తామని మంత్రివర్గ ఉపసంఘం, ఆర్థిక శాఖ ఉన్నతాధికారుల హామీ ఇచ్చినా ఇంతవరకు చెల్లింపు చేయలేదని పేర్కొన్నారు. బకాయిలు కోసం ఇప్పటికే అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చామని, తాలూకా, డివిజన్ కేంద్రాల్లో 6 గంటల ధర్నాలు నిర్వహించామని వివరించారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. ఈ నేపథ్యంలో జనవరి 3న అన్ని జిల్లాల్లో 12 గంటల పాటు ధర్నాలు నిర్వహిస్తామని వెల్లడించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే 9,10 తేదీల్లో విజయవాడలో 36 గంటల పాటు రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఓట్ ఫర్ ఓపిఎస్ అనే పేరుతో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.



చిత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాల్సిందే..

- పొర్లు దండాలు, కళ్లకు గంతలతో నిరసనలు
- కొనసాగిన ఎస్ఎస్ఎ ఉద్యోగుల ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనను కొనసాగించారు. పొర్లు దండాలు పెడుతూ, మోకాళ్లపై నిలబడి, కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. సర్వశిక్ష అభియాన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం 11వ రోజుకు చేరింది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మెకు ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మద్దతు తెలిపారు. సమగ్ర శిక్షలో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు ఎస్ఎస్ఎ ఉద్యోగులు వినతిపత్రం అందించారు. ఏలూరులో మహిళలు నల్ల దుస్తులు ధరించి, పురుషులు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం ధర్నా చౌక్‌లో పొర్లు దండాలతో నిరసన తెలిపారు. విజయవాడ ధర్నా చౌక్‌లో ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, అంగన్‌వాడీ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావమ్మ తదితరులు మద్దతు తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పొర్లు దండాలు పెట్టారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద మోకాళ్ళపై నిలబడి నిరసన తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో కోలాటం చేస్తూ ర్యాలీ చేశారు.

శ్రీకాకుళంలో వంటావార్పు నిర్వహించారు. సమ్మె శిబిరాన్ని మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు, కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి, డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు, సిపిఎం నేతలు సందర్శించి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో డిఇఒ కార్యాలయాల వద్ద సమ్మెను కొనసాగించారు. రాజమహేంద్రవరంలో సమ్మెకు మాజీ మంత్రి జవహర్ హాజరై మద్దతు తెలిపారు. ప్రకాశం, గుంటూరు కలెక్టరేట్ల ఎదుట ఉద్యోగులు పొర్లు దండాలు పెట్టి నిరసన తెలిపారు. గుంటూరులో సమ్మెకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి మద్దతు తెలిపారు. కర్నూలు ధర్నా చౌక్‌లో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. నంద్యాల బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద మానవహారం చేపట్టారు. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు మద్దతు ప్రకటించారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఎ ఉద్యోగులు కాగితాలతో తయారు చేసిన శఠగోపం పెట్టుకొని నిరసన తెలిపారు. సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి ఆర్‌డిఒ కార్యాలయం దీక్షా శిబిరం వద్ద నిరసన దీక్షలను కొనసాగించారు. నెల్లూరులో పొర్లు దండాలు నిరసన తెలిపారు. చిత్తూరులో కలెక్టరేట్ ఎదుట మానవహారంగా ఏర్పడి ధర్నా చేశారు. తిరుపతి, అన్నమయ్య జిల్లాలో సమ్మెను కొనసాగించారు.

రాష్ట్రంలో మాఫియా రాజ్యం

- గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో మాఫియానే రాజ్యమేలుతోందని, అవినీతి, అసమ్మతి, సొంత పార్టీ ఎమ్మెల్యేల తిరుగుబాటులతోనే సాగుతోందని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు విమర్శించారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగుల బదిలీలు తరహాలో ఎమ్మెల్యేలు, ఎంపిలను వైసిపి బదిలీ చేస్తోందని ఎద్దేవా చేశారు. ఎస్సీ,డఎస్టీలకు చెందిన 28 పథకాలను జగన్ ప్రభుత్వం తీసివేసిందన్నారు. ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు బకాయిలు చెల్లించకుండా వేదిస్తోందని ఆరోపించారు. నాలుగున్నరేళ్లగా ప్రజల జీవితాలతో ఆడుకుంటూ... ఇప్పుడు కొత్తగా 'ఆడుదాం.. ఆంధ్రా' అంటున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అనేవి లేవని రుద్రరాజు తెలిపారు. సాక్షి రిపోర్టర్ దామోదర్ ఆత్మహత్యపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అండన్‌వాడీ, పారిశుద్య కార్మికులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాదయాత్ర చేసేప్పుడు అందరికి న్యాయం చేస్తానన్న జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు.

షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయం

షర్మిల ఎప్పుడు కాంగ్రెస్‌లో చేరుతుందని విలేకరులు అడిగిన ప్రశ్నకు రుద్రరాజు సమాధానం ఇస్తూ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరుతుందనే సమాచారం ఉందని అయితే షర్మిల చేరికపై ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నిర్ణయం తీసుకున్నరని తెలిపారు. కాగా ఎపి కొత్త ఇంచార్జ్‌గా నియమితులైన మాణిక్యం ఠాకూర్ జనవరి 8,9 తేదీలలో రాష్ట్రంలో పర్యటించనున్నట్లు రుద్రరాజు తెలిపారు. 139 సంవత్సరాల కాంగ్రెస్ అధ్యక్షులు చిత్ర మాలికను రుద్రరాజు అవిష్కరించారు. ఈ కార్యక్రమంతో సుంకర పద్మశ్రీ, మీసాల రాజేశ్వరరావు, మేడా సురేష్, షేక్ నాగూర్, నరహరిశెట్టి నరసింహారావు, బుర్రా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బిసి యువజన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజకీయ ప్రాతినిధ్యం కోసం బిసిలంతా ఐక్యంగా పోరాడాలని మంత్రి విడదల రజనీ, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. గుంటూరులోని ఎన్‌జిఒ కాలనీలో జాతీయ బిసి సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర కార్యాలయాన్ని వారు శనివారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వంలో బిసిలకు ప్రాతినిధ్యం పెరిగిందన్నారు. గత ఐదేళ్లలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల బిసిలు ఆర్థికంగా, విద్యా పరంగా కొంత మేరకు అభివృద్ధి చెందారని తెలిపారు. రాష్ట్రంలో విద్యా, వైద్య రంగాల్లో పేదలను ఆదుకునేందుకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ జంగాకృష్ణమూర్తి, జాతీయ యువజన సంఘం అధ్యక్షులు లీలా వెంకటేష్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు గూడూరు నాని, మహిళా విభాగం అధ్యక్షులు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె న్యాయ సమ్మతం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- అంగన్‌వాడీలకు వామపక్షాల మద్దతు
- స్పందించకపోతే ప్రత్యక్ష సంఘీభావ ఆందోళనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు, మినీవర్కర్లు చేపట్టిన సమ్మె న్యాయసమ్మతమైందని, ప్రభుత్వం స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమ్మె రాష్ట్ర వ్యాప్తంగా 19వ రోజూ కొనసాగింది. దీనిలో భాగంగా శనివారం విజయవాడ ధర్నా చౌక్‌లో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం వద్దకు సిపిఎం, న్యూడెమోక్రసీ, లిబరేషన్, ఆర్‌ఎస్‌పి నేతలు వెళ్లి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్‌వాడీలు సమస్యలపై తాడోపేడో తేల్చుకుని, శిబిరం నుండి ఇంటికి వెళ్లాలని అన్నారు. వారు చేస్తున్న పోరాటం రాష్ట్ర ప్రజానీకానికి స్ఫూర్తిదాయకంగా ఉందని చెప్పారు అన్నిచోట్లా ఆందోళనలు పూర్తి క్రమశిక్షణతో, ప్రభుత్వానికి వణుకుపుట్టే విధంగా పట్టుదలతో, సమరశీలత్వంతో సాగుతున్నాయన్నారు. ప్రభుత్వాధినేతలు ఇప్పుడు నవరత్నాలని చెబుతున్నారని, ఇకముందు నవ అబద్ధాలు అని చెప్పాల్సివస్తుందన్నారు. 2018లో జీతం పెంచితే 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ తాను పెంచానని చెప్పడం సరికాదని, ఆయన సిఎం అయిన ఏడాది తరువాత రూ.1000 మాత్రమే పెంచారని పేర్కొన్నారు. అయినా తామే జీతాలు పెంచామని, ఎవరికీ ఏమీ తెలియదన్నట్లు అబద్ధాలు చెప్పడం సరికాదన్నారు. పైగా అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు ఇస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఒకవేళ ఇస్తున్నదే నిజమైతే లిస్టు ప్రకటించాలని డిమాండు చేశారు. రూ.11,500 జీతం తీసుకుంటున్నారనే పేరుతో సంక్షేమ పథకాలు ఆపేశారని విమర్శించారు. పైగా ప్రభుత్వం అన్నిరకాల పనులూ అంగన్‌వాడీలతో చేయిస్తూ వేధింపులు, బెదిరింపులకు దిగుతోందన్నారు. అంగన్‌వాడీలు సమ్మె విరమించకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామంటున్నారని, అది సాధ్యంకాదని చెప్పారు. ఇప్పటి వరకూ అంగన్‌వాడీలపై ఏ ఒక్కరి ఫిర్యాదు లేదని, పైగా తల్లులకు భరోసా ఉందని తెలిపారు. అక్కాచెల్లెమ్మలపై ప్రేమ ఉందని చెబుతూ వారిని రోడ్డుపై పడేశారని అన్నారు. తప్పుడు ప్రచారాలతో సమ్మెను అణచలేరని హెచ్చరించారు. రూ.525 కోట్లతో గెస్ట్‌హౌస్ కట్టారని, అంగన్‌వాడీల జీతాలు పెంచితే రూ.400 కోట్లు మాత్రమే అవుతుందని అయినా పెంచడం లేదని పేర్కొన్నారు.

స్మార్ట్ మీటర్ల పేరుతో రూ.20 వేల కోట్ల రూపాయలు దోచిపెట్టారని అన్నారు. ఆ డబ్బులతో అందరికీ జీతాలు పెంచొచ్చని, ఆ పనిచేయకుండా అదానీకి దోచిపెడుతున్నారని విమర్శించారు. ఇటీవల జరిగిన చర్చల్లో అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేస్తామంటున్నారని, ఒకవేళ అధికారంలోకి వస్తామని నమ్మకం ఉంటే ఇప్పటి నుండే అమలు చేయొచ్చని అలా ఎందుకు చేయరని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని, సమ్మెను విరమింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమ్మెకు సంఘీభావం చెబుతున్న అధికారపార్టీ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి జీతాలు పెంచాలని చెప్పాలని అన్నారు. ప్రతిపక్షనేత చంద్రబాబు కూడా న్యాయం చేస్తామని చెబుతున్నారని, అది వారి ఎన్నికల ప్రణాళికలో పెట్టాలని కోరారు. అంగన్‌వాడీల విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు నిర్దిష్టమైన హామీ ఇవ్వాలని డిమాండు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యాన ప్రత్యక్ష సంఘీభావ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సిపిఐఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు పొలారి మాట్లాడుతూ అంగన్‌వాడీలు చేస్తున్న డిమాండ్లలో న్యాయసమ్మతం లేనివి ఏమిటో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కడుపుకాలి ఆందోళన చేస్తుంటే కనీసం స్పందించని సిఎం అధికారంలో ఉండటానికి అనర్హుడని అన్నారు.

సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు హరినాథ్ మాట్లాడుతూ పిల్లలను కన్న బిడ్డల్లా చూసుకునే అంగన్‌వాడీలు రోడ్డెక్కితే చీమకుట్టినట్లయినా లేని ఈ ప్రభుత్వం ఒక్కక్షణం కూడా అధికారంలో ఉండకూదని అన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయమంటే దాడులకు దిగడం ఏమిటని ప్రశ్నించారు. ఆర్‌ఎస్‌పి నాయకులు రవికాంత్ కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, డి.రమాదేవి, మంతెన సీతారాం, న్యూడెమొక్రసీ నాయకులు రవిచంద్ర, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె,సుబ్బరావమ్మ, ఉపాధ్యక్షులు సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

సర్వశిక్ష శిబిరానికి మద్దతు

ధర్నాచౌక్‌లోనే ఆందోళన చేపట్టిన సర్వశిక్ష సిబ్బంది సమ్మెకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి, మంతెన సీతారాం తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సిబ్బంది చేస్తున్న సమ్మెకు పార్టీ తరుపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం స్పందించే వరకూ ఆందోళన కొనసాగించాలని సూచించారు.


విజయనగరం జిల్లా చీపురుపల్లిలో మంత్రి బొత్స ఇంటి ముట్టడికి వెళ్తున్న అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు

నెల్లూరులో పోలీసుల దాష్టీకం

మొదటిపేజీ తరువాయి

మానుకోకపోతే రానున్న ఎన్నికల్లో తగు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. తమ డిమాండ్లు ఆమోదించే వరకూ విధుల్లో చేరేది లేదని తేల్చి చెప్పారు. దీంతో, వీటిని సిఎం దృష్టికి తీసుకెళ్తానంటూ మంత్రి ఇంట్లోకి వెళ్లిపోయారు.

- తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి ఇంటిని, ప్రకాశం జిలా మార్కాపురంలో మంత్రి ఆదిమూలపు సురేష్ ఇంటిని అంగన్‌వాడీలు ముట్టడించారు. ఒంగోలులో మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. గుంటూరులో మంత్రి విడదల రజిని ఇంటిని ముట్టడించారు. దీంతో, ఆమె బయటకు వచ్చి వారి నుండి వినతిపత్రం స్వీకరించారు. సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.
- తణుకులో మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఇంటిని అంగన్వాడీలు ముట్టడించారు. వారికి మద్దతుగా నిలిచిన సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్‌ను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అయినా, అంగన్‌వాడీలు భయపడకుండా ఆందోళన కొనసాగించారు. ఈ నేపథ్యంలో అక్కడికి వచ్చిన మంత్రి కారుమూరికి అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ ఎక్కడో ఉన్న నేను మీ కోసం వెంటనే ఇక్కడికి వచ్చానని, మీ సమస్యలు ముఖ్యమంత్రికి తెలియజేశానని అన్నారు.
- అమలాపురంలో మంత్రి పినిపే విశ్వరూప్, రామచంద్రపురంలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, కొవ్వూరులో మంత్రి తానేటి వనిత ఇళ్లను అంగన్‌వాడీలు ముట్టడించారు.
- విజయనగరంలో మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటి ముట్టడికి ర్యాలీగా వెళ్తున్న అంగన్‌వాడీలను ఆయన ఇంటికి కొద్ది దూరంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో, అంగన్‌వాడీలు అక్కడే రహదారిపై బైటాయించారు. అనంతరం ఆయన ఇంట్లోకి దూసుకెళ్లారు. ఈ నేపథ్యంలో పోలీసులతో జరిగిన తోపులాటలో చీపురుపల్లి మండలం కోనూరు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త కమల సొమ్మసిల్లి పడిపోయారు. అంగన్‌వాడీలపై ప్రభుత్వం అసత్య ప్రచారాలు మానుకోవాలని డిప్యూటీ సిఎం రాజన్నదొరకు మక్కువలో అంగన్‌వాడీలు వినతిపత్రం ఇచ్చారు.
- శ్రీకాకుళం జిల్లా పలాసలో మంత్రి సీదిరి అప్పలరాజు ఇంటిని ముట్టడించారు. ఇంట్లోకి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. వారిని తోసుకుంటూ అంగన్‌వాడీలు ఇంట్లోకి ప్రవేశించారు. దీంతో, మంత్రి వచ్చి వారి నుంచి వినతిపత్రం స్వీకరించారు.
- విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీ సమ్మె శిబిరాన్ని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ (ఎఐటియుసి) ప్రారంభించి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించకుంటు సమ్మెను ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.
- పల్నాడు జిల్లా వినుకొండలో అంగన్‌వాడీ కేంద్రం తాళం పగుల గొడుతున్న సూపర్‌వైజర్‌ను సిఐటియు, ఎఐటియుసి నాయకులు అడ్డుకున్నారు. కృష్ణా జిల్లా పెడనలో మంత్రి జోగి రమేష్ కార్యాలయాన్ని అంగన్‌వాడీలు ముట్టడించారు.

సమ్మె విరమించకపోతే తీవ్ర చర్యలు

- మున్సిపల్ కార్మికులకు మంత్రి సురేష్ బెదిరింపులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికులు వెంటనే సమ్మెను విరమించాలని, లేనిపక్షంలో ప్రభుత్వం తీవ్రచర్యలు తీసుకుంటుందని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం మధ్యాహ్నం సిఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఆయన ఈ బెదిరింపులు చేశారు. రాష్ట్రంలో 124 మున్సిపాలిటీలు ఉంటే 44 చోట్ల సమ్మె లేదని తెలిపారు. పారిశుధ్య కార్మికులు మాత్రమే సమ్మెలో ఉన్నారని అన్నారు. చెత్త పేరుకుపోతున్నందున వారు వెంటనే సమ్మెను విరమించాలన్నారు. ఇప్పటికే వారు చెప్పిన డిమాండ్లను పరిశీలిస్తున్నామని అన్నారు. సిఐటియు సంఘం మాత్రమే సమ్మెలో ఉందని, మిగిలిన సంఘాల నాయకులు తాము చెప్పింది విని సమ్మెలోకి వెళ్లలేదని అన్నారు. సమ్మె నేపథ్యంలో 3,100 మంది పారిశుధ్య కార్మికులు, మిగిలిన వివిధ విభాగాలకు మరో 400 మంది సిబ్బందిని తాత్కాలికంగా నియమించుకుంటున్నామని పేర్కొన్నారు.

గృహ నిర్మాణాల్లో భారీ అవినీతి

- సిబిఐతో విచారణ చేపట్టాలని ప్రధానికి పవన్ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన గృహ నిర్మాణ పథకంలో భారీ అవినీతి జరిగిందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే సిబిఐతో విచారణ జరిపించాలని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ కోరారు. ఈ మేరకు శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ఆయన లేఖ రాశారు. పేదలకు సొంత ఇళ్ల పేరుతో స్థలాలను సేకరించేందుకు రూ.35,451 కోట్ల నిధులను వెచ్చించిందని, అందులో పెద్ద ఎత్తున నిధుల్లో గోల్‌మాల్ జరిగిందని, కోట్లాది రూపాయలు దారిమళ్లాయని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణ ప్రాజెక్ట్ వ్యయం రూ.1,75,421 కోట్లు కాగా ప్రభుత్వం మాత్రం రూ.91,503 కోట్లుగా చెబుతుండటం పట్ల అనేక సందేహాలున్నాయని ప్రధానికి రాసిన లేఖలో ప్రస్తావించారు. పేదలందరికీ ఇళ్ల పేరుతో 30 లక్షల గృహాలు నిర్మిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం కేవలం 17,005 జగనన్న లే అవుట్లలో కేవలం 12,09,022 మందికి మాత్రమే ఇళ్ల స్థలాలిచ్చారని తెలిపారు. గృహ నిర్మాణ పథకం పేరుతో ప్రభుత్వం, వైసిపి నాయకులు నిధులను పక్కదారి పట్టించి భారీగా లబ్ధి పొందారని తెలిపారు. పేదలందరికీ ఇళ్ల పథకంలో కేంద్ర ప్రభుత్వ గృహ స్కీమ్‌లను కలిపేసిందన్నారు. పిఎంఎవై (అర్బన్, రూరల్) జెజెఎం, ఎంజిఎన్‌ఆర్‌ఇజిపి, ఎస్‌బిఎం లాంటి కేంద్ర పథకాలు నిధులను ఇష్టానుసారంగా కలిపేసి వైసిపి పథకాలకు వాడుకున్నారని పేర్కొన్నారు. 2023 అక్టోబరు 12న 5 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలంటూ ఇచ్చిన ప్రకటనల్లో ఇందుకోసం రూ.56,102 కోట్లు భూ సేకరణ కోసం ఖర్చు చేసినట్లు పేర్కొన్నారన్నారు. ఈ నేపథ్యంలో సిబిఐతో విచారణ జరిపించాలని ఆయన కోరారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

సిఎంకు లోకేష్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి శనివారం లేఖ రాశారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో బాధితులకు ఇస్తానన్న సొమ్మిలేవని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా ఐదేళ్లు పూర్తయినా అగ్రిగోల్డ్‌కు చెందిన ఒక్క సెంటు ఆస్తి కూడా ఎందుకు అటాచ్ చేయలేదని ప్రశ్నించారు. తాము 21 వేల ఎకరాలు అటాచ్ చేసి యాజమాన్యాన్ని అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేశామని పేర్కొన్నారు. 10 లక్షలకు పైగా అగ్రిగోల్డ్ ఖాతాదారులకు అధికారం నుంచి దిగేలోపైనా రూ.3080 కోట్లను చెల్లించి న్యాయం చేయాలని కోరారు.

నయా ఉదారవాద విధానాలతో... ఉపాధి ధ్వంసం

- స్థూల జాతీయోత్పత్తి రేటు పెరిగినా నిరుద్యోగం తగ్గలేదు
- ఎన్‌పిఆర్ స్మారకోపన్యాసంలో ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్



సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రముఖ ఆర్థిక వేత్త ప్రభాత్ పట్నాయక్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశంలో నయా ఉదారవాద విధానాలు ప్రారంభమైన నాటి నుంచి స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) రేటు పెరిగినా ఉపాధి రేటు దేశంలో గణనీయంగా పడిపోయిందని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ, వ్యవసాయ భూమి రియల్ ఎస్టేట్‌కు తరలిపోయి చిన్న చిన్న ఉత్పత్తి సంస్థలు నాశనం కావడంతో నిరుద్యోగం నానాటికీ పెరిగిపోతోందని ప్రముఖ ఆర్థిక వేత్త ప్రభాత్ పట్నాయక్ అన్నారు. సిఐటియు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొట్టమొదటి ప్రధాన కార్యదర్శి సుందరి ప్రసాదరావు (ఎన్‌పిఆర్) 23వ వర్ధంతి సందర్భంగా 'ప్రపంచీకరణ- నిరుద్యోగం- పరిష్కార మార్గాలు' అనే అంశంపై విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యాన సెమినార్ నిర్వహించారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో ముందుగా ఎన్‌పిఆర్ చిత్రపటానికి ప్రభాత్‌పట్నాయక్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, కుమార్, మణి, కెఎం.శ్రీనివాస్, డాక్టర్ బి.గంగారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాత్ పట్నాయక్ మాట్లాడుతూ ఎన్‌పిఆర్ గొప్ప విప్లవకారుడు, కార్మికపక్షపాతి అని అన్నారు. ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా జీవితకాలంలో సంఘటిత, అసంఘటిత రంగంలో ఉద్యమాలు నాయకత్వం వహించిన గొప్ప నాయకుడని కొనియాడారు.

ఐదేళ్లలో ఉపాధి సున్నా...

గడచిన ఐదేళ్లలో దేశంలో పనిచేయగల కార్మికులు, దేశ జనాభా గణనీయంగా పెరిగినా ఉపాధి రేటు సున్నా అని తెలిపారు. 1991లో నయా ఉదారవాద ఆర్థిక విధానాలు ప్రారంభమైనప్పటి నుంచి 2019 వరకు ఉపాధి రేటు ఒక శాతమేనని, జనాభా పెరుగుదల రేటు రెండు శాతంగా ఉందని వివరించారు. ఈ విధానాలతో వ్యవసాయ భూమి రియల్ ఎస్టేట్‌లోకి లక్షల ఎకరాలు వెళ్లిపోయి గ్రామీణ ప్రాంతంలో కూలీల ఉపాధి, వ్యవసాయ ఉత్పత్తి దెబ్బతిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రాథమిక పెట్టుబడి సంచయం (ప్రిమిటివ్ ఎక్యుములేషన్ ఆఫ్ కేపిటల్)తో దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ భూమి రియల్ ఎస్టేట్‌కు తరలిపోయి, చిన్న, సన్నకారు రైతులు కుదేలయ్యారని తెలిపారు. దేశంలో నోట్ల రద్దు, జిఎస్‌టి అమలుతో చిన్న ఉత్పత్తిదారులపై పన్నుల భారం పెరిగి ఉద్యోగాల కల్పన దెబ్బతింటున్నారు. చిన్న చేపను పెద్ద చేపలు మింగేసినట్లుగా చిన్న వ్యాపారాలను అదాని, అంబానీ లాంటి వారు మింగేశారని తెలిపారు. దేశంలోకి ప్రపంచ నలుమూలల నుంచి సరుకుల ప్రవాహం పెరిగి జిడిపి 8 శాతానికి వెళ్లినా ఉపాధి రేటు కేవలం ఒక శాతమేనని తెలిపారు. ఉపాధి పెరగాలంటే దేశంలో సంపన్నులపై ఒక శాతం పన్ను వేయాలన్నారు.

ప్రయివేటీకరణపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్థితిలో న్యాయవ్యవస్థ లేదు

ప్రభుత్వ రంగాన్ని బడా పెట్టుబడిదారులు కొల్లగొట్టిన కారణంగా చిన్న ఉత్పత్తి సంస్థలు ధ్వంసమై పెద్ద ఎత్తున దేశంలో నిరుద్యోగం పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తున్నా, ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్థితిలో న్యాయవ్యవస్థ లేదన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు ప్రజామోదం లేదని తెలిపారు. ఇలాంటి భారీ పరిశ్రమను ప్రజల సంపదగా చూడాలని, ఎన్నికల్లో నిర్ణయాత్మకంగా ప్రయివేటీకరణ చేయకూడదని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగంలో ఐదు ప్రధాన ఆర్థిక హామీలను చేర్చేందుకు ప్రజాపోరాటాలు జరగాలని ప్రభాత్‌పట్నాయక్ సూచించారు. అందరికీ ఆహారం, విద్య, నాణ్యమైన వైద్యం, ప్రతి ఒక్కరికీ ఉద్యోగ హక్కు, సార్వత్రిక వృద్ధాప్య పింఛను కోసం సిఐటియు అజెండా రూపొందించి ప్రజా చైతన్యం కలిగించాల్సి ఉందని తెలిపారు.

కార్మికపోరాటాల్లో కీలక పాత్ర: సిహెచ్.నరసింగరావు

సుందరి ప్రసాదరావు (ఎన్‌పిఆర్) 1930వ దశకంలోనే స్వాతంత్య్రోద్యమంలో పాల్గొన్న యోధుడని, 1940లో ఆలిండియా కిసాన్ సభకు అధ్యక్షుడిగా ప్రాతినిధ్యం వహించారని, విశాఖ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యమ నిర్మాణం, కార్మికోద్యమంలో కీలక పాత్ర పోషించారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలోనూ జరుగుతున్న పరిణామాలు, పరిస్థితులపై ప్రజలు సంతృప్తిగా లేరన్నారు. పాలకవర్గాల భావజాలంలో జనం కొట్టుకుపోతున్నారని, ఈ నయా ఉదారవాద విధానాల 'చట్రం' నుంచి బయటపడేసే సమిష్టి భావజాల రంగంలో ప్రత్యామ్నాయం కోసం పోరాటాలు సాగాలన్నారు.

చంద్రగిరి ఓటరు జాబితాలో నకిలీలు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రగిరి నియోజకవర్గం ఓటర్ల జాబితాలో నకిలీ ఎంట్రీలున్నాయని, వీటిని సరిచూసి తొలగించాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి శనివారం ఆయన లేఖ రాశారు. ఇలాంటివి 2840 ఎంట్రీలున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో డిఎస్ఇ, పిఎస్ఇ తగిన చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. కాగా తమ పార్టీ నేత బిటెక్ రవికి భద్రత పెంచాలని డిజిపికి మరో లేఖ రాశారు. రవికి ప్రాణ హానీ ఉందని, ఎమ్మెల్సీ పదవీ కాలం పూర్తయిందనే నెపంతో భద్రత తొలగించడం సరైంది కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు.

నంది నాటకోత్సవాల విజేతలకు అవమానం: వర్ల

గుంటూరులో ఈ నెల 29న జరిగిన నంది నాటకోత్సవాల విజేతలను రాష్ట్రప్రభుత్వం అవమానపరిచిందని టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. బహుమతి ప్రదాన కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకాకపోవడం కళాకారుల పట్ల జగన్‌కు ఉన్న నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోందని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనివారం విమర్శించారు. విద్యాదీవెన పథకంలో విద్యార్థులకు రూ.3400కోట్ల బాకీ జగన్ పెట్టారని ఆ పార్టీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆరోపించారు. తమ పార్టీ నేత కిలారు రాజేష్ విషయంలో సిఐడి, ఇంటిలిజెన్స్ విభాగాలు, అధికారులు వ్యవహరిస్తున్న తీరు చట్టవిరుద్ధమని ఆ పార్టీ ఎస్సి సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు అన్నారు. కాపు ద్రోహి జగన్‌కు వంత పాడేందుకు కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు సిగ్గుపడాలని పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు.



అభివాదం చేస్తున్న నాయకులు

దామాషా ప్రకారం సీట్లు

- గుంటూరులో కాపు జెఎసి డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం కాపులు, బిసిలు, మైనార్టీలకు కూడా టికెట్లు కేటాయించాలనికాపు జెఎసి రాజకీయ చైతన్య వేదిక డిమాండ్ చేసింది. గుంటూరులో శనివారం జరిగిన ఈ సమావేశానికి కాపు నాయకులు బొక్కిసం శివరాం అధ్యక్షత వహించారు. దక్షిణ భారత కాపు జెఎసి కన్వీనర్ దాసరి రాము ప్రసంగిస్తూ.. రాష్టంలో ఆత్యధిక జనాభా కలిగిన కాపులు, బిసిలకు అరకొర సీట్లు కేటాయిస్తున్నారని, రాష్ట్రంలో గత 50 ఏళ్లుగా అధికారం కేవలం రెండు సామాజిక తరగతులకే పరిమితం అవుతోందన్నారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో గణనీయంగా ఉన్న కాపులు, బిసిలకు కేవలం ఒకటి రెండు టికెట్లు మాత్రమే దక్కుతున్నాయని, ఈ ధోరణి మారాలని అన్నారు. రాజకీయంగా కాపుల్లో చైతన్యం రావాలని, రాజ్యాధికారం సాధన కోసం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ తరగతులను కలుపుకొని వెళ్లాలని కోరారు. సీనియర్ నాయకులు లింగంశెట్టి ఈశ్వర్‌రావు, చందు సాంబశివరావు మాట్లాడారు. ప్రతి ఎన్నికల ముందు కాపులకి ఆశలు చూపించి, ఎన్నికల సమయానికి ఈ రాజకీయ పార్టీలు మొండి చేయి చూపిస్తున్నాయని విమర్శించారు. సమావేశంలో కాపు నాయకులు మేకల బాబూరావు, డేగల ప్రభాకర్, కటారి శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు, డా.శనక్కాయల అరుణ, ఉగ్గిరాల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి అందుబాటులోకి ఒబిపిఎస్ సేవలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నిర్వహణాపరమైన చర్యల నిమిత్తం (సర్వర్ మెయింటెనెన్స్) ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ సిస్టమ్ (ఒబిపిఎస్) సేవలు ఈ నెల 30, 31 తేదీల్లో తాత్కాలికంగా అంతరాయం ఏర్పడింది. ఈ సేవలు జనవరి 1 నుంచి యథాతథంగా ప్రజలకు అందుబాటులోకి వస్తాయని సిడిఎంఎ పి.కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

3న తాడేపల్లిలో రాష్ట్ర పంచాయతీరాజ్ సదస్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర పంచాయితీరాజ్ సదస్సు జనవరి 3వ తేదీన తాడేపల్లిలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సంపాదకీయం

అక్షర తోరణం!

'పుస్తకం నాకు గాఢనిద్రలో నుండి వెలుతురు తోటలోకి/ దారి చూపే వెన్నెల పూదోట/ మామూలు మనిషిని కావడానికీ బుద్ధుడు కావడానికీ/ ఎన్నెన్నో బోధనల్ని చేసేది పుస్తకమే/ మనిషిగా మనగలగడానికీ/ పదిమందిని మానవతా స్పర్శతో అక్కున చేర్చుకోవడానికీ/ పుస్తకం ఒక జీవన మార్గం/ పుస్తకమే ఒక జీవన గమ్యం' అంటారు గ్రంథాలయ యాత్రికుడు మంచికంటి. రాతి యుగం నుంచి రాకెట్ యుగం వరకూ సమాజ అభివృద్ధి యానానికి పుస్తకాలే నిచ్చెన మెట్లు. ప్రపంచంలో ఎన్ని మార్పులు వచ్చినా... మానవాభివృద్ధిలో అత్యంత కీలకం పుస్తకం. అందుకే అంటాడు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్– 'మానవుడు సృష్టించిన వాటిలో గొప్పది పుస్తకం' అని. మనిషి జీవితాన్ని తీర్చిదిద్దేది పుస్తకమే. సమాజ మార్పులోనూ ముఖ్యపాత్ర పోషిస్తుంది పుస్తకం. కాగితాల్లో నిక్షిప్తం చేయబడిన దశాబ్దాల చరిత్ర పుస్తకాల్లో అమృతంలా ప్రవహిస్తూంటుంది. ఏ కాలం పుస్తకం చదివితే... ఆ కాలంలోని చారిత్రక, భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక వికాసంలోకి పఠితులను తోడ్కొని పోతుంది. ఒక సమాజపు అత్యున్నత స్థితిని కొలవగలిగే ప్రమాణాలే పుస్తకాలు. చదవడం అలవాటున్న వ్యక్తిని పరిపూర్ణమైన మనిషిగా మార్చేస్తుంది పుస్తకం.

ప్రతియేటా నూతన సంవత్సరాన్ని వెంటబెట్టుకొని, సంక్రాంతికి ముందే వచ్చే మరో పెద్ద పండుగ విజయవాడ పుస్తక మహోత్సవం. ఒకటి కాదు, రెండు కాదు, వేలాది పుస్తకాలు ఒకేచోట బొమ్మల కొలువులా... హేమంతంలో విరబూసిన చామంతుల్లా... విద్యుద్దీపాల కాంతిలో విజ్ఞానజ్యోతులై ప్రకాశిస్తుంటాయి. విజయవాడ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న 34వ పుస్తక మహోత్సవం... డిసెంబర్ 28 నుంచి జనవరి 7వ తేదీ వరకూ కొనసాగుతుంది. పుస్తకాలు మనకు అత్యంత ప్రియమైన సహచరులు, ప్రియనేస్తాలు. మనం ఎదగడానికి, నేర్చుకోడానికి... మన ఊహలను, ప్రపంచం గురించిన అవగాహనను పెంచడానికీ పుస్తకాలు దోహదపడతాయి. సాహిత్యంలోని అన్నిరకాల ప్రక్రియలను నింపుకొన్న పాత, కొత్త పుస్తకాల మేలు కలయిక ఈ పుస్తక మహోత్సవం. ముఖ్యంగా ఈ పుస్తక ప్రదర్శనకు పిల్లలను తీసుకురావడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ చూపాలి. వారితో ఒక్క పుస్తకమైనా కొనిపించాలి... చదివించాలి. ఒక్కో చిత్రంలో నటించాక తనకు వచ్చిన పారితోషికంతో మొదట 100 డాలర్లకు పుస్తకాలు కొనేవాడట చార్లీ చాప్లిన్. పుస్తకాన్ని మించిన స్నేహితుడు, సన్నిహితుడు మరొకరులేరు. 'నేను ఇంతవరకూ చదవని పుస్తకాన్ని తీసుకువచ్చి నన్ను కలిసిన వ్యక్తి నా ప్రాణ స్నేహితుడవుతాడు' అంటాడు అబ్రహాం లింకన్.

నేటి ఆధునిక సమాజంలో ఎన్ని సాంకేతిక మార్పులు వచ్చినా, ఏఐ వంటి చాట్ బాట్‌లు ఎన్ని వున్నా... పుస్తక పఠనాన్ని మించినది లేదు. ట్యాబ్స్, ఈబుక్స్, యాప్స్ వంటివి అందుబాటులోకి వచ్చినా... పుస్తకం చదివిన అనుభూతి వాటితో కలుగదు. పైగా ఆ ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి వెలువడే రేడియేషన్ కళ్లకు హాని కలిగిస్తుందన్న విషయం అందరికీ తెలిసిందే. ప్యూ రీసెర్చ్ అంచనా ప్రకారం... ప్రపంచవ్యాప్తంగా 61శాతం పట్టణవాసులు, 58 శాతం గ్రామీణ ప్రాంత వాసులు పుస్తకాలు చదువుతున్నారు. భారత్‌లో 47 శాతం మంది పట్టణ, 53 శాతం మంది గ్రామీణ ప్రాంత చదువరులున్నారు. కాగా, తెలుగులో 14శాతం మంది పుస్తకాలు చదువుతున్నారు. మొత్తంగా భారతీయులు వారానికి 10.42 గంటలు చదువుతున్నారు. అమెరికన్ పుస్తకాల మార్కెట్‌ని పరిశీలిస్తే... గతేడాది అమ్ముడైన ప్రతి ఐదు ప్రతుల్లోనూ నాలుగు అచ్చు పుస్తకాలేనట. స్మార్ట్‌ఫోన్ అరచేతిలో వున్నా... పుస్తకం హస్తభూషణం అన్న మాట ఇంకా మసకబారలేదని ఈ లెక్కలే చెబుతున్నాయి. మంచి పుస్తకాలు చదవడం వల్ల ఎలాంటి చెడు ప్రభావాలూ వుండవు. 'పుస్తకమే ఆత్మ వంటిది/ చదివితే కమ్మగుంటది/ ప్రతి మాట ప్రతి పుట/ నోటి కూడవుతది/ మెదడుకి పదును పెడతది'– అంటాడో కవి. పఠనం మనసును వికసింపజేస్తుంది, విస్తరింపజేస్తుంది. సత్ సాహిత్యం, సత్ సాంగత్యం మనో వికాసాన్ని పెంచుతుంది. పుస్తక పఠనాన్ని మహోద్యమంగా ముందుకు తీసుకెళ్లాలి. భావితరానికి విజ్ఞాన బాంఢాగారాన్ని అందించాలి.

మహాకవి మాట




మతములన్నియు మాసిపోవును
జ్ఞానమొక్కటె నిలిచి వెలుగును
- గురజాడ అప్పారావు
నవ యుగ కవితా వైతాళికుడు

బిజెపి ఛాయలలోనే తెలుగు రాష్ట్రాల ప్రాంతీయ పార్టీలు

విశ్లేషణ

తెలంగాణ ఎన్నికలలో బిజెపి బిఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ బిజెపి హడావుడి మాత్రం తగ్గింది లేదు. లోక్‌సభ ఎన్నికల్లో కనీసం పది స్థానాలు తెచ్చుకోవాలి హోంమంత్రి అమిత్‌షా ఇటీవల దిశానిర్దేశం చేసివెళ్లారు కూడా. బిజెపిపై విమర్శలు తగ్గించి దగ్గరైనట్టు కనిపించడమే బిఆర్ఎస్ పరాజయానికి ఒక ముఖ్య కారణమని రాజకీయ వర్గాలు గట్టిగా అంచనా వేస్తున్నాయి.అయినా తమ వైఖరి మార్చుకోకపోగా అయోధ్యపైనా హిందువుల పైన ట్వీట్లు చేయడం ద్వారా హిందూత్వకు దగ్గరగా వున్నామనే భావం కలిగించేందుకు ఆ పార్టీ నాయకులు ఎక్కువగా ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్‌పై రాజకీయ విమర్శలు ఒకటైతే హిందువులకు వ్యతిరేకత కాంగ్రెస్ డిఎన్ఎలోనే వుందని ఆ పార్టీ ఎంఎల్‌సి కవిత ఇటీవల చేసిన వ్యాఖ్య ఇందుకు అద్దం పడుతుంది. ఇక ఆంధ్ర ప్రదేశ్‌లోనైతే పాలక వైసీపీ,ప్రతిపక్షాలుగా వున్న తెలుగుదేశం జనసేన పార్టీలు పొరబాటున కూడా బిజెపి మతరాజకీయాలనూ,నిరంకుశ పోకడలనూ ప్రస్తావించింది లేదు. ఆఖరుకు ప్రత్యేక హోదా,విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ వంటి అంశాలలోనూ పూర్తి మౌనం పాటిస్తున్న పరిస్థితి. ఈ విధంగా ఎపిలో వలె పాలక ప్రతిపక్షాలు రెండూ బిజెపికి అనుకూలంగా వుండటం దేశంలోని మరే రాష్ట్రంలోనూ చూడం. తెలుగు రాష్ట్రాలలో బిజెపి పెద్ద శక్తి కాదుగనక దానిపై పోరాటం,విమర్శలు అవసరం లేదనేవాదన ఎంత తప్పో దీన్నిబట్టే తెలుస్తుంది.వామపక్షాలు మతతత్వ ప్రమాదం గురించి చెబితే ఏదో సిద్ధాంత పరంగా మాట్లాడటమే గాని ఇక్కడ వర్తించదని అపహాస్యం చేసేవారికి లోటు లేదు. అయితే మొన్న తెలంగాణ ఎన్నికల ఫలితాలు, ఎపితో సహా రెండుచోట్ల రాబోయే ఎన్నికల పోటీల తీరుతెన్నులు చూస్తే ఈ విధమైన వాదనలు ఎంత తప్పో స్పష్టమవుతుంది. తెలంగాణలో మరింతగా పాగా వేయడానికిఒక వైపు, ఎపిలో టిడిపి జనసేన కూటమితో కలసి పోటీ చేసేందుకు మరోవైపు బిజెపి పాచికలు వేస్తున్నదనే వాస్తవం ఇప్పుడు మరింత స్పష్టంగా కనిపిస్తున్నది. నిజానికి విశాఖలో యువగళం ముగింపు సభకు ముందు టిడిపి నాయకుడు లోకేశ్ ఇచ్చిన ఇంటర్వ్యూలలో బాహాటంగానే బిజెపికి ఆహ్వానం పలికాడు.ఆ సభలో పవన్ కళ్యాణ్ బిజెపి ఆశీస్సులు కోరడం ద్వారా తమ వ్యూహాన్ని వెల్లడించారు.బిజెపికి తెలుగుదేశం తలుపులు తీసేవున్నాయని ఈ శీర్షికలో చాలాసార్లు చెప్పుకున్న విషయమే. కాకపోతే వైఎస్ షర్మిల ఎపిలో ప్రవేశించనుండటం దీనికి మరింత నాటకీయత తెచ్చిపెట్టింది.



తెలకపల్లి రవి



ఎపిలో అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు , సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు ఇలా అన్ని తరగతులూ పోరాటంలో వున్నా ప్రభుత్వ స్పందన లేకపోగా అరెస్టులతో బెదిరింపులతో విరుచుకుపడుతున్నది. పేదల సంక్షేమమే మా లక్ష్యమనే వారు ఈ అట్టడుగు వర్గాల శ్రామికుల న్యాయమైన కోర్కెల విషయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసేందుకు సిద్ధం కావడం లేదు. వీటిపైపోరాడబోతే పౌర హక్కులు, రాజకీయ కార్యకలాపాలపైన దాడులు సాగుతున్నాయి.

ఎపి రాజకీయ పరిణామాలు

ఎపిలో అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు , సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు ఇలా అన్ని తరగతులూ పోరాటంలో వున్నా ప్రభుత్వ స్పందన లేకపోగా అరెస్టులతో బెదిరింపులతో విరుచుకుపడుతున్నది. పేదల సంక్షేమమే మా లక్ష్యమనే వారు ఈ అట్టడుగు వర్గాల శ్రామికుల న్యాయమైన కోర్కెల విషయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసేందుకు సిద్ధం కావడం లేదు. వీటిపైపోరాడబోతే పౌర హక్కులు, రాజకీయ కార్యకలాపాలపైన దాడులు సాగుతున్నాయి. సంక్షేమ పథకాల వరకూ మంచివైనా అభివృద్ధి, పాలనాపరమైన అసమర్థత,అవినీతి ఆరోపణలు, అప్పులు తీవ్ర ఉద్రిక్తతకు కారణమవుతున్నాయి.వైసీపీ టిడిపి జనసేన మధ్య అసహన రాజకీయాలు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుతో పరాకాష్టకు చేరాయి. ఆయన బెయిలుపై విడుదలయ్యేసరికి ఎన్నికల వాతావరణం వచ్చేసింది గనక ఇప్పుడు అందరి దృష్టి అటే కేంద్రీకృతమైంది.చంద్రబాబు జైలులో వుండగానే టిడిపితో పొత్తును ప్రకటించిన పవన్ కళ్యాణ్ ఎన్‌డిఎలో కొనసాగుతూ తన విమర్శలను జగన్ సర్కారు తొలగింపువరకే పరిమితం చేస్తున్నారు. కేంద్రంలో మోడీని పున:ప్రతిష్టించడం కోసమే పనిచేస్తున్నానని ప్రకటిస్తున్నారు. సనాతన ధర్మ ప్రవచనాలు తరచూ వినిపిస్తున్నారు.

మోడీకి నిరంతరం విధేయంగా వుండే జగన్ తన సర్కారుపై అసంతృప్తిని గుర్తించి అభ్యర్థుల భారీ మార్పుద్వారా గట్టెక్కాలనుకుంటున్నారు. సింహం సింగిల్‌గానే వస్తుందంటూ తమకు ఎవరితో రాజకీయంగా సంబంధం లేదన్నట్టు మాట్లాడుతున్నారు గాని ఆయన కూడా మోడీ విధానాలపై పల్లెత్తు మాట అనడం లేదు. ఇదే ఇప్పటి ఎన్నికల దృశ్యం. జగన్ ఢిల్లీ పర్యటనల్లో వినతులు తప్ప క్షేత్రస్థాయిలో రాజకీయ ఒత్తిడి రాష్ట్రం కోసం ఉమ్మడిగా ఉద్యమించడం వంటి ఉదాహరణలే చూడం.ఈ రెండు శిబిరాలు ఒకరికి వ్యతిరేకంగా ఒకరు కేంద్రానికి ఫిర్యాదు చేయడంలోనే పోటీ పడుతుంటారు. పరస్పర పోటీలో మోడీ అశీస్సుల కోసం పాకులాడుతుంటారు.2019 ఎన్నికలకు ఏడాది ముందు బిజెపితో ఎన్‌డిఎతో విడగొట్టుకుని విమర్శలతో చెలరేగిపోయిన చంద్రబాబు ఓటమి తర్వాత ఎన్నడూ బిజెపి ని పల్లెత్తు మాట అనడంలేదు. తాను మోడీ విజన్‌ను ఎన్నడూ విమర్శించలేదని కేవలం ప్రజల సెంటిమెంటు కోసమే ప్రత్యేక హోదాపై విమర్శ చేశానని సంజాయిషీ ఇచ్చుకున్నారు. చంద్రబాబును జగన్ అరెస్టు చేయడం వెనక కేంద్రం ఆశీస్సులున్నాయని స్పష్టంగా తెలిసినా హోంమంత్రి అమిత్‌షాను ఆశ్రయించడానికే పాకులాడారు.ఆయన బహిరంగంగా మద్దతునివ్వకపోయినా బిజెపితో పొత్తు కలుపుకోవడానికే ప్రయత్నిస్తూ వస్తున్నారు.ఇప్పుడిప్పుడు ఆ ప్రయత్నాలు ఫలించినట్టు కూడా సంకేతాలు అందుకున్నామని టిడిపి నేతలు చెబుతున్న మాట.

తెలంగాణ ఎన్నికల తర్వాత..

తెలంగాణలో మొన్నటి ఎన్నికల్లో జనసేన పార్టీ బిజెపితో పొత్తు పెట్టుకుంది. టిడిపి పోటీ చేయకపోయినా తాను దాంతో కలసి పోటీ పెట్టి దెబ్బతిన్న పవన్ కళ్యాణ్ కూడా ఎపిలో ఆ బిజెపి ఆశీస్సుల కోసమే ఆరాటపడ్డారు.మరోవైపు తెలంగాణలో వైఎస్ఆర్‌టిపి పెట్టిన షర్మిల కాంగ్రెస్‌తో కలసిపోవడానికి చర్చలు జరిపారు. బిఆర్ఎస్ వ్యతిరేక ఓట్లు చీలిపోకూడదు గనక ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు వెల్లడించారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌తోనూ చర్చలు జరిపారు.అయితే తెలంగాణ కాంగ్రెస్‌అధ్యక్షుడు ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమె రాకను స్వాగతించలేదు.ఆమె కూడా ఆయన నాయకత్వాన్ని బలపర్చలేదు. ఆ విధమైన ప్రతిష్టంభన తర్వాత హఠాత్తుగా తాను అన్ని స్థానాల్లో పోటీ చేస్తానని ఆగ్రహంతో ప్రకటించారు.మళ్లీ ఇంతలోనే తమ పార్టీ పోటీ చేయబోదని వెనక్కుతగ్గారు. కానీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నది లేదు. కాంగ్రెస్ విజయం సాధించిన తర్వాత కూడా తాను రేవంత్ కోసం మద్దతు నివ్వలేదని ప్రత్యేకంగా ప్రకటించారు. అందుకు తగినట్టే కాంగ్రెస్ నాయకత్వం కూడా షర్మిల పాత్రను ప్రస్తావించింది లేదు.నిజానికి షర్మిల రాజకీయాల్లో ప్రవేశిస్తారని ముందుగా చెప్పింది,ప్రధానంగా ప్రోత్సహించింది టిడిపి అనుకూల మీడియానే.ఎపిలో జగన్ వ్యతిరేక పోరాటంలో ఆమె వుండటం ఉపయోగమన్న అంచనాతోనే వారు వివేకానందరెడ్డి కుమార్తె సునీతనూ, షర్మిలను ప్రత్యేకంగా వార్తలలో నిలిపారు.తెలంగాణలో ప్రభుత్వ మార్పు తర్వాత ఆమె ఏపికి వస్తారనే కథనాలు ఈ క్రమంలోనే వచ్చాయి.ఇంతవరకూ ఆమె వాటిపై స్పందించింది లేదు గాని ఖండించనూ లేదు. ఎపి కాంగ్రెస్ నాయకులు ఢిల్లీవెళ్లి కాంగ్రెస్ అధిష్టానంతో సమావేశమై చర్చలు జరిపిన తర్వాత దాదాపు ఇదే ధృవపరిచారు. అయితే ఆమె ఏ సమయంలో వస్తారు, అధ్యక్ష పదవి ఇస్తారా వంటివే ఇప్పుడు తేలవలసి వుంటుంది.షర్మిల ఎపిలో ప్రవేశించడం సిఎం జగన్‌కు ప్రతికూలపరిణామమైనా ఆమె ఆయనపై ఏ విధంగా పోరాడతారో చూడవలసిందే. ఇదే సమయంలో వైసీపీలో టికెట్ల దుమారం మొదలైంది గనక బయిటకు వచ్చేవారిలో కొందరు ఆమె నాయకత్వంలో చేరవచ్చని అంచనాలున్నాయి.మంగళగిరి ఎంఎల్‌ఎగా వైదొలగిన ఆర్కే ఆ మేరకు ప్రకటన చేశారు కూడా. జగన్ వ్యతిరేక ఓట్ల చీలికకు ఇది ఎంతోకొంత కారణమవుతుందని టిడిపి వ్యూహకర్తలు భావిస్తున్నారు. అదెవరికి ఉపయోగమనే చర్చ కూడా నడుస్తున్నది.

ఎవరి పాత్ర ఏమిటి?

బిజెపితోటిడిపి కలిసేట్టయితే సిపిఐ కూడా వారితో విడగొట్టుకోకతప్పదని పరిశీలకులు భావిస్తున్నారు.తాము కాంగ్రెస్‌తో కలసి పోటీ చేస్తామని మరో సందర్భంలో సిపిఐ నేత ఒకరు సూచనగా అన్నారు. వామపక్షాలతో కలసి వెళతామని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు చెప్పారు. బిజెపితో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కలిసే ఎవరితోనూ తమకు సంబంధం వుండబోదని సిపిఎం ఇప్పటికే స్పష్టంగా ప్రకటించింది, తమతో పొత్తుపై టిడిపి కావాలనే ఎక్కువగా చెబుతున్నదని,ఇంకా నిర్ణయం జరగలేదని బిజెపి నేతలు కొందరంటున్నారు. ఇంకా చాలా మార్పులు చూడవలసి వుంటుందని జనసేన ఆఫీస్ బేరర్ ఒకరు జోస్యం చెప్పారు. బిజెపి మాట ఏమైనా ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్‌తో కలసి పోటీ చేయబోమని మాత్రం టిడిపి తేల్చి చెబుతున్నవిషయం.షర్మిల టిడిపి నేత లోకేశ్‌కు క్రిస్మస్ కానుక పంపడం, ప్రశాంత కిశోర్ చంద్రబాబును కలవడం పై మీడియా హైప్ ఎక్కువగా వచ్చింది తప్ప తమ విధానంలో మార్పు వుండదని వారంటున్నారు. ఈ లోగా సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ జై భారత్ నేషనల్ పార్టీ అంటూ స్థాపించి ప్రత్యేక హోదాను కీలక ఎజెండాగా ప్రకటించారు.మొదటి కార్యక్రమంగా వాజ్‌పేయి జయంతి జరిపారు!ఈ చిన్న పెద్ద విభిన్న రాజకీయ శక్తుల వైఖరి ఎలా వుండేది ఎన్నికల ప్రకటన తర్వాతనే స్పష్టమవుతుంది. తెలంగాణలో శాసనసభ ఎన్నికలు ముగిసినప్పటికీ లోక్‌సభ పోటీ కాంగ్రెస్ బిజెపి బిఆర్ఎస్‌ల మధ్య తీవ్రంగానే వుండవచ్చు. వచ్చే ఎన్నికల్లో తమకు 330 వరకూ స్థానాలు వస్తాయని బిజెపి చెబుతున్నా ఇండియా వేదిక పార్టీలు కలసి కట్టుగా సవాలు విసురుతున్న నేపథ్యంలో దక్షిణాదిలో సీట్లు పెంచుకోవాలని వ్యూహాలు రచిస్తున్నది. ఈ పూర్వరంగంలో ఎపి తెలంగాణలలో ప్రాంతీయ పార్టీలు బిజెపి ఛాయల్లోనే కొనసాగడం రాష్ట్రాలకు దేశంలో ప్రజాస్వామ్యానికి కూడా నష్టం కలిగించే విషయం.తెలంగాణలో కాంగ్రెస్ కూడా బిజెపిపై రాజకీయ సైద్ధాంతిక పోరాటం పదును పెంచవలసే వుంటుంది. ే అనేక రాష్ట్రాలలో ఆ పార్టీ తన స్థానిక ప్రత్యర్థులపై ఎక్కుపెట్టినంత గా బిజెపి మతతత్వంపై పోరాడాలని భావించడం లేదు. పెద్ద పార్టీగా లౌకిక శక్తుల ఐక్యత కోసం తగినంత కృషి చేయడమూ లేదు. మరో మూడు నాలుగు రోజుల్లో ఇండియా లో సర్దుబాట్లు పూర్తవుతాయని చెబుతున్న దృష్ట్యా ఏం జరుగుతుందో చూద్దాం.

2024: ముందున్నది మహా సమరం

వ్యాఖ్య

ఇజ్రాయిలీ వార్ మెషిన్ గాజాలో పాలస్తీనీయులను ఊచకోత కోస్తున్న కారు చీకట్లతో 2023 సంవత్సరం ముగుస్తోంది. దాదాపు మూడు నెలలుగా గాజాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న క్రూరమైన దురాక్రమణపూరిత దాడులకు ఇంతవరకు (డిసెంబర్ 23 వరకు) 21,672 మంది మరణించారు, వీరిలో 8,000కి పైగా పిల్లలే ఉన్నారు.మరో 56,165 మంది గాయపడ్డారు బాంబు దాడుల్లో కుప్పకూలిన భవన శిథిలాల కింద సమాధి అయినవారు ఎంత మంది ఉంటారో చెప్పలేని స్థితి.

పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధానికి అమెరికా పూర్తిగా మద్దతు ఇస్తున్నది, అక్టోబర్ 7న ఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి ఇజ్రాయెల్‌కు పెద్దయెత్తున ప్రాణాంతకమైన ఆయుధాలు, సామగ్రిని పంపింది. ఇప్పటికీ పంపిస్తున్నది. తక్షణమే కాల్పుల విరమణను కోరే ఏ తీర్మానాన్నీ ఐరాస భద్రతామండలిలో అమెరికా అనుమతించడం లేదు. తన వీటో పవర్‌ను ఉపయోగించి వాటిని అడ్డుకుంటున్నది. ఇజ్రాయెల్‌కు అమెరికా ప్రభుత్వం గట్టి మద్దతుగా నిలవడంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు. కానీ, భారత్ తీసుకున్న వైఖరే విడ్డూరంగా ఉన్నది. ఇజ్రాయెల్ చర్యలకు పూర్తి మద్దతు ప్రకటించడం ద్వారా మోడీ ప్రభుత్వం ఆ దేశానికి అనుకూలంగా పూర్తిగా మొగ్గింది. ఆ మొగ్గు ఎంతవరకు వెళ్లిందంటే అక్టోబరులో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో కాల్పుల విరమణకు పిలుపునిచ్చిన తీర్మానానికి భారత్ మద్దతు నిరాకరించేంతదాకా వెళ్లింది. కాల్పుల విరమణకు పిలుపునిచ్చే తీర్మానం డిసెంబర్‌లో రెండవ సారి జనరల్ అసెంబ్లీ ముందుకు వచ్చినప్పుడు మాత్రం భారతదేశం అయిష్టంగానే దానికి అనుకూలంగా ఓటు వేసింది. అలా చేయకపోతే ఆసియాలో భారత్ ఒంటరిపాటు అయి ఉండేది. ఎందుకంటే ఆసియాలోని అన్ని దేశాలూ కాల్పుల విరమణకు అనుకూలంగా ఓటు వేశాయి.

2023 మోడీ ప్రభుత్వ రెండవ పర్యాయంలో చివరి సంవత్సరం అన్న విషయం తెలిసిందే. భారత ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజానికి ఊపిరాడని స్థితిలో మరో ఏడాది గడిచిపోయింది. పార్లమెంటును కొత్త భవనంలోకి మార్చడం దాని కొత్త అవమానకరమైన స్థితికి ప్రతీక. ఈ ఏడాది చివరి పార్లమెంటు సమావేశంలో ప్రతిపక్షాలకు చెందిన 146 మంది పార్లమెంటు సభ్యులను సస్పెండ్ చేయడం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని మోడీ ప్రభుత్వం ఎలా కుళ్లబొడుస్తున్నదో తెలియజేస్తున్నది.

భారత దేశ లౌకిక రాజ్య స్వభావాన్ని నాశనం చేసే ప్రక్రియ ఎంత వేగంగా సాగిపోతున్నదీ ఇది తెలియజేస్తున్నది. న్యాయవ్యవస్థ లోపాయికారీ సహకారంతో, కాశీ, మథురలోని అసలు మత ప్రదేశాలను సవాల్ చేసి, వాటిని తిరిగి తెరచి, పరిశీలించడం జరుగుతున్నది. . అయోధ్యలోని రామ మందిర ప్రారంభ కార్యక్రమాన్ని కొత్త సంవత్సరంలో ప్రభుత్వ ప్రాయోజిత వేడుకగా నిర్వహించబోతున్నది.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

బిజెపి పాలిత రాష్ట్రాల్లో, మైనారిటీలను ద్వితీయ శ్రేణి పౌరుల స్థాయికి దిగజార్చేందుకు, ఆవు లేదా గొడ్డు మాంసం రవాణా చేస్తున్నారనో మరొకటనో ఆరోపించి వారిపై మూక దాడులు చేసి కొట్టి చంపడం లాంటివి నిత్యకృత్యంగా మారిపోయాయి.. ముస్లింలపై గో గూండాల దాడులకు బుల్డోజర్ ఒక సంకేతంగా మారింది.

మే నెల నుండి మణిపూర్ అత్యంత ఘోరమైన జాతి ఘర్షణలను చూసింది. ఏడు నెలల తర్వాత కూడా, లోయ, కొండ ప్రాంతాల మధ్య బఫర్ జోన్‌లో భద్రతా బలగాలతో మెయితీ, కుకీల మధ్య జాతి విభజన కొనసాగుతూనే ఉంది. ఈ ఆస్తుల విధ్వంసానికి బిజెపి ముఖ్యమంత్రి పక్షపాత రాజకీయాలే కారణం గనుక ఆయనే దీనికి బాధ్యత వహించాలి. అన్ని సామాజిక తరగతులతో చర్చలు జరిపి దీనికి రాజకీయంగా పరిష్కారం చూపడంలో కేంద్రం విఫలమైంది. సున్నితమైన జాతుల ప్రాంతంలో మెజారిటీ రాజకీయాల వల్ల జరిగే విధ్వంసానికి మణిపూర్ నిలువెత్తు నిదర్శనం.

2023లో ఫెడరలిజం తీవ్ర దాడికి గురైంది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వాల వ్యవహారాల్లో మరింత దూకుడుగా జోక్యం చేసుకోవడం, చట్టాలు చేసే రాష్ట్ర శాసనసభ హక్కులను నిరాకరించడం వంటివి చేస్తున్నారు. ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీం కోర్టు తీర్పు, జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని కూల్చివేసి రెండు కేంద్రపాలిత ప్రాంతాలను ఏర్పాటు చేయడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ను ఉపయోగించడంపై తీర్పు ఇవ్వడానికి న్యాయమూర్తులు నిరాకరించడం వంటి చర్యలు ఫెడరల్ సూత్రాల దారుణ ఉల్లంఘనకు న్యాయపరమైన చట్టబద్ధత ముద్ర వేశాయి.

జిడిపి వద్ధి గణాంకాలను ఉటంకిస్తూ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్ అని మోదీ ప్రభుత్వం టామ్‌టామ్ వేసుకుంటోంది. కానీ, తలసరి జిడిపి పరంగా చూసే భారత్ 2023లో 2600 డాలర్లతో జి20 దేశాలలో అట్టడుగు స్థానంలో ఉంది. ఇంకా, ఏ వద్ధి రేటు నమోదు అయినా అది పెరిగిన ఉపాధి కిందికి మారలేదు. తాజా సిఎంఐఇ డేటా ప్రకారం, ఈ ఏడాది అక్టోబర్‌లో నిరుద్యోగిత రేటు 10.05గా ఉంది, ఇది గడచిన 21 నెలల్లో అత్యధికం. అందులోనూ యువతలో నిరుద్యోగిత 23.22 శాతంగా ఉంది.

నిత్యావసర సరుకుల ధరలు, ముఖ్యంగా ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్నంటుతూ పేద ప్రజల నడ్డి విరుస్తున్నాయి. వాస్తవ వేతనాలు క్షీణించడం, ఆకాశాన్నంటుతున్న ధరల, అంతులేని నిరుద్యోగంతో ప్రపంచ ఆకలి సూచీలో భారతదేశం యొక్క ర్యాంకింగ్ 125 దేశాలలో 111కి పడిపోయింది.

కార్పొరేట్–కమ్యూనల్ అపవిత్ర పొత్తు 2023లో కొట్టొచ్చినట్టు కనిపించింది. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ కంపెనీ అదానీ గ్రూప్ కార్పొరేట్ మోసాన్ని, స్టాక్ మానిప్యులేషన్‌ను బయటపెట్టడంతో అది అంతర్జాతీయ వార్తగా మారింది. కానీ మోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా గౌతమ్ అదానీకి రక్షణగా నిలిచింది. తనకు అత్యంత సన్నిహితుడైన ఆశ్రిత పెట్టుబడిదారునిపై తీవ్రమైన దర్యాప్తు జరపడానికి మొండిగా నిరాకరించింది. అదానీపై దాడిని భారతదేశంపై దాడిగా హిందూత్వ ప్రభుత్వం భావిస్తున్నది. మోదీ ప్రభుత్వం బడా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం పాటుపడుతున్నది. దీని ఫలితంగా ఆదాయ, సంపద అసమానతలు శిఖర స్థాయికి చేరాయి. జనవరి 2023లో విడుదల చేసిన ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం , సంపన్నులైన ఒక శాతం మంది దేశ సంపదలో 40 శాతానికి పైగా కలిగి ఉన్నారు, అయితే జనాభాలో సగం దాకా ఉన్న అట్టడుగు ప్రజానీకం కేవలం 3 శాతం మాత్రమే పంచుకున్నారు.

2023లో అణచివేత సాధనాలకు మరింత పదును పెట్టడం ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని కేంద్ర దర్యాప్తు సంస్థలను పెద్ద యెత్తున దుర్వినియోగపరచడం జరిగింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌ల దాడులు, అరెస్టులు అధికార పార్టీ చేతుల్లో అస్త్రాలుగా మారాయి.

మొన్నటి పార్లమెంటు శీతాకాల సమావేశాల ముగింపులో ప్రతిపక్షం లేకుండానే, మూడు కొత్త క్రిమినల్ చట్ట బిల్లులను ఆమోదించారు. దీంతో వలసవాద వారసత్వ అవశేషాలను తొలగించేసినట్లు చెప్పారు. నిజానికి ఇది వలసరాజ్యాన్ని పున్ణ ప్రతిష్ఠించే మరో రూపమే. కొత్త క్రిమినల్ చట్టాలలో పౌరుల ప్రాథమిక భద్రతలను తొలగించి, పోలీసు రాజ్యాన్ని రుద్దే అనేక నిబంధనలు ఉన్నాయి.

ఈ కార్పొరేట్ – మతతత్వ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు పోరాడుతున్నారు. కార్మిక, కర్షక వర్గాలకు ప్రాతినిధ్యం వహించే కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా కలసి సెప్టెంబర్‌లో నిర్వహించిన ఉమ్మడి సదస్సు నవంబర్‌లో మూడు రోజుల మహా పడావ్ పిలుపునిచ్చాయి . ఈ ఉమ్మడి నిరసన చర్యకు ముందు దేశంలోని వివిధ ప్రాంతాలలో వివిధ వర్గాల కార్మికులు రైతుల అనేక పోరాటాలు నిర్వహించారు. బిజెపి ప్రభుత్వ నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా దేశంలో చాలా చోట్ల వివిధ సెక్షన్ల కార్మిక, రైతు పోరాటాలు అనేకం జరిగాయి.

2023 చివరి సగంలో ప్రతిపక్ష పార్టీలు కలిసి 28 పార్టీలు కలసి ఇండియా వేదికగా ఏర్పడ్డాయి. 2024 ఏప్రిల్–మే నెల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడటమే ప్రతిపక్షాల కలయిక లక్ష్యం. ఇది రాజ్యాంగ మౌలిక లక్షణాలైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం పరిరక్షణకు సాగించే పోరాటం.

కొత్త సంవత్సరం 2024, భారతదేశ భవిష్యత్తును నిర్ణయించే ఓ మహా సమరానికి సాక్షిగా నిలవనుంది.

(డిసెంబర్ 31, 2023)

పుస్తకాల పండుగ

కవిత

విజయవాడ కు విచ్చేసింది
పుస్తకాల పెద్ద పండుగ ..!
పుస్తక ప్రేమికులకు సైతం
మస్తుగా మస్తకాలు నిండగా..!
ప్రతి సంవత్సరం బెజవాడ లో
జనవరిలో జరుగుతోంది
అక్ష రాల సంపదతో భారీ జాతర ..!

కొత్త పాత పాఠకులు ,మేథావులు
ఊరు విడిచి ఉత్కంఠగా వస్తారు
కొత్త కితాబులు గుత్త గా కొనుగోలు చేస్తారు ..!

ప్రజా శక్తి వారి ప్రఖ్యాతి ప్రచురణలు
విశాలాంధ్ర వారి విలువైన రచనలు
ఇతర ప్రచురణల వారి విశిష్ట ప్రచురణలు
పుస్తకాల మేళాలో పుస్తకాల పురుగులను
విస్తుపోయేలా చేస్తాయి చూస్తుంటే..!

నవలోకంలో విహరించే నవలలు
కంచికి చేరని మా మంచి కథలు
భావకులు ఇష్ట పడే నవ కవితలు
బాలలు చదువుకునే బాలమిత్ర కథలు
ఆబాల గోపాలం ఆకట్టుకునే కార్టూనులు

అగ్ర విమర్శ కుల శిఖరాగ్ర రచనలు
చేయి తిరిగిన చేవగల రచయితల గ్రంథాలు
వేయి పడగలు వంటి పెద్ద పుస్తకాలు
ప్రపంచ భాషల్లో ని మంచి కితాబులు
భారతీయ భాషలలో ని అమూల్య పుస్తకాలు ఎన్నెన్నో

చరిత్ర సృష్టించిన రచయితల గరిమ రచనలు
చరిత్ర, సైన్స్, వ్యక్తిత్వ వికాసం ,పరిశోధన,
భాషావిజ్ఞాన కోశాలు
విజయవాడలో వేలాది గా కొలువై ఉన్నాయి..!
ప్రియ మైన పాఠకులు లారా..రయంగా రండి
అక్ష రాల పరిమళాలు మనసారా ఆస్వాదించండి..!

– జి. సూర్య నారాయణ, 6281725659

'కరోనా మరణం కాదు'..!

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్ (సత్యసాయి జిల్లా)

సత్యసాయి జిలాల్లా కేంద్రంలోని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో వ్యక్తి మృతికి కారణం కరోనా కాదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణారెడ్డి, డిప్యూటీ వైద్యాధికారి ఐనొద్దీన్ మాట్లాడారు. జిల్లాలో కోవిడ్ బాధితులు ఎవరూ లేరన్నారు. ప్రజలు కోవిడ్ పై వచ్చే పుకార్లను నమ్మి భయాందోళనకు గురికానవసరం లేదన్నారు.ముందస్తు చర్యలలో భాగంగా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గల 41 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఒక్కొక్క ఆరోగ్య కేంద్రం పరిధిలో 150 కోవిడ్ పరీక్ష కిట్లను అందుబాటులో ఉంచామన్నారు. పుట్టపర్తి ఆసుపత్రిలో శుక్రవారం మృతిచెందిన వ్యక్తికి ఇదివరకే అనారోగ్య సమస్యలు ఉన్నాయని ఆ సమస్యతోనే ఆయన మృతి చెందారని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు కోవిడ్ కేసులు నమోదు కాలేదని చెప్పారు.

'కన్నూర్ విసి పునర్ నియామకం'పై కేరళ రివ్యూ పిటీషన్

న్యూఢిల్లీ : కన్నూర్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌గా డాక్టర్ గోపీనాథ్ రవీంద్రన్ పునర్ నియామకాన్ని రద్దు చేస్తు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేరళ ప్రభుత్వం శనివారం రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. గోపీనాథ్ వైస్ ఛాన్సలర్‌గా అర్హతపై ఎవ్వరిటీ ఎలాంటి సందేహాలు లేవని, పిటిషనర్లు కూడా లేవనెత్తని వాదన ఆధారంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని కేరళ ప్రభుత్వం తన రివ్యూ పిటిషన్‌లో పేర్కొంది. డాక్టర్ గోపీనాథ్ రవీంద్రన్ గొప్ప విద్యావేత్త అని పేర్కొంటూ, రివ్యూ పిటిషన్‌లో ఆయన సాధించిన విజయాలను కేరళ ప్రభుత్వం ప్రస్తావించింది. అలాగే ఈ పిటీషన్‌ను బహిరంగ కోర్టులో విచారించాలని కూడా పిటిషన్‌లో కేరళ ప్రభుత్వం కోరింది. కన్నూర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా డాక్టర్ గోపీనాథ్ రవీంద్రన్‌ను మరోసారి నియమిస్తూ కేరళ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు నవంబర్ 30న రద్దు చేసింది.

పాడేరు వైద్య కళాశాలలో పోస్టులను ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలతో భర్తీ చేయాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు వైద్య కళాశాలలో భర్తీ చేయనున్న 264 ఉద్యోగాలను జిఒ నెంబర్ 68 ప్రకారంగా ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ నిరుద్యోగ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్ డిమాండ్ చేశారు. విఆర్.పురంలో మండలంలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాడేరు వైద్య కళాశాలలో వివిధ స్థాయిల్లో 264 ఉద్యోగుల భర్తీకి ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసి ఉందని తెలిపారు. ఈ మెడికల్ కాలేజ్ ఉన్నది పూర్తిగా ఐదవ షెడ్యూల్‌లో ఉన్న 1/70, పీసా, అటవీ హక్కుల చట్టం మొదలైన ప్రత్యేక చట్టాలు కలిగి ఉండే ప్రాంతమని, అందువల్ల ఈ ఉద్యోగాలను జనరల్ రిక్యూట్‌మెంట్ విధానంలో కాకుండా స్థానిక షెడ్యూల్ తెగల అభ్యర్థులతో భర్తీ చేయాలని కోరారు. ల్యాండ్ టైటిలింగ్ 2023 చట్టం వల్ల ఆదివాసీ సమాజం తీవ్రంగా నష్టపోతుందని, అందువల్ల ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ డివిజన్ నాయకులు వెటకాని మల్లయ్య, పాయం లక్ష్మణ్‌రావు, పూసం వేణు గోపాల్ పాల్గొన్నారు.

పందెం కోళ్లు రెడీ!

- బరుల ఏర్పాటుకు సన్నాహాలు
- ఎన్నికల ఏడాది కావడంతో రాజకీయ బరులు
- గతేడాది 200పైనే బరుల్లో పందేలు
- చేతులు మారిన రూ.250 కోట్లు



గత సంక్రాంతిలో తాళ్లరేవు మండలం జార్జిపేటలో రాష్ట్ర స్థాయి బరిలో ఫ్లడ్ లైట్ల వెలుతురులో నిర్వహిస్తున్న కోడి పందేలు (ఫైల్)

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

సంక్రాంతి పండగ నేపథ్యంలో ఈ ఏడాది కూడా జూదరులు కోడిపందేల నిర్వహణకు సై అంటున్నారు. ఎన్నికల సంవత్సరం కావడంతో రాజకీయ బరులు రెడీ అవుతున్నాయి. గతేడాది మాదిరిగానే ఎక్కడికక్కడ బరులు సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటికే కొన్నిచోట్ల భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. అధికార పార్టీ నేతల సమక్షంలో ఈ పందేల నిర్వహణకు ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే కొందరు స్థానిక ఎంఎల్‌ఎలు, నేతల నుంచి నిర్వాహకులు అన్ని రకాలుగా మద్దతు తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. బరులకు సంబంధించి భారీ మొత్తంలో మామూళ్లు కూడా సమర్పించుకున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఐ.పోలవరం, కాట్రేనికోన, మలికిపురం, సఖినేటిపల్లి, పి.గన్నవరం, రావులపాలెంలో ఈ ఏడాది భారీ బరుల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వీటికి అనువైన స్థలాలను నిర్వాహకులు ఎంపిక చేసుకునే పనిలో ఉన్నట్టు సమాచారం. కాకినాడ జిల్లాలో పిఠాపురం, గొల్లప్రోలు, తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట, తొండంగి, కరప, కాజులూరు మండలాలు, తూర్పుగోదావరి జిల్లాలో నిడదవోలు, కొవ్వూరు, గోకవరం, రాయవరం తదితర ప్రాంతాల్లో బరుల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. నూతన సంవత్సర వేడుకలు కూడా కొన్ని ఈ బరుల ప్రాంతాల్లోనే ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు అనుమతులు తీసుకున్నట్టు సమాచారం.

చేతులు మారనున్న రూ.కోట్లు

సంక్రాంతి పండగ మూడు రోజులూ పలు ప్రాంతాల్లో ఫ్లడ్ లైట్ల వెలుతురులో కూడా కోడిపందాలు జోరుగా సాగుతాయి. ఒక్కో బరి వద్ద రోజుకి 20 రౌండ్లలో కోడి పందేలు జరుపుతారు. ఒక్కో రౌండ్‌కు చిన్న బరుల్లో రూ.లక్ష నుంచి రూ.10 లక్షలు, పెద్ద బరుల్లో రూ.5 నుంచి 20 లక్షలు, రాష్ట్ర స్థాయి బరుల్లో రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్లు చేతులు మారతాయి. గత సంక్రాంతికి రూ.250.కోట్లకుపైగా నగదు చేతులు మారింది. గత సంక్రాంతికి భీమవరం, కోనసీమ జిల్లా, హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, విశాఖ తదితర ప్రాంతాల నుంచి సైతం పందేల్లో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కాకినాడ రూరల్, తాళ్లరేవు బరుల వద్దకు ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ, సినీనటులు హాజరై పందేల్లో పాల్గొన్నారు.

ఊపందుకున్న పందెం కోళ్ల అమ్మకాలు

సంక్రాంతి సందర్భంగా పందెం కోళ్ల అమ్మకాలు ఇప్పటికే ఊపందుకున్నాయి. ఎక్కువగా జగ్గంపేట, ఏలేశ్వరం, కోటనందూరు, కోనసీమలో రావులపాలెం, ఐ.పోలవరం, కాట్రేనికోన, తూర్పుగోదావరిలో నిడదవోలు, కొవ్వూరుల్లో ఎక్కువగా పందెం కోళ్ల పెంపకందారులు ఉన్నారు. ఎనిమిది నెలల క్రితం నుంచే ఈ కోళ్ల పెంపకంలో వారు బిజీ అయ్యారు. ప్రస్తుతం సీజన్ కావడంతో కోళ్లను విక్రయిస్తున్నారు. ఒక్కో పందెం కోడి రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకూ విలువ చేసేవి ఉన్నాయని పెంపకందారులు చెబుతున్నారు. ఈ సీజన్‌లోనే ఎక్కువగా కోళ్ల అమ్మకాలు ఉంటాయని, తమ వద్దకు రాజకీయ నాయకులు సైతం పందెం కోళ్ల కోసం వస్తుంటారని నిర్వాహకులు చెబుతున్నారు.

'నాన్ షెడ్యూల్డ్' గిరిజనులకు డిప్యూటీ సిఎం ద్రోహం

- ఐదో షెడ్యూల్‌లో చేర్చడాన్ని అడ్డుకున్న బూడి, చోడవరం, నర్సీపట్నం ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

అనకాపల్లి జిల్లాలోని నాన్ షెడ్యూల్డ్ ఏరియా గిరిజన గ్రామాలను రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్‌లో చేర్చే ప్రతిపాదనలను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, చోడవరం, నర్సీపట్నం ఎమ్మెల్యేలు అడ్డుకున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాన్ షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను 5వ షెడ్యుల్‌లో చేర్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన గిరిజన గ్రామాల జాబితాలను ఏడాది క్రితం అడగ్గా, దీనిపై తహశీల్దార్లు సంబంధిత గిరిజన గ్రామాల జాబితాలు తయారు చేసి పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారికి అప్పట్లోనే పంపించినట్లు తెలిపారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలు నాయుడు, చోడవరం నర్సీపట్నం ఎమ్మెల్యేల అభిప్రాయాలు కోరగా.., ఇప్పటికే నాన్ షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలన్నీ అన్ని విధాలుగా అభివృద్ధి చెందాయని, పైగా భూస్వాములు నుండి తమకు సమస్యలొస్తాయని చెప్పి ఆ ప్రతిపాదనల జాబితాలను పంపించవద్దని అడ్డుపడ్డారని తెలిపారు. వీరి చర్యలు చారిత్రాత్మిక తప్పిదమన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్ళు గడిచినా నేటికీ నాన్ షెడ్యూల్డ్ ఏరియా గిరిజనులు కనీస వసతులకు నోచుకోలేదని, పేరుకే గిరిజనులుగా బతుకుతున్నా వీరికి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లోనూ, 1/70 వంటి గిరిజన చట్టాలు అమల్లోనూ నష్ట పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక గ్రామాలకు రహదారుల్లేక నేటికీ డోలిమోతలు తప్పడం లేదన్నారు. చేతిలో బెల్లం పెట్టి, ముక్కుపుల్ల లాక్కున్న చందంగా నాన్ షెడ్యూల్డ్ ఏరియా గిరిజనుల పట్ల డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు వైఖరి ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకొని నాన్ షెడ్యూల్డ్ ఏరియా గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని, జిల్లాలోని గిరిజనులకు ఐఎఎస్ అధికారితో కూడిన ఐటిడిఎను ఏర్పాటు చేయాలని వెంకన్న డిమాండ్ చేశారు. లేకుంటే చరిత్రహీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు.



సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న రవీంద్ర ఇండియన్ పబ్లిక్ స్కూల్ చిన్నారులు

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం

- కేంద్ర ప్రభుత్వ చర్యలను ఎదుర్కొందాం
- ధూం.. ధాంలో వక్తలు

ప్రజాశక్తి- గాజువాక (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందామని, కేంద్ర ప్రభుత్వ చర్యలను ఎదుర్కొందామని 'ధూం.. ధాం'లో వక్తలు పిలుపునిచ్చారు. ప్రజానాట్య మండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన గాజువాకలో మూడు రోజులుగా నిర్వహించిన ధూం.. ధాం కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ.. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మాలని బిజెపి ప్రభుత్వం మూడేళ్ల క్రితం ప్రకటన చేసిందన్నారు. దీంతో తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆందోళన ప్రారంభించారని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను బలహీనపరచాలని బొగ్గును సరఫరా చేయకుండా, నిర్వహణ కోసం బ్యాంకుల నుంచి డబ్బులు ఇవ్వకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. తీవ్రమైన నష్టాల్లోకి దిగజార్చాలని చూస్తోందని తెలిపారు. వారం రోజుల క్రితం బిఎఫ్‌ను ప్రయివేట్ సంస్థకు అప్పజెప్పిందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను ముక్కలు ముక్కలు చేసి ఎన్నికల్లో ముడుపులు సహాయం చేసిన వారికి ధారాదత్తం చేయాలని చూస్తోందని విమర్శించారు. ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు ప్రజానాట్యమండలి చేపట్టిన ధూం.. ధాం కార్యక్రమాన్ని అభినందించారు. మాజీ కార్పొరేటర్ బొట్ట ఈశ్వరమ్మ మాట్లాడుతూ ప్రజానాట్య మండలి చేస్తున్న ఈ కార్యక్రమం మరిన్ని ప్రాంతాలకు విస్తరించి ప్రజలను చైతన్య పరచాలని కోరారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు..

ధూం.. ధాం కార్యక్రమంలో భాగంగా చిన్నారుల నుంచి పెద్దల వరకు చేసిన వివిధ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దేశభక్తి గేయాలు, రైతు కష్టాలు, విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకాలపై చేసిన ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. ప్రదర్శనలిచ్చిన కళాకారులందరికీ అతిథుల ద్వారా జ్ఞాపికలను అందించారు.

గంజాయి నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- రహదారి భద్రతపై అవగాహన
- సెల్‌ఫోన్ల రికవరీలో ప్రథమ స్థానం
- భోగాపురం, ఎస్.కోట స్టేషన్ల అప్‌గ్రేడ్ : ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గంజాయి నిత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్‌పి ఎం.దీపికా పాటిల్ తెలిపారు. రహదారి భద్రతపై అవగాహన విస్తృత అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. సెల్‌ఫోన్ల రికవరీలో విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. భోగాపురం, ఎస్.కోట స్టేషన్ల అప్‌గ్రేడ్ చేశామని వివరించారు. తన ఛాంబర్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో 2023లో జిల్లాలో జరిగిన నేరాలు..పోలీసుశాఖ తీసుకున్న చర్యలు, సాధించిన విజయాల గురించి వివరించారు. గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులను, యువతను చైతన్యపర్చేందుకు కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. కన్విక్షన్ పోలీసింగులో భాగంగా పోక్సో మరియు కొన్ని తీవ్రమైన నేరాల్లో నిందితులు శిక్షింపబడే విధంగా చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో సివిల్ రైట్స్ డేను ప్రతీనెలా పాటిస్తూ, ప్రజలకు ఎస్‌సి, ఎస్‌టి చట్టం, పోక్సో, మహిళల రక్షణకు ఉపయోగపడే చట్టాల పట్ల అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టామని, ఫలితంగా ఎస్సీ, ఎస్టీలపై దాడులు తగ్గాయని తెలిపారు. 2023లో 11 పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారయ్యాయన్నారు. రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత కల్పించి, ఎన్‌ఫోర్సుమెంట్ కేసులు, ఎంవి నిబంధనలు అతిక్రమించిన వారిపైనా, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపైన కేసులు నమోదు చేయడంతో సత్ఫలితాలిస్తున్నా యన్నారు. మహిళా సంరక్షణ పోలీసుల ద్వారా ప్రజలకు లోన్ యాప్‌లు, దిశ ఎస్ఒఎస్. యాప్, సైబరు నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత చర్యల పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. పోయిన మొబైల్ ఫోనులను తిరిగి కనుగొనేందుకు ఫిర్యాదు దారులు పోలీసు స్టేషనుల చుట్టూ పదే పదే తిరగకుండా ప్రత్యేకంగా ఒక పోర్టల్ ను రూపొందించి, రాష్ట్రంలో మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా నిలిచామన్నారు. ఈ పోర్టల్ కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 1100 మొబైల్స్‌ను తిరిగి స్వాధీనం చేసుకొని, బాధితులకు అప్పగించామన్నారు. గుర్ల పోలీసు స్టేషను పరిధిలోని ఎస్.ఎస్.ఆర్.పేట గ్రామానికి చెందిన నిందితులు ఎ.ఆర్ బెనిఫిట్ ఫుడ్ సంక్రాంతి కానుక (పప్పుల చిట్టీ) పేరుతో డిసెంబరు మాసంలో ప్రజలను మోసగించిన కేసును చేధించి, నిందితులను అరెస్టు చేసి, వారి ఆస్తులను అటాచ్ చేసి, వారి వద్ద నుండి రూ. 1.40 కోట్లు నగదును రికవరీ చేసామన్నారు. జిల్లాలో భోగాపురం, ఎస్.కోట పోలీసు స్టేషనులను అప్ గ్రేడ్ చేసామన్నారు. అదనంగా టాస్క్ ఫోర్స్ మరియు సోషల్ మీడియా సెల్ కు రెండు ఇన్స్పెక్టరు పోస్టులు మంజూరయ్యాయని ఎస్‌పి తెలిపారు. సమావేశంలో దిశ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, ట్రాఫిక్ డిఎస్‌పి డి.విశ్వనాథ్, డిసిఆర్‌బి సిఐ కెకెవి విజయనాథ్, డిసిఆర్‌బి సిఐ జె. మురళి పాల్గొన్నారు.

స్విమ్స్‌లో కార్మిక సమస్యలు పరిష్కరిస్తాం : డైరెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

స్విమ్స్ ఆసుపత్రిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచుతామని, వేధింపులకు గురి చేసే పద్ధతులను ఏమాత్రం సహించేది లేదని, కాంట్రాక్టు కార్మికులు తమ కుటుంబంలో భాగమేనని, తొలగించిన కార్మికులందరినీ ఉద్యోగాల్లోకి తీసుకుంటామని స్విమ్స్ ఆసుపత్రి డైరెక్టర్ ఆర్వి కుమార్ ప్రకటించారు. శనివారం ఉదయం స్విమ్స్ కాంట్రాక్టు, ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. స్విమ్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేత రవి అధ్యక్షతన ధర్నా జరిగింది. ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ప్రసంగిస్తూ స్విమ్స్ ఆసుపత్రి టిటిడీ యాజమాన్యంలోకి వచ్చిన తరువాత కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు గణనీయంగా పెరిగాయని, పని భారం విపరీతంగా పెరిగిందని వేతనాలు పెంచలేదని ఆరోపించారు. గతంతో పోలిక చేస్తే కార్మికులకు కష్టాలు విపరీతంగా పెరిగాయని అన్నారు. మహిళా కార్మికులు తీవ్రమైన ఆవేదన చెందుతున్నారని వివరించారు. ఐఎఎస్ అధికారి పర్యవేక్షణలో ఆస్పత్రి ఉన్నప్పటికీ చట్టవ్యతిరేకంగా కార్మికులను తొలగించడం దారుణమన్నారు. పలుమార్లు తమ సమస్యలు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు టి.సుబ్రమణ్యం, జి.నాగ వెంకటేష్, టి.మునిరాజా, గంగులప్ప పాల్గొన్నారు. జనవరి మొదటివారంలో కార్మికులతో సమావేశం జరిపి నిర్ణయాలు ప్రకటిస్తామని డైరెక్టర్ ఆర్వి కుమార్ తెలిపారు.

జిందాల్‌తో ఒప్పందాన్ని బయటపెట్టాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు జిందాల్‌తో చేసిన ఒప్పందాన్ని బయటపెట్టాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ డిమాండ్‌చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదన రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 1003వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (ఎఐటియుసి) కార్మికులు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని లలితమ్మ ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే కుట్రలో భాగంగా రహస్యంగా జిందాల్‌తో ఒప్పందాలు చేసు కుంటున్నారని విమర్శించారు. రూ.లక్షల కోట్ల ఆస్తులు కలిగిన స్టీల్‌ప్లాంట్‌ను కారు చౌకగా ప్రైవేటు వ్యక్తికి అమ్మ జూపాలని చూడడం దేశద్రోహ చర్య అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు జిఎస్‌జె.అచ్యుతరావు, ఎం.మన్మధరావు, కసిరెడ్డి సత్యనారాయణ, కె.అచ్యుతరావు, డి.తిరుపతి, సిహెచ్.సత్యనారాయణ, ఎ.అజయ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి చేటు కాలం

- చట్టసభలలో నియంతృత్వ పోకడలు
- ప్రభుత్వ జేబు సంస్థలుగా ఈసీ, కాగ్
- బిజెపిలోనూ పెరుగుతున్న సీల్డ్ కవర్ సంస్కృతి

న్యూఢిల్లీ : భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు చేటు కాలం దాపురించిందని పలువురు పరిశీలకులు, రాజ్యాంగ నిపుణులు, సీనియర్ పాత్రికేయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్, కాగ్ వంటి ప్రజాస్వామిక సంస్థలపై మోడీ ప్రభుత్వ పెత్తనం పెరిగిపోతోందని వారు గుర్తు చేశారు. చివరికి భారత పార్లమెంట్ సైతం టర్కీ అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డగాన్‌కు చెందిన గ్రాండ్ నేషనల్ అసెంబ్లీ మాదిరిగా కన్పిస్తోందని వ్యాఖ్యానించారు.

తమది ప్రజాస్వామిక పార్టీ అని ఘనంగా చెప్పుకునే బిజెపిలోనూ సీల్డ్ కవర్ సంస్కృతి "వర్ధిల్లుతోంది". ఇటీవల హిందీ రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికలలో బీజేపీ సాధించిన విజయాలు మోడీలో సమధికోత్సాహాన్ని రేకెత్తించాయి. బీజేపీని సంస్థాగతంగా కేంద్రీకృతం చేసే పని దిగ్విజయంగా పూర్తయింది. ఆంతరంగిక నిపుణుల సలహా మేరకు అమిత్ షా నిర్ణయించిన వ్యక్తులే ముఖ్యమంత్రులు అయ్యారు. గతంలో మాదిరిగా పార్లమెంటరీ బోర్డు ఆమోదం, కేంద్ర పరిశీలకుల నివేదికలు వంటి ప్రక్రియలకు అవకాశమే లేకుండా పోయింది. దీనికి బదులుగా ముఖ్యమంత్రి పదవులకు అధిష్టానం ఎంపిక చేసిన వ్యక్తుల పేర్లతో ఉన్న సీల్డ్ కవర్లు తీసుకొని, కేంద్ర పరిశీలకులు రాష్ట్రాలకు వచ్చారు. వాటిని శాసనసభాపక్ష సమావేశాలలో తెరిచి, ముఖ్యమంత్రుల పేర్లను ప్రకటించారు. సీల్డ్ కవర్ సంస్కృతి అంటే అందరికీ తెలిసిందే. దానిని శాసనసభ్యులందరూ విధిగా గౌరవించి, శిరసావహించాల్సిందే.

సీఎం అంటే తోలుబొమ్మే

శాసనసభ్యులలో మెజారిటీ సభ్యుల అభిప్రాయం మేరకు ముఖ్యమంత్రిని ఎంచుకునే పాత రోజులు పోయాయి. ఇప్పుడు ఎంపికైన ముఖ్యమంత్రులు పార్టీ ఎమ్మెల్యేలకు కాకుండా అధిష్టానానికే జవాబుదారీగా ఉండాలి. అధిష్టానం చెప్పింది చేయడం...అంటే తోలుబొమ్మల్లా వ్యవహరించడం మినహా వారు చేసేదేమీ ఉండదు. కాదంటే తక్షణమే పదవి ఊడిపోతుంది. ఉత్తరాఖండ్‌లో తిరత్ సింగ్ రావత్ నాలుగు నెలల పాలనకు చివరికి ఏమైందో తెలుసు కదా!. సీల్డ్ కవర్ సంస్కృతి గుజరాత్‌తోనే మొదలైంది. 2021లో విజయ్ రూపానీ స్థానంలో భూపేంద్ర పటేల్ ముఖ్యమంత్రి కావడంతో ఇది మొదలైంది. అదే విధానం ఇప్పుడు భజన్‌లాల్ శర్మ, మోహన్ యాదవ్, విష్ణుదేవ్ శాయ్ ఎంపిక విషయంలోనూ కొనసాగింది. వీరి ఎంపికలో అనుసరించిన ఏకైక సూత్రం వీరి విధేయత... వీరి గురించి ఇతర రాష్ట్రాలలో ఎవరికీ తెలియదు. స్వరాష్ట్రంలోనూ తెలిసింది బహు తక్కువ మందికే. వీరికి ఉన్నదల్లా బీజేపీ అధిష్టానం మద్దతు. అంతే...

చట్టసభలోనూ నియంతృత్వ పోకడలే

ఇప్పుడు పార్లమెంటులో సైతం ఇదే తరహా నియంతృత్వ పోకడలు కన్పిస్తున్నాయి. ఇటీవల ముగిసిన శీతాకాల సమావేశాలలో 146 మంది ఎంపీలపై... (లోక్‌సభకు చెందిన వంద మంది, రాజ్యసభకు చెందిన 46 మంది...) సస్పెన్షన్ వేటు వేశారు. ఘనత వహించిన మోడీ పాలనలో 71 సందర్భాలలో సస్పెన్షన్లు, బహిష్కరణలు చోటుచేసుకోవడం గమనార్హం. 2019 నుండి సభ్యులను చీటికీమాటికీ సస్పెండ్ చేయడం సభాపతులకు ఆనవాయితీగా మారింది. శీతాకాల సమావేశాలలో ఈ ధోరణి పరాకాష్టకు చేరింది. లోక్‌సభలో స్పీకర్, రాజ్యసభలో ఛైర్మన్ ప్రతి రోజూ సభ్యుల పేర్లతో జాబితాను రూపొందించుకొని, క్రమశిక్షణను ఉల్లంఘించారని చెబుతూ వారి పేర్లు చదివి సస్పెండ్ చేసినట్లు ప్రకటించేవారు. ఓ సందర్భంలో అయితే సభలో లేని సభ్యుడి పేరు సైతం చదివారు. అయితే ఆ సభ్యుడు జరిగిన పొరబాటును ఎత్తిచూపడంతో నాలిక కరుచుకొని సస్పెన్షన్‌ను ఎత్తివేశారు.



ప్రశ్నించడమే నేరమా?

లోక్‌సభలో చొరబడిన యువకులపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసులు పెట్టిన పోలీసులు వారు సభలో ప్రవేశించేందుకు వీలుగా పాస్‌లు ఇచ్చిన బీజేపీ ఎంపీని మాత్రం వదిలేశారు. ఎందుకంటే ఆయన తిలకధారుడు. నుదుటిపై త్రిశూలం నేపథ్యంలో విభూతి పెట్టుకుంటారు. ఇంతకీ సస్పెన్షన్‌కు గురైన ప్రతిపక్ష ఎంపీలు చేసిన మహాపరాధం ఏమిటంటే పార్లమెంటులో చోటుచేసుకున్న భద్రతా వైఫల్యంపై ప్రధాని, హోం మంత్రి సభలో ప్రకటన చేయాలని కోరడమే. ఇది వారికి ఉన్న చట్టబద్ధమైన హక్కు. గతంలో కూడా ప్రధానిని, కేంద్ర హోం మంత్రిని వివరణ కోరిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. సభ్యుల నిరసనల విషయంలో సభాపతులు ఉదారంగా వ్యవహరించే వారు.

అప్పుడలా...ఇప్పుడిలా

2001లో పార్లమెంటుపై దాడి జరిగినప్పుడు అప్పటి ప్రధాని వాజ్‌పేయి, హోం మంత్రి అద్వానీలు మోడీ-షా ద్వయం మాదిరిగా కాకుండా సభకు వచ్చి దాడిపై విచారణ జరుపుతున్నట్లు ప్రకటించారు. ఈ ఘటనపై ప్రభుత్వం ఉభయసభలలో స్వల్పకాలిక చర్చలకు కూడా అనుమతించింది. బీజేపీ ప్రతిపక్షంలో ఉండగా బొగ్గు కేటాయింపులపై వారాలతరబడి సభా కార్యక్రమాలను స్తంభింపజేసిన విషయం తెలిసిందే.

ఇప్పుడు సభాపతులు పార్లమెంటరీ క్రమశిక్షణ ఉల్లంఘన అని దేని గురించి అయితే చెప్పారో మోడీ ప్రభుత్వంలో కీలక మంత్రులైన సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ అప్పట్లో దానిని తీవ్రంగా వ్యతిరేకించారు. 2012 సెప్టెంబర్ 7న సుష్మా స్వరాజ్ ఏమన్నారో ఓసారి గుర్తుకు తెచ్చుకోండి. 'పార్లమెంట్ కార్యకలాపాలు సజావుగా సాగకుండా అడ్డుకోవడం ప్రజాస్వామిక నిరసనకు ఓ రూపం'. 2011 జనవరి 20న మోడీకి అత్యంత సన్నిహితుడైన జైట్లీ ఏమన్నారంటే 'కొన్ని విషయాలను పార్లమెంట్ విస్మరిస్తుంటే సభను అడ్డుకోవడం అప్రజాస్వామికం కాదు'. వీరిద్దరూ ఇప్పుడు సజీవులై లేరు. కానీ అప్పటి వారి మాటలకు, ఇప్పటి మోడీ ప్రభుత్వ చేతలకు ఎక్కడా పొంతన లేదు.

ప్రతిపక్షాలు లేకుండా...

శీతాకాల సమావేశాలలో ప్రతిపక్ష సభ్యులు సభలో లేకుండానే కీలక బిల్లులన్నీ క్షణాల మీద ఆమోదం పొందాయి. క్రిమినల్ న్యాయ వ్యవస్థపై ప్రభావం చూపే మూడు బిల్లులను అమిత్ షా సభలో ప్రవేశపెట్టి మూజువాణీ ఓటుతో ఆమోదింపజేసుకున్నారు. వీటిపై మరింత చర్చ జరగాలంటూ సాక్షాత్తూ బీజేపీకి చెందిన మహిళా ఎంపీలు కోరినా అరణ్యరోదనే అయింది. అనేక ఇతర కీలక బిల్లులు సైతం ఎలాంటి చర్చ జరగకుండానే సభ ఆమోదం పొందాయి.

ఈసీ స్వతంత్రతకు విఘాతం

తాజాగా జరిపిన చట్ట సవరణ ప్రకారం ఇప్పుడు ఎన్నికల కమిషనర్ల నియామకం విషయంలో ప్రభుత్వం మాటే చెల్లుబాటు అవుతుంది. నియామక కమిటీలో గతంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా ఉండేవారు. ఇప్పుడు ఆయన స్థానంలో ప్రధాని నియమించిన కేంద్ర మంత్రి ఒకరు సభ్యుడిగా ఉంటారు. ఇక కమిటీలో ప్రతిపక్ష నేత అభిప్రాయానికి విలువేముంటుంది? దీనిపై రిటైర్డ్ న్యాయమూర్తి, మాజీ సొలిసిటర్ జనరల్ రోహింటన్ ఎఫ్ నారిమన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ బిల్లు ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మృతప్రాయమైన కాగ్

ఇక కాగ్ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ప్రభుత్వ వ్యవస్థలలోని లోపాలను ఎత్తిచూపే ఈ సంస్థ ఇప్పుడు పూర్తిగా నిర్వీర్యమైపోయింది. 2020లో గుజరాత్ కేడర్ అధికారి గిరీష్ ముర్మును అధిపతిగా నియమించినప్పుడే కాగ్ మృతప్రాయమైంది. ప్రధాని మోడీకి ముర్ము నమ్మకస్తుడైన సహాయకుడు. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. అమిత్ షాతో కూడా ఆయన కలిసి పనిచేశారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలలో జరిగిన తప్పులను ఎత్తి చూపడానికే ముర్ము పరిమితమయ్యారు. కేంద్ర ఖాతాల పరిశీలనను ఆయన ఉద్దేశపూర్వకంగానే దాటవేశారు. అయినప్పటికీ ఆ వ్యవస్థలోని కొందరు నిజాయితీపరులైన అధికారుల కారణంగా కేంద్ర ప్రాజెక్టులలో లొసుగులపై అనేక నివేదికలు వెలుగు చూశాయి. అయితే అలాంటి అధికారులకు బదిలీలే బహుమతులయ్యాయి. ఆయుష్మాన్ భారత్, ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే అమలులో జరిగిన అవకతవకలను ఆ అధికారులు ఎత్తిచూపారు. కాగ్ సమర్పించిన కొన్ని నివేదికలైతే పార్లమెంట్ ముందుకు సైతం రాలేదు.

ఏదేమైనా మోడీ హయాంలో ప్రజాస్వామిక సంస్థలన్నీ నిస్తేజమైపోయాయని, ప్రభుత్వ అడుగులకు మడుగులొత్తే సంస్థలుగా మారాయని సీనియర్ పాత్రికేయుడు పి.రామన్ వ్యాఖ్యానించారు.

బాలికపై సామూహిక అత్యాచారం

- నిందితులిద్దరూ బాలురు

ప్రజాశక్తి-దర్శి (ప్రకాశం జిల్లా)
పదేళ్ల బాలికపై ఇద్దరు బాలురు అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రకాశం జిల్లా దర్శి నగర పంచాయతీ పరిధిలోని సాయినగర్‌లో జరిగిన ఈ అకృత్యంపై దర్శి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14న దర్శి పంచాయతీ పరిధిలోని సాయినగర్‌లోని ఓ ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు బాలురు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు, నిందితులు ఒకే సామాజిక తరగతికి చెందినవారు కావడంతో కుల పెద్దలు రాజీ ప్రయత్నాలు చేశారు. అది విఫలం కావడంతో శుక్రవారం రాత్రి పోలీసుస్టేషన్‌లో బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. బాలురపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు దర్శి ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఉద్యమాలు చేసే పరిస్థితులు తీసుకురావద్దు

- ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉద్యమాలు చేస్తేనే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే పరిస్థితులు తీసుకురావద్దని ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. విశాఖ కలెక్టరేట్ ఆవరణలోని రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో శనివారం సాయంత్రం మీడియాతో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ సంఘాలతో చర్చలకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించడం లేదని తెలిపారు. పాత పిఆర్‌సి బకాయిలకు దిక్కు లేదని విమర్శించారు. 12వ పిఆర్‌సి కమిటీకి కూర్చోవడానికి కుర్చీ లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఏప్రిల్ 2023 నాటికి పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. సిపిఎస్ ఉద్యోగుల పెన్షన్ ఏడాది కాలంగా ఇవ్వడం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విశాఖ వేదికగా గురజాడ కళాక్షేత్రంలో జనవరి ఏడున మున్సిపల్ ఎంప్లాయీస్ మొదటి రాష్ట్ర మహా సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.

భారత్ పే రెవెన్యూలో 182 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ఫిన్‌టెక్ వేదిక భారత్ పే 2022-23 ఆర్థిక సంవత్సరంలో 182 శాతం వృద్ధితో రూ.904 కోట్ల రెవెన్యూ సాధించినట్లు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది రూ.321 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. ఇదే సమయంలో రూ.886 కోట్ల నష్టాలను చవి చూడగా.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.158 కోట్ల నష్టాలకు తగ్గించుకుంది. అన్ని రకాల వ్యాపారా ల్లో వృద్ధిని నమోదు చేసినట్లు భారత్ పే మధ్యంతర సిఇఒ, సిఎఫ్ఒ నలిన్ నెగి పేర్కొన్నారు.

వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు తొలగించిన రైతులు

ప్రజాశక్తి-గుంతకల్ రూరల్ (అనంతపురం జిల్లా)
మండల పరిధిలోని గొల్లలదొడ్డి గ్రామంలో వ్యవసాయ పంపుసెట్లకు బిగించిన స్మార్ట్ విద్యుత్ మీటర్లను శనివారం రైతులు తొలగించారు. అంతకుముందు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, గుంతకల్లు రైతు సంఘం మండల కార్యదర్శి దాసరి శ్రీనావాసులు, రైతు సంఘం నాయకులు రామునాయక్ గ్రామంలో పర్యటించి వ్యవసాయ పంపు సెట్లకు బిగించిన స్మార్ట్ మీటర్ల ద్వారా జరిగే నష్టాన్ని రైతులకు వివరించారు. దీంతో రైతులు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇవ్వాలని, పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ఆపాలని, పెట్టిన మీటర్లను తొలగిస్తామని వ్యవసాయ పంపుసెట్ల కాంట్రాక్టర్లకు ఫోన్ ద్వారా తెలిపి మీటర్లను తీసుకెళ్లమన్నారు.

రాముడు ప్రపంచం మొత్తానికి చెందినవాడు
సోదరభావాన్ని పునరుద్ధరించాలి: ఫరూక్ అబ్దుల్లా

శ్రీనగర్: రాముడు కేవలం హిందువులకే కాదని, ప్రపంచం మొత్తానికి చెందినవాడని జమ్ముకాశ్మీర్ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) చీఫ్ ఫరూక్ అబ్దుల్లా అన్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి కృషి చేసిన ప్రజలందరినీ ఆయన అభినందించారు. శనివారం ఎఎన్ఐ వార్తా సంస్థతో ఫరూక్ అబ్దుల్లా మాట్లాడారు. 'రాముడు కేవలం హిందువులకు మాత్రమే చెందినవాడు కాదు. ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ఆయన చెందినవాడని నేను యావత్ జాతికి చెప్పాలనుకుంటున్నా' అని తెలిపారు. 'ఆయన (రాముడు) సోదరభావం, ప్రేమ, ఐక్యత, ఒకరికొకరు సహాయం చేసుకోవాలన్న సందేశాన్ని ఇచ్చారు. మన దేశంలో క్షీణిస్తున్న సోదరభావాన్ని పునరుద్ధరించాలని ఈ సందర్భంగా నేను దేశ ప్రజలకు చెప్పాలనుకుంటున్నా' అని అన్నారు.

ప్రచారం పైనే మోజు !

ప్రజల సొమ్ము సెల్ఫీ బూత్‌ల పాలు • గాలిలో దీపంలా ప్రయాణికుల భద్రత
- మోడీ ప్రచార వేదికలుగా రైల్వే స్టేషన్లు

రైల్వే స్టేషన్లకు ప్రతి రోజూ లక్షలాది మంది వస్తుంటారు. ప్రయాణించే వారు, వారికి వీడ్కోలు పలికేందుకు వచ్చే వారితో స్టేషన్లు అనునిత్యం కిటకిటలాడుతుంటాయి. రాజకీయ ప్రచారాలు ఆశించే వారికి రైల్వే స్టేషన్ల కంటే అనువైన వేదికలు ఎక్కడ లభిస్తాయి? అందుకే ప్రధాని మోడీకి, ఆయన ప్రభుత్వం సాధించిన విజయాలకు ప్రాచుర్యం కల్పించేందుకు ప్రభుత్వం రైల్వే స్టేషన్లను ఎంచుకుంది. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువేముంటుంది? రైల్వే స్టేషన్లే కాదు...విమానాలు కూడా ప్రభుత్వ ప్రచార కేంద్రాలుగా మారిపోయాయి.



న్యూఢిల్లీ : ప్రజల నుండి వసూలు చేసే పన్నులు, సుంకాలతోనే ప్రభుత్వాలు నడుస్తాయి. అయితే ఈ సొమ్ముకు ధర్మకర్తగా, జవాబుదారీగా వ్యవహరించాల్సిన పాలకులు దానిని పూర్తిగా విస్మరించి తమ స్వీయ ప్రచారం కోసం ఖర్చు చేస్తున్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇందుకు ఉదాహరణ. ప్రజల సొమ్మును అది ఎలా ఖర్చు చేస్తోందో పరిశీలిస్తే...

ఉదాహరణకు రైల్వే శాఖనే తీసుకుందాం. భారతీయ రైల్వేలో 19 జోన్లు ఉన్నాయి. వాటిలో సెంట్రల్ రైల్వే ఒకటి. దాని కేంద్ర కార్యాలయం ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్‌లో ఉంది. ఒక్క సెంట్రల్ రైల్వే పరిధిలోని స్టేషన్ల ప్లాట్‌ఫారాల పైనే 20 శాశ్వత సెల్ఫీ బూత్‌లు ఏర్పాటు చేశారు. అందుకోసం ఒక్కో దానిపై రూ 6.25 లక్షల చొప్పున మొత్తం రూ.1.25 కోట్లు ఖర్చు చేశారు. వీటితో పాటు 32 తాత్కాలిక బూత్‌లను కూడా ఏర్పాటు చేశారు. ఒక్కో దానిపై రూ.1.25 లక్షలు వ్యయం చేశారు. అంటే మొత్తంమీద రూ.40 లక్షలు ఖర్చయ్యాయి. వీటన్నింటినీ ఎందుకు ఏర్పాటు చేశారో తెలుసా? ఈ సెల్ఫీ బూత్‌లలో ప్రధాని నరేంద్ర మోడీ లైఫ్-సైజుతో 3డీ మోడల్ కటౌట్లు ఉంటాయి. ఇకపై రైలు ఆలస్యంగా వస్తోందని ప్రయాణికులు విసుగు చెందాల్సిన అవసరమే లేదు. ఎంచక్కా మోడీ కటౌట్ వద్ద నిలబడి సెల్ఫీ దిగవచ్చు. ఫోన్ కెమేరాతో తీసిన ఆ దృశ్యాన్ని సామాజిక మాధ్యమాలలో షేర్ చేసుకోవచ్చు. ఇదంతా మోడీకి ప్రాచుర్యం కల్పించేందుకు ఉద్దేశించినదేనని చెప్పాల్సిన పనే లేదు. ఇలా దేశంలోని రైల్వే స్టేషన్లన్నీ మోడీ ప్రచార వేదికలుగా మారబోతున్నాయి.

ఎన్ని ప్రమాదాలు జరిగినా...

రైల్వే స్టేషన్లలో సెల్ఫీ పాయింట్ల ఏర్పాటే ఇప్పుడు జాతీయ ప్రాధాన్యత కలిగిన విషయంగా మారిపోయింది. రైల్వే ప్రమాదాలు, వాటిలో ప్రాణనష్టం గురించి పెద్దగా ఆలోచించే వారే లేరు. ఈ ఏడాది జూన్ 2వ తేదీన ఒడిషాలోని బాలాసోర్ జిల్లా బహనగా రైల్వే స్టేషన్ సమీపంలో మూడు వేర్వేరు ట్రాక్‌లపై ప్రయాణిస్తున్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, గూడ్సు రైలు ప్రమాదానికి గురయ్యాయి. ఈ దుర్ఘటనలో ఎంతమంది చనిపోయిందీ ఇప్పటి వరకూ కచ్చితంగా ఎవరూ చెప్పలేదు. అయితే 300 మందికి మాత్రం తీవ్ర గాయాలయ్యాయి. గత సంవత్సరం జనవరి 13న పశ్చిమ బెంగాల్‌లోని అలీపూర్‌దార్ వద్ద బికనీర్-గౌహతి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ఘటనలో తొమ్మిది మంది చనిపోగా 36 మంది గాయపడ్డారు. 2017 ఆగస్ట్ 23న ఢిల్లీ వెళుతున్న కైఫియత్ ఎక్స్‌ప్రెస్ ఉత్తరప్రదేశ్‌లో పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో కనీసం 70 మంది గాయపడ్డారు. అదే సంవత్సరం ఆగస్ట్ 18న ముజఫర్‌నగర్‌లో పూరీ-హరిద్వార్ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 60 మందికి గాయాలయ్యాయి. 2016 నవంబర్ 20న కాన్పూర్ సమీపంలో ఇండోర్-పాట్నా ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. ఈ ఘోర ప్రమాదంలో కనీసం 150 మంది అశువులు బాసారు. సుమారు 200 మంది గాయపడ్డారు. ప్రభుత్వానికి ప్రచారాల మీద ఉన్న శ్రద్ధ ప్రమాదాల నివారణ మీద లేదు.

ప్రాధాన్యతలే వేరు

మరోవైపు రైల్వే భద్రత, ప్రయాణికులకు అవసరమైన స్లీపర్ బోగీలు, సీట్ల ఏర్పాటుకు కావాల్సిన నిధుల కేటాయింపునకు బడ్జెట్‌లో చోటే లేకుండా పోతోంది. దాని కంటే స్టేషన్లలో సెల్ఫీ బూత్‌ల ఏర్పాటుకే ప్రాధాన్యత లభిస్తోంది. వాస్తవానికి రైల్వేలో భద్రతా ప్రమాణాలు రానురానూ దిగజారిపోతున్నాయి. దానిని గురించి పట్టించుకునే నాథుడేడి? మరోవైపు నాన్-ఏసీ స్లీపర్ బోగీల సంఖ్యను బాగా తగ్గించి, సంపన్నుల ప్రయోజనాల కోసం ఏసీ బోగీలను పెంచుతున్నారు. ఫలితంగా పేద, మధ్యతరగతి ప్రజలు ప్రయాణించే బోగీలన్నీ కిటకిటలాడుతున్నాయి.

రైళ్ల కుదింపు... బోగీలు తగ్గింపు...

- పలు ఎక్స్‌ప్రెస్ స్లీపర్ కోచ్‌లకు భారీ కోత
- సామాన్యులకు భారంగా రైలు ప్రయాణాలు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో
ప్రజా జీవితాలతో ముడిపడి ఉండే ప్రధాన రవాణా సాధనం రైలు. పండగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజానీకం తమ ప్రయాణాలకు దీన్నే ఎక్కువగా ఎంచుకుంటారు. రైళ్ల కుదింపు, భోగీల తగ్గింపు వంటి చర్యలకు కేంద్రం పూనుకుంది. తిరుమల, గోదావరి, ఎల్‌టిటి, జన్మభూమి, కోరమండల్, కోణార్క్ ఇలా పలు రైళ్లలో భారీ స్థాయిలో స్లీపర్ కోచ్‌లకు కేంద్ర రైల్వే శాఖ కోత విధించింది. స్పీడ్ ట్రైన్‌లు, వందే భారత్ రైళ్ల మోజులో పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు క్రమంగా మంగళం పలుకుతోంది. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నెరవడం లేదు. పైగా, వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఎత్తేసింది.

విశాఖ మీదుగా తిరిగే 30 రైళ్లు పూర్తిగా రద్దు

విశాఖ మీదుగా దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే 125 రైళ్లలో 30 వరకూ కేంద్ర రైల్వే శాఖ పూర్తిగా రద్దు చేసింది. దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వేల్లో అప్ గ్రేడేషన్ పనులను సాకుగా చూపించి మరో 25 వరకూ రైళ్లను డైవర్షన్ చేశారు. తర్వాత వీటిని డిమోలిషన్ (రద్దు) చేశారు. ఆరు నెలలుగా ఈ తంతు నడుస్తోంది. దీంతో, ఏ రైలు చూసినా కిక్కిరిసిన జనంతో రావడం, మళ్లీ అలాగే వెళ్లడం నిత్యం కనిపిస్తోంది.

తెంచేసిన బోగీలు..

రెగ్యులర్‌గా నడిచే సింహాద్రి, ఉదయ్, రాజమండ్రి-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మచిలీపట్నం, కాకినాడ పాసింజరు రైళ్లు రద్దయ్యాయి. విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో 4, ప్రశాంతిలో 3, మచిలీపట్నంలో ఒక బోగిని తగ్గించేశారు. రాయగడ పాసింజర్‌కు జనరల్ బోగీలు పది ఉండేవి. ఇప్పుడు ఇవి మూడే ఉన్నాయి. కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో గతంలో 12 స్లీపర్ బోగీలు, 6 ఎసి బోగీలుండగా, 14 ఎసి బోగీలకు పెంచి స్లీపర్‌ను 3కు కుదించేశారు. విశాఖ నుంచి ముంబయికి వెళ్లే ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్‌కి గతంలో 10 స్లీపర్, 4 ఎసి బోగీలు ఉండగా 9 ఎసి చేసేసి, 4 స్లీపర్ ఉంచారు. భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు గతంలో 14 స్లీపర్ బోగీలు ఉండేది. ఇప్పుడు వీటిని మూడుకు కుదించి మిగతావన్నీ ఎసి చేశారు.

త్వరలో కొన్ని స్టేషన్లకు మంగళం?

ఈస్ట్ కోస్టు (వాల్తేరు) రైల్వే డివిజన్ పరిధిలో 115 స్టేషన్‌లు ఉన్నాయి. 250 రైళ్లు ఈ డివిజన్‌లో ప్రయాణాలు సాగిస్తున్నాయి. దీంట్లో, 130 రైళ్లు విశాఖ మీదుగా ప్రయనిస్తున్నాయి. గతంలో దక్షిణ మధ్య రైల్వేలో ఐదు స్టేషన్లను కేంద్రం ఎత్తేసింది. తాజాగా వాల్తేరు రైల్వే డివిజన్‌లో స్టేషన్లపై సమీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. రోజుకు వాల్తేరు రైల్వే పరిధిలో 50 వేల మంది ప్రయాణాలు చేస్తున్నారు. ఈ సంక్రాంతి పండగ వేళల్లో ఈ సంఖ్య లక్షా 20 వేలకు చేరుకొనే అవకాశం ఉందని రైల్వే డిఆర్ఎం కార్యాలయ అధికారులు చెబుతున్నారు. కానీ, రైళ్లు కానరావడం లేదు. ఆధునీకరణ, భద్రతా కారణాలను చూపుతూ రైల్వే శాఖ తరచూ గుణుపూర్, రాజమండ్రి పాసింజర్లను నెలల తరబడి రద్దు చేస్తూనే ఉంది.

బోగీల్లోకి అడుగు పెట్టలేని పరిస్థితులు



గతంలో తుని వెళ్లేందుకు ఉదయం రాజమండ్రి పాసింజర్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఉండేవి. సాధారణ టికెట్‌తో ప్రయాణం సులభం గా ఉండేది. ఇప్పుడు వందే భారత్, ఉదయ్ వంటి ఎసి రైళ్లను పెట్టి సాధారణ ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నారు. నాలాంటి వారు 300 మంది రోజువారీ రాజమండ్రి, కాకినాడ ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తున్నారు. బోగీల్లోకి అడుగుపెట్టలేని పరిస్థితులు ఉన్నాయి.

గోడి జయప్రకాష్, ప్రయివేట్ ఉద్యోగి, తుని, కాకినాడ జిల్లా

ప్రయాణం భారంగా మారింది




విశాఖ నుంచి మా ప్రాంతానికి వెళ్లేందుకు గతంలో పాసింజర్, డిఎం యులు అందు బాటు లో ఉండేవి. నేడు పలు రైళ్లు తీసేశారు. ఉన్న కొద్ది రైళ్లు రద్దీగా తిరుగుతున్నాయి. వాటిలో కొన్నింటికి బొబ్బిలి స్టాప్ తీసేశారు. ఒకటి అరా తిరిగే రైళ్లకు ఎసి బోగీలు పెట్టారు. రోజువారీ ప్రయాణం ఆర్థిక భారంగా మారింది.

మౌనిక, గృహిణి, బొబ్బిలి, విజయనగరం జిల్లా

మ్యానిఫెస్టోలో అంగన్‌వాడీల అంశం

- కుప్పంలో చంద్రబాబు ఉద్ఘాటన



కుప్పంలో అంగన్‌వాడీల సమస్యలు తెలుసుకుంటున్న చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, కుప్పం
'మీ డిమాండ్లు న్యాయసమ్మతం, టిడిపి మ్యానిఫెస్టోలో అంగన్‌వాడీల అంశం చేరుస్తాం' అని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారు. 20 రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఆందోళనకరమన్నారు. కుప్పం సిడిపిఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలను శనివారం కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ' మీకు అండగా ఉంటాం.. న్యాయమైన కోర్కెల కోసం పోరాడతాం.. జగన్ ప్రభుత్వం అత్యంత దుర్మారంగా వ్యవహరిస్తోంది. ఆవేదనకు గురై కొందరు మృతిచెందారు. అధైర్యపడకండి.. మీ పోరాటం విజయవంతమ వుతుంది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల పోరాటానికి టిడిపి అండగా ఉంటుంది' అని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీల న్యాయ మైన డిమాండ్లను పరిష్కరించడంతో పాటు, వేధింపులకు గురిచేస్తోన్న అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు లలిత, కస్తూరి, సరళ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా వాడని యుపిఐ ఖాతాలు రద్దు

న్యూఢిల్లీ : ఏడాదిగా వాడని యుపిఐ ఖాతాలు ఇకపై పని చేయవు. గూగుల్ పే, ఫోన్‌పే, పేటియం ఇతర యుపిఐ యాప్‌లను ఖాతాదారులు ఏడాదిగా వాడకపోతే డియాక్టివేట్ చేయాలని నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) నిర్ణయం తీసుకుంది. ఈ విషయమై యుపిఐ, ఫిన్‌టెక్ వేదికలకు ఆదేశాలు జారీ చేసింది. డిసెంబర్ 31 నాటికి ఏడాదికి పైగా ఇన్‌యాక్టివ్‌గా ఉన్న ఐడీలను రద్దు చేయాలని సూచించింది. కొందరు వినియోగదారులు తమ బ్యాంక్ అకౌంట్లతో అనుసంధానం అయి ఉన్న ఫోన్ నంబర్ల స్థానంలో కొత్త సిమ్‌లను తీసుకుంటున్నారని.. ఆ పాత నంబర్లను మూడు నెలల తర్వాత టెలికాం కంపెనీలు కొత్త వాళ్లకు కేటాయించినప్పుడు నగదు బదిలీ సమస్యలు వస్తున్నాయని ఎన్‌పిసిఐ దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలోనే ఇన్‌యాక్టివ్ ఖాతాలను రద్దు చేయాలని నిర్ణయించింది.

పోరాటాలపై నిర్బంధాన్ని ఆపండి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)
అంగన్‌వాడీ, మున్సిపల్, సమగ్ర శిక్ష, టూరిజం కార్మికుల పోరాటాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాలకు పూనుకోవడాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ఖండించారు. సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులను విశాఖపట్నం, భీమవరం, సత్యసాయి జిల్లాల్లో అరెస్టులు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామ న్నారు. విశాఖపట్నం జగదాంబ జంక్షన్ సమీపం లోని సిఐటియు కార్యాలయంలో శనివారం సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి పి.మణి, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డితో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలను ఉద్యోగాల నుంచి తొలగిస్తామని నోటీసులిస్తున్నారని, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ముగ్గురిని తొలగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేయడం చట్ట వ్యతిరేకమని తెలిపారు. సమస్యలను పరిష్కారం చేయడం చేతకాక, నిర్బంధానికి పూనుకోవడం సరైందికాద న్నారు. గత నాలుగున్నరేళ్లలో కార్మికుల సమస్యలే వీ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించలేదన్నారు. జూనియర్ డాక్టర్లతో సహా ఆశ, సిహెచ్‌డబ్ల్యు, బిల్డింగ్, ముఠా కార్మికులు సమ్మెల్లోకి దిగబోతున్నారని తెలిపారు. సర్వశిక్ష అభియాన్‌తో సహా మూడు లక్షల మంది కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులు, విద్యుత్, ఆర్‌టిసి కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. వీరందర్నీ నిరంకుశ పద్ధతులతో అణచాలనుకోవడం రాష్ట్ర ప్రభుత్వ అవివేకమని చెప్పారు. అన్ని రంగాల్లో కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, ప్రస్తుతం ఉన్న వేతనంపై కనీసం రూ.10 వేలు పెంచాలని, కరవుభత్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. బిల్డింగ్ కార్మికుల సెస్ డబ్బులు బిల్డింగ్ కార్మికులకు ఖర్చుచేయాలని కోరారు. విఆర్ఎలకు గతంలో చెల్లిస్తున్న కరువుభత్యం నెలకు రూ.300ను మూడేళ్ళ నుంచి చెల్లించడం లేదని తెలిపారు. గంగవరం పోర్టుకు పన్నులు మినహాయించిందని తెలిపారు. అంగన్‌వాడీలకు సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయడం, సమాన పనికి సమాన వేతనం చెల్లించడం రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత అని తెలిపారు. కార్మికవర్గంపై దౌర్జన్యం ప్రయోగిస్తే రాష్ట్రం రణరంగంగా మారుతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సామరస్యంగా చర్చలు జరిపి అన్ని రంగాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేని యెడల అన్ని రంగాల కార్మికులతో కలిసి పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గతేడాది 8 కోట్ల ఐటి రిటర్న్‌లు దాఖలు



న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 8 కోట్ల పైగా ఐటి రిటర్న్‌లు దాఖలు అయ్యాయి. 2023-24 మదింపు సంవత్సరంలో శుక్రవారం నాటికి ఈ రికార్డు చోటు చేసుకుందని ఐటి శాఖ వర్గాలు వెల్లడించాయి. 2022-23 మదింపు సంవత్సరంలో మొత్తం 7,51,60,817 రిటర్నులు దాఖలయ్యాయి. దీంతో పోల్చితే ఈ ఏడాది నూతన మైలురాయిని చేరుకున్నట్లు పేర్కొంది. ఇప్పటికే ఐటీఆర్ ఫైల్ చేసిన వారు ఏమైనా తప్పులుంటే 2023 డిసెంబర్ 31 నాటికి గడువు ఉంది.



బాలోత్సవం సభలో మాట్లాడుతున్న ఐవి

దేశ భవిష్యత్తును నిర్ణయించేది బాలలే

- భీమవరం బాలోత్సవ ప్రారంభ సభలో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం రూరల్
నేటి బాలలే.. భావి భారత పౌరులని, దేశ భవిష్యత్తును నిర్ణయించేది బాలలే అని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) అన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న బాలోత్సవాన్ని పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో చింతలపాటి బాపిరాజు స్మారకోన్నత పాఠశాలలో శనివారం ప్రారంభించారు. తొలిరోజు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐవి మాట్లాడుతూ.. బాల,బాలికల్లో మంచి ఆలోచనలు కలిగేలా ఆదర్శ, అభ్యుదయవాదులుగా ప్రభావం కల్గిస్తే బాలోత్సవాలు సఫలీకృతమైనట్లేనన్నారు. నేడు పాలకులు దేశభక్తి అనే దానికి అర్థాలు మార్చేస్తున్నారని విమర్శించారు. తొలుత ఇటీవల మరణించిన ప్రజా ఉద్యమకారుడు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బాలోత్సవం ప్రారంభం సందర్భంగా ముందుగా జాతీయ జెండాను ఐవి, బాలోత్సవం జెండాను డిఎన్ఆర్ కళాశాల అసోసియేషన్ ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగరాజు ఆవిష్కరించారు. బాలోత్సవం ప్రారంభమైనట్లు శాస్త్రవేత్త ఎంఆర్.రాజు ప్రకటించారు.

అడిషనల్ ఎస్‌పి ఎవి.సుబ్బరాజు, హేలాపురి బాలోత్సవం కార్యనిర్వాహక కార్యదర్శి జివిఎల్.నరసింహారావు, డిఇఒ ఆర్‌వి.రమణ, బాలోత్సవం నిర్వాహక కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఇందుకూరి ప్రసాదరాజు, సిహెచ్.పట్టాభిరామయ్య, వసుధ ఫౌండేషన్ కార్యదర్శి మంతెన కృష్ణంరాజు, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులకూ రిజిస్ట్రేషన్ !

- క్రీడాకారులుగా 35 లక్షల మంది
- ప్రేక్షకులుగా 90 లక్షల మంది
- ప్రభుత్వ తీరుపై క్రీడా నిపుణుల విస్మయం


ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం..ఆంధ్ర' క్రీడా పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కేటగిరిల్లో మొత్తం 35 లక్షల మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ క్రీడా పోటీలను వీక్షించేందుకు ప్రేక్షకులుగా 90 లక్షల మంది తమ పేర్లను నమోదు చేయించుకున్నారని కూడా పేర్కొన్నారు. సాధార ణంగా రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడా పోటీలను తిలకించేందుకు ఎటువంటి రిజిస్ట్రేషన్లు కానీ, రుసుములు కానీ ఉండవు. పోటీలను ప్రజ లందరూ వీక్షించే అవకాశముంటుంది. ఇందుకు భిన్నంగా 'ఆడుదాం..ఆంధ్ర' పోటీలను వీక్షించే ప్రేక్షకులకూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టడం గమనార్హం. 'ఆడుదాం.. ఆంధ్ర'లో అత్యధిక మంది భాగస్వామ్యం అయ్యారని, ప్రజల నుంచి విశేషా దరణ లభించిందని చెప్పుకోవడానికే ఈ ప్రక్రియ చేపట్టినట్లు కనిపిస్తోందని క్రీడా విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో 'ఆడుదాం..ఆంధ్ర' పోటీలను నిర్వహిస్తున్న సంగతి విదితమే. క్రికెట్, వాలీబాల్, బాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడలతో పాటు అదనంగా 3 కిలోమీటర్ల మారథాన్ పరుగు, యోగా, టెన్నికాయిట్, సాంప్రదాయ క్రీడల్లోనూ పోటీలు నిర్వహిస్తున్నారు.

తిరుమలలో మళ్లీ చిరుత కలకలం

కెమెరాలకు చిక్కిన చిరుత, ఎలుగుబంటి • భద్రతపై టిటిడి కట్టుదిట్టమైన చర్యలు

ప్రజాశక్తి- తిరుమల
తిరుమల నడక మార్గంలో మళ్లీ చిరుత సంచారం కలవరపెడుతోంది. 6 నెలలుగా ఏడుకొండలు ఎక్కాలంటేనే భక్తులు భయపడుతున్న పరిస్థితి నెలకొంది. 6 నెలల క్రితం కౌశిక్ పై చిరుత దాడి, ఆగస్టులో లక్షితను చంపిన చిరుత ఇలా వరుస ఘటనలతో బెంబేలుతున్న భక్తులు ఇప్పుడు తిరిగి నడక మార్గంలో సంచరిస్తుండడం గుబులు రేపుతోంది. చిరుతల భయం లేకుండా టీటీడీ భరోసా ఇస్తుందా, వైల్డ్ లైఫ్ ఆఫ్ ఇండియా ఇచ్చిన మార్గదర్శకాలతో అటవీశాఖ చర్యలు తీసుకుంటుందా అన్నదే ఇప్పుడు ప్రశ్నగా మిగిలింది. తిరుమల నడకమార్గాల్లో చిరుతల భయం భక్తలను ఇప్పట్లో వీడేలా లేదు. చిరుతల సంచారం తగ్గిందంటున్న టిటిడి నడక మార్గాల్లో ఆంక్షలను సడలించింది టిటిడి. ఇప్పుడు తిరిగి నడక మార్గానికి దగ్గర్లోనే సంచరిస్తున్న చిరుతలు, ఎలుగుబంట్ల నుంచి భయాన్ని పోగొట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియక తల పట్టుకుంటుంది. నడక మార్గాల్లో భక్తులకు కర్రలు ఇస్తున్న టీటీడీ గుంపులు గుంపులుగానే తిరుమల యాత్ర కొనసాగేలా చర్యలు తీసుకుంది. మరోవైపు ఆంక్షలు పూర్తిగా ఎత్తివేసేందుకు అటవీశాఖ అనుమతి తీసుకోవాలని భావిస్తున్న తరుణంలో ఈ నెల 26 నుంచి వరుసగా చిరుత, ఎలుగుబంటి సంచరిస్తుండడం అటవీ శాఖలో ఆందోళన కలిగిస్తుంది. మొదటి ఘాట్ రోడ్ లోని ఎలిఫెంట్ ఆర్చ్ సమీపంలోనే చిరుత, ఎలుగుబంటి సంచారం అటవీశాఖ ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో ఇమేజెస్ క్యాప్చర్ అయ్యాయి.

నరసింహస్వామి ఆలయం సమీపంలోనే చిరుత సంచారం కొనసాగినట్లు అటవీ శాఖ కూడా భావిస్తోంది. ఒకే ఫ్యామిలీకి చెందిన చిరుతలు ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు గుర్తించిన అటవీశాఖ నడక మార్గానికి దగ్గరగా వస్తే బంధించేందుకు ప్రయత్నిస్తోంది. కౌశిక్, లక్షితపై దాడి చేసిన ప్రాంతంలోనే చిరుతల సంచారం కొనసాగుతున్నట్లు



గుర్తించిన అటవీశాఖ ఆ ప్రాంతమంతా చిరుతల ఆవాసంగానే భావిస్తుంది. టీటీడీ సహకారంతో నడక మార్గంలో వచ్చే భక్తులకు ఎలాంటి అపాయం తలపెట్టకుండా చేపట్టాల్సిన చర్యలన్నీ తీసుకుంది. ఇప్పటికే ఆరు చిరుతలను బంధించిన అటవీ శాఖ నిరంతర నిఘా కొనసాగిస్తుంది. కావలసినంత సిబ్బందితో అలిపిరి నడక మార్గంలోని ఏడవ మైలు, నరసింహ స్వామి ఆలయం ప్రాంతాల్లో నిఘా కట్టుదిట్టం చేసింది. వైల్డ్ లైఫ్ ఆఫ్ ఇండియా అనుమతిస్తేనే కంచె నిర్మాణం చేపట్టాలా లేక ఇతర చర్యలతో చిరుతల భయం లేకుండా చేయాలా అని ఆలోచిస్తుంది.

ఇక ఏడుకొండల వాడా వెంకటరమణా గోవిందా గోవిందా అంటూ తిరుమల కొండెక్కే భక్తులకు రెండ్రోజుల క్రితం గుర్తించిన చిరుత ఎలుగుబంటి సంచారం భక్తుల వెన్నులో వణుకు పుట్టించింది. ఇప్పటికీ తిరుమల కొండెక్కే భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకొని నడక మార్గంలో తిరుమల యాత్ర కొనసాగిస్తున్న పరిస్థితి ఉండగా ఇప్పుడు తిరిగి కదలిక కంగారు పెట్టిస్తుంది.

చిరుతల సంచారం పై నిరంతర నిఘా కొనసాగిస్తున్న అటవీశాఖ అలిపిరి నడక మార్గం, శ్రీవారి మెట్టు మార్గంలో ప్రస్తుతం 300కు పైగానే ట్రాప్ కెమెరాలు, దాదాపు 100 మంది సిబ్బందిని అందుబాటులో ఉంచింది. చిరుతల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ నడకమార్గానికి దగ్గరగా రాకుండా చర్యలు చేపట్టింది. వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా కు చెందిన సైంటిస్ట్ టీం అలిపిరి నడక మార్గం, శ్రీవారి మెట్టు మార్గాలలో పర్యటించి చిరుతల సంచారం వల్ల భక్తులకు ఇబ్బంది లేకుండా చేపట్టాల్సిన చర్యలపై సర్వే నిర్వహించింది. ఈ మేరకు క్షేత్రస్థాయి పరిశీలన చేసిన వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సైంటిస్ట్ టీం శేషాచలం అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులు నడక మార్గాలు, ఘాట్ రోడ్లను దాటే సమయంలో ఇబ్బంది పడకుండా తీసుకోవలసిన చర్యలు చేపట్టాల్సిన నిర్మాణాలపై కూడా ఆరా తీసి నివేదిక ఇచ్చింది.

బాలికపై బిజెపి నేత లైంగిక దాడి

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని చంపావత్ జిల్లాలో ఓ మైనర్ బాలికపై బిజెపి నేత ఒకరు లైంగిక దాడికి పాల్పడ్డారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు లైంగిక దాడికి పాల్పడిన కమల్ రావత్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. బాలికపై రావత్ పలు సందర్భాలలో లైంగిక దాడి చేశాడని, ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడని ఆ ఫిర్యాదులో ఆరోపించారు. ఐపిసిలోని 376, 504, 506 సెక్షన్లతో పాటు లైంగిక వేధింపుల నుంచి బాలికలను కాపాడేందుకు ఉద్దేశించిన చట్టం కింద నిందితుడిపై కేసు నమోదు చేశారు. లైంగిక దాడికి గురైన బాలికకు శనివారం వైద్య పరీక్షలు జరిపారు. అనంతరం ఆమె వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసుకుంది.

700కిపైగా కోవిడ్ కేసులు

- ఏడుగురు మృతి

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా గత 24 గంటల్లో కరోనా వల్ల ఏడుగురు మరణించారని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ శనివారం వెల్లడించింది. 743 కొత్త కోవిడ్ కేసులు నమోదయ్యాయని, యాక్టివ్ కేసుల సంఖ్య 3,997కి పెరిగిందని తెలిపింది. శుక్రవారం ఒక్కరోజే కేరళలో ముగ్గురు, కర్ణాటకలో ఇద్దరు, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారని పేర్కొంది. తాజా మరణాలతో కలిసి ఇప్పటివరకు కరోనా ప్రారంభం నుంచి 5,33,358 మంది వైరస్‌కి బలయ్యారు. ఈ నెల 29న 41,797 నమూనాలను పరీక్షించినట్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ నివేదిక పేర్కొంది. ఈ నెల 28వ తేదీకల్లా దేశవ్యాప్తంగా కోవిడ్ సబ్ వేరియంట్ జెఎన్.1 కేసులు 145 నమోదయ్యాయని తెలిపింది.

లఖ్బీర్ సింగ్ ఉగ్రవాది

- కేంద్ర హోం శాఖ ప్రకటన

న్యూఢిల్లీ : కెనడాకు చెందిన గ్యాంగ్‌స్టర్ లఖ్బీర్‌సింగ్ లాండాను ఉగ్రవాదిగా కేంద్ర హోం మంత్రిత్వశాఖ శనివారం ప్రకటించింది. పంజాబ్‌లోని తరన్‌తరన్ జిల్లా హరికేకి చెందిన 34 ఏళ్ల లఖ్బీర్‌సింగ్ ప్రస్తుతం కెనడాలోని ఎడ్మోంటన్‌లో నివశిస్తున్నారు. బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ ఉగ్రవాద సంస్థలో సభ్యుడైన లఖ్బీర్‌సింగ్ మొహాలీలోని పంజాబ్ స్టేట్ ఇంటెలిజెన్స్ ప్రధాన కార్యాలయంపై రాకెట్ ప్రొపెల్డ్ గ్రెనైడ్ విసిరిన కేసులో నిందితుడు. పంజాబ్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను నిర్వహించడానికి సరిహద్దుల నుండి వివిధ ప్రాంతాలకు ఐఇడిలు, ఆయుధాలు, పేలుడు పరికరాలను సరఫరా చేశారని, నిందితునిపై ఓపెన్-ఎండ్ వారెంట్‌ను జారీ చేశామని కేంద్ర హోంశాఖ ప్రకటన పేర్కొంది. కెనడాలో ఖలిస్తాన్ ఉగ్రవాది హర్‌దీప్ నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించిన నేపథ్యంలో, రెండు దేశాల మధ్య దౌత్యసంబంధాలు దెబ్బతిన్న సంగతి తెలిసిందే.

వ్యూహంపై కాంగ్రెస్ పిటిషన్

- 24న విచారణ

ప్రజాశక్తి, అమరావతి

రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో నిర్మించిన 'వ్యూహం' సినిమాకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. గతంలో ఇదే తరహాలో టిడిపి సీనియర్ నాయకుడు గంటా శ్రీనివాసరావు దాఖలు చేసిన పిల్‌తో కలిపి జనవరి 24న విచారణ చేస్తామని హైకోర్టు ప్రకటించింది. ఈమేరకు జస్టిస్ ఎన్. జయసూర్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వ్యూహం సినిమాలో కాంగ్రెస్ అధ్యక్షులు సోనియాగాంధీతో పాటు ఇతర నేతలను కించపరిచే విధంగా చిత్రీకరణ చేశారని పిసిసి ఉపాధ్యక్షుడు మీసాల రాజేశ్వరరావు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇప్పటికే తెలంగాణ హైకోర్టు సినిమా విడుదలను నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని కేంద్రం తరపు న్యాయవాది చెప్పారు. పిటిషనర్ న్యాయవాది విచారణ సమయంలో లేకపోవడంతో పిల్‌తో కలిపి విచారిస్తామని హైకోర్టు ప్రకటించింది.

రాజస్థాన్‌లో కేబినెట్ విస్తరణ

- మంత్రులుగా 22 మంది ప్రమాణస్వీకారం

జైపూర్ : రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ శనివారం తన కేబినెట్‌ను విస్తరించారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో 22 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా మంత్రులచేత ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో 12 మంది కేబినెట్ మంత్రులు, 10 మంది సహాయక మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. శనివారం విస్తరణతో రాజస్థాన్‌లో మొత్తం మంత్రులు సంఖ్య 25కు చేరుకుంది. మహిళా ఎమ్మెల్యే దియా కుమారి, ప్రేమ్ చంద్ బైర్వ ఉప ముఖ్యమంత్రులుగా ఇప్పటికే కొనసాగుతున్నారు.

మాపై కేసు కొట్టేయండి : హైకోర్టుకు సునీత

ప్రజాశక్తి, అమరావతి

పులివెందుల కోర్టు ఉత్తర్వుల మేరకు పులివెందుల పోలీసులు తమపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని వైఎస్ వివేకా అల్లుడు, కుమార్తె నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ నర్రెడ్డి సునీత హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తుది ఉత్తర్వుల జారీ వరకు పులివెందుల కేసు దర్యాప్తును నిలిపివేయాలని కోరారు. వివేకా హత్య కేసు వ్యవహారంలో వారిద్దరితోపాటు సిబిఐ అధికారి రాంసింగ్ తనను వేధిస్తున్నారని వివేకా పిఎ కృష్ణారెడ్డి పులివెందుల కోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని పోలీసులను ఆ కోర్టు ఆదేశించింది. దీంతో పోలీసులు నమోదు చేశారు. దీనిపై వారు హైకోర్టులో సవాల్ చేశారు. తమను, సిబిఐ అధికారులను వేధించే క్రమంలోనే కృష్ణారెడ్డి తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు.

ఖేల్ రత్న, అర్జున అవార్డులు వెనక్కి

- ప్రధానికి ఇవ్వడానికి బయలుదేరిన వినేష్ ఫోగాట్
- అడ్డుకున్న పోలీసులు, రోడ్డుపై నిరసన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రప్రభుత్వంపై రెజ్లింగ్ క్రీడాకారులు తమ నిరసనను తీవ్రతరం చేశారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ రెజ్లర్ వినేష్ ఫోగాట్ ఖేల్ రత్న, అర్జున అవార్డులను కర్తవ్యపథ్‌లో పేవ్‌మెంట్‌పై విడిచిపెట్టారు. శనివారం అర్జున అవార్డు, ఖేల్ రత్న అవార్డులను ప్రధాని మోడీకి ఇస్తామంటూ ప్రధానమంత్రి కార్యాలయం వైపు బయల్దేరారు. పోలీసులు అనుమతించకపోవడంతో కర్తవ్య పథ్ వద్ద రోడ్డుపై నిరసన తెలిపారు అనంతరం అక్కడే ఆ అవార్డులను విడిచిపెట్టారు. కొద్ది రోజుల క్రితం ప్రధానికి వినేష్ రాసిన లేఖలో బ్రిజ్ భూషణ్‌పై చర్య తీసుకోకపోవడాన్ని ప్రస్తావించారు. ఖేల్ రత్న అవార్డులను తిరిగి ఇచ్చేస్తానని పేర్కొన్నారు. ఈ లేఖపై ప్రధాని కార్యాలయం స్పందించకపోవడంతో రెజ్లర్లు తమ నిరసనను మరింత ఉధృతం చేయాలని నిర్ణయించుకున్నారు.




అవార్డులు వెనక్కిచ్చేందుకు బయలుదేరిన వినేష్ ఫోగాట్ తదితరులు, (ఇన్‌సెట్‌లో) రోడ్డు పై విడిచిపెట్టిన అవార్డులు

హోం మంత్రి అమిత్ షా, క్రీడా మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ ఇచ్చిన హామీలను ఉల్లంఘించి బ్రిజ్‌భూషణ్ అనుయాయుడు సంజయ్ కుమార్ సింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత రెజ్లర్ సాక్షి మాలిక్ తన రెజ్లింగ్‌కు రాజీనామా చేశారు. మీడియా ముందు కంటతడి పెట్టారు. రెజ్లర్ల ఆందోళన నేపథ్యంలో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాను క్రీడా మంత్రిత్వ శాఖ రద్దు చేసింది. అప్పుడు కూడా బ్రిజ్ భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకునేందుకు క్రీడా మంత్రిత్వ శాఖ సిద్ధం కాలేదు. ఆ తరువాత రెజ్లర్ బజరంగ్ పునియా పద్మశ్రీని, వీరేందర్ సింగ్ యాదవ్ పతకాన్ని తిరిగి ఇస్తామని ప్రకటించగా, వినేష్ ఫోగట్ అవార్డును వెనక్కి ఇచ్చారు.

ఐలు అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా
వికాస్‌రంజన్ భట్టాచార్య, పివి సురేంద్రనాథ్

- వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.రాజేంద్ర ప్రసాద్
- 169 మందితో కేంద్ర కమిటీ ఏకగ్రీవ ఎన్నిక
- ఏపి భూ యాజమాన్య చట్టం రద్దు చేయాలని తీర్మానం
- ముగిసిన 14వ ఐలు మహాసభ


వికాస్‌రంజన్ భట్టాచార్య


పివి సురేంద్రనాథ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


అనిల్ కుమార్ చౌహాన్

ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) అఖిల భారత నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గా వికాస్‌రంజన్ భట్టాచార్య, పివి సురేంద్రనాథ్ ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుంకర రాజేంద్ర ప్రసాద్, కోశాధికారిగా అనిల్ కుమార్ చౌహాన్ ఎన్నికయ్యారు. పశ్చిమ బెంగాల్ హౌరా నగరంలోని అశోక్ వికాష్ మంచ్, నారాయణ్ గుప్తా నగర్‌లో మూడు రోజుల పాటు జరిగిన ఐలు 14వ అఖిల భారత మహాసభ శనివారం ముగిసింది. 'మతోన్మాదంపై పోరాటం, రాజ్యాంగాన్ని కాపాడండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' నినాదంతో జరిగిన ఈ మహాసభకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 600 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభ 169 మందితో నూతన కేంద్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అందులో 81 మందితో సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ, 34 మందితో కార్యవర్గం ఎన్నికైంది. 34 మంది కార్యవర్గ సభ్యుల్లో 14 మందిని ఉపాధ్యక్షులుగా, 20 మందిని సహాయ కార్యదర్శులుగా ఎన్నుకున్నారు.

కేంద్ర కమిటీలోకి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్నిక


సుంకర రాజేంద్ర ప్రసాద్

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుంకర రాజేంద్ర ప్రసాద్, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా నర్రా శ్రీనివాసరావు, వై.రమేష్, కేంద్ర కమిటీ సభ్యులుగా సంపర దుర్గాప్రసాద్ (విజయవాడ), ఎస్.రమేష్ బాబు (విజయవాడ), ఎస్.అంకయ్య (నెల్లూరు), కె.విజయ్ కుమార్ (కర్నూల్), వి.శైలజ (పశ్చిమ గోదావరి) ఎన్నికయ్యారు.

తెలంగాణ నుంచి... ఉపాధ్యక్షులుగా కొల్లి సత్యనారాయణ, కేంద్ర కమిటీ సభ్యులుగా జి.విద్యా సాగర్, కె.పార్థసారథి, వి.వేణుగోపాల్, రామచంద్రారెడ్డి, బి. చంద్రశేఖర్ ఆజాద్, సిహెచ్ శైలజ, వై.శ్రీనివాసరావు, జె.శివరామప్రసాద్, నాగేశ్వరరావు ఎన్నికయ్యారు.

ఎపి భూ యాజమాన్య చట్టం రద్దు చేయాలని తీర్మానం

ఎపి భూ యాజమాన్య చట్టం రద్దు చేయాలని ఐలు 14వ అఖిల భారత మహాసభ తీర్మానించింది. సామాజిక, రాజకీయ, ఆర్థిక, న్యాయవాదులకు సంబంధించిన అంశాలపై దాదాపు 15 తీర్మానాలు ఆమోదించారు.

బసవపున్నయ్యకు మాతృవియోగం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడిగె బసవపున్నయ్య తల్లి బొడిగె ఊషమ్మ (70) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆమె భర్త బొడిగె లక్ష్మయ్య ప్రముఖ న్యాయవాది, వామపక్షవాది. వారికి కుమారులు సుందరయ్య, బసవపున్నయ్య, కుమార్తె ఉదయం ఉన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం శోభనాద్రిపురం స్వగ్రామం. ఊషమ్మ భౌతికకాయాన్ని బంధువులు, కుటుంబ సభ్యుల సందర్శనార్థం వనస్థలిపురంలోని హుడాకాంప్లెక్స్ సాయినగర్ (ఎల్లమ్మ దేవాలయం) వద్ద ఆమె పెద్దకుమారుడు సుందరయ్య నివాసం వద్ద ఉంచారు. శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఉన్న సాహెబ్‌నగర్ శ్మశాన వాటికలో ఆమె అంత్యక్రియలను కుటుంబ సభ్యులు నిర్వహించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, నవతెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ పి.ప్రభాకర్, సంపాదకులు ఆర్ సుధా భాస్కర్, ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్, సిజిఎం అచ్యుతరావు సంతాపం తెలిపారు.

ఇదే లాస్ట్ ఛాన్స్

- ఏడోసారి హేమంత్ సోరెన్‌కు ఇడి సమన్లు

పాట్నా : మనీలాండరింగ్ కేసులో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు శనివారం ఇడి మరోసారి సమన్లు జారీ చేసింది. ఈ కేసులో హేమంత్ సోరెన్‌కు ఇడి సమన్లు జారీ చేయడం ఇది ఏడోసారి. శనివారం సమన్లలో ఇదే అఖరి అవకాశంగా ఇడి పేర్కొంది. ముఖ్యమంత్రి సోరెన్ కోరుకున్న ప్రాంతం, సమయంలోనే వాంగ్మూలం నమోదు చేస్తామని, దీనికి రెండు రోజుల సమయం మాత్రమే ఇస్తున్నామని ఇడి తెలిపింది. రాంచీలోని బద్గై ప్రాంతంలో గిరిజనులకు చెందిన భూమిని నకిలీ డాక్యుమెంట్లతో కొనుగోలు చేయడం, విక్రయించడం వంటి అక్రమాలకు సోరెన్ పాల్పడ్డారని ఇడి ఆరోపిస్తుంది. ఈ కేసులో ఇప్పటి వరకూ ఆరుసార్లు.. ఆగస్టు 14, ఆగస్టు 24, సెప్టెంబరు 9, సెప్టెంబరు 23, అక్టోబర్ 4, డిసెంబరు 12న ఇడి సోరెన్‌కు సమన్లు జారీ చేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు కక్షసాధింపు చర్యల్లో భాగంగా పలువురు నేతలను వేధిస్తున్నాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

పూంచ్‌లో ముఫ్తీ అడ్డగింత

- పోలీసుల చర్యను నిరసిస్తూ మాజీ సిఎం ఆందోళన

శ్రీనగర్ : సైన్యం కస్టడీలో మరణించిన ముగ్గురు యువకుల కుటుంబాలను పరామర్శించేందుకు పూంచ్ జిల్లా తోప పిర్ గ్రామానికి వెళుతున్న జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీని పిర్ పంచల్ వద్ద శనివారం పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై నిరసన వ్యక్తం చేసిన ముఫ్తీ రహదారిపైనే ఆందోళనకు దిగారు. గ్రామంలోకి వెళ్లకుండా బారికేడ్లు, ముళ్ల తీగలు ఏర్పాటు చేశారు. పోలీసుల చర్యలపై ముఫ్తీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పోలీసుల తీరు చూస్తుంటే ప్రభుత్వం ఏదో దాచడానికి ప్రయత్నం చేస్తున్నట్లుగా ఉంది. నన్ను ఆపడానికి ఎవరూ కారణం కూడా చెప్పడం లేదు. తోప పిర్ గ్రామానికి చెందిన మహిళలను కూడా భద్రతా సిబ్బంది వేధిస్తున్నట్లు కొంతమంది నాకు చెప్పారు' అని ముఫ్తీ విలేకరులకు తెలిపారు. శుక్రవారం బాధితుల్ని కలవడానికి బిజెపి నాయకుల్ని అనుమతించిన అధికారులు, పోలీసులు, శనివారం నాడు ముఫ్తీని అడ్డుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మానవత్వంపై దాడులు...

- గాజాపై ఇజ్రాయెల్ నరమేధానికి విజయన్ ఖండన



తిరువనంతపురం : కొన్ని నెలల నుంచి గాజాపై కొనసాగిస్తున్న ఇజ్రాయెల్ బాంబు దాడులను కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ఖండించారు. పాలస్తీనా ప్రజలను హత్య చేయడమే లక్ష్యంగా ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులను మానవత్వంపై దాడులని విజయన్ అన్నారు. శనివారం 91వ శివగిరి తీర్థయాత్రను పినరయ్ విజయన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఏసుక్రీస్తు జన్మస్థలంగా విశ్వసించే బెత్లెహాంలో ఈసారి క్రిస్మస్ వేడుకలు లేవు. క్రిస్మస్ దీపాలు, నక్షత్రాలు లేవు. అయినా ఈ సమయంలో క్రిస్మస్ ఎలా జరుపుకుంటారు? ముఖ్యంగా పాలస్తీనా గురించి విన్నప్పుడు ముస్లిం విశ్వాసుల చిత్రాలే గుర్తుకువస్తాయి. గాజాలో క్రైస్తవ సంఘం కూడా నివశిస్తుంది. ఈసారి శాంతి సందేశాన్నిచ్చే క్రిస్మస్‌ను పాలస్తీనియన్లు జరుపుకోలేకపోయారు.' అని ఆయన అన్నారు. శివగిరి మఠాన్ని స్థాపించిన నారాయణ గురు శాంతి సామరస్య సందేశాన్నే వ్యాప్తి చేశారని విజయన్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. 'నారాయణ గురు ఇచ్చిన సందేశం యొక్క కాంతి ఆ మట్టికి చేరినట్లయితే.. రక్తం ఏరుల్లా ప్రవహించేది కాదు' అని మానవత్వం గురించి నారాయణ గురు చేసిన బోధనలను విజయన్ నొక్కి చెప్పారు. శివగిరిలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో కేరళ సహకార శాఖ ఆమంత్రి వి.ఎన్.వాసవన్, ఇస్రో ఛైర్మన్ ఎస్. సోమనాథ్, శ్రీనారాయణ ధర్మ పరిపాలన (ఎస్ఎన్‌డిపి) యోగం ప్రధాన కార్యదర్శి వెల్లపల్లి నటేశన్‌లతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నే కరువు

(మొదటి పేజీ తరువాయి)

జర్నలిస్టులు న్యాయవాదులేనని అన్నారు. భగత్ సింగ్, మహాత్మాగాంధీ, బిఆర్ అంబేద్కర్ వంటి వారు గొప్ప జర్నలిస్టులని తెలిపారు. దేశంలో ప్రస్తుత పరిస్థితులు 1975 నాటి ఎమర్జెన్సీ పరిస్థితులను పోలివున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు గతంలో ఎన్నడూ లేనివిధంగా 146 మంది ఎంపిలను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేశారని చెప్పారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష ఎంపిలు లేని సమయంలో ఎటువంటి చర్చ లేకుండా మూడు క్రిమినల్ చట్టాలను ఆమోదించారని పేర్కొన్నారు. మూడు రైతు చట్టాలకు సంబంధించిన బిల్లులను పార్లమెంట్ కమిటీలు డ్రాఫ్ట్ చేయలేదని, పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి పంపలేదని, వ్యవసాయానికి సంబంధించిన ప్రత్యేక కమిటీ ముందు పెట్టలేదని పేర్కొన్నారు. ఆ బిల్లులను కార్పొరేట్లు తయారు చేశారని విమర్శించారు. ఓటింగ్‌కు డిమాండ్ చేస్తారని ఎనిమిదిమంది ఎంపిలను సస్పెండ్ చేసి, మూజువాణి ఓటుతో ఆమోదించారని విమర్శించారు. కీలకమైన బిల్లులను ఆమోదించుకునేందుకు మోడీ ప్రభుత్వం ప్రతిపక్ష ఎంపిలను సస్పెండ్ చేస్తోందని తెలిపారు. ప్రతిపక్షాలను ప్రశ్నిస్తున్న మీడియా, అధికార బిజెపిని ప్రశ్నించటం లేదని విమర్శించారు.

ప్రజాస్వామ్య పునాదులపై దాడి

ప్రజాస్వామ్య పునాదులపై దాడి జరుగుతుందని సాయినాధ్ విమర్శించారు. ప్రజాస్వామ్యం ముందుకు సాగాలంటే, అసమానతలు తగ్గడం, భయోత్పాత వాతావరణం క్షీణించడం, మానవ హక్కుల హననం జరగకుండా ఉండటం ముఖ్యమని అన్నారు. ప్రస్తుతం ఈ మూడు అంశాల్లో తిరోగమనం ఉందని, దీంతో ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. దేశంలో కరోనాతో 50 లక్షలకుపైగా భారతీయులు మరణించారని అంతర్జాతీయ సంస్థలు చెబుతున్నాయని, మన విశ్వగురు 4.86 లక్షల మంది చనిపోయినట్లు చెప్పారని విమర్శించారు. తీవ్ర విమర్శలు వచ్చిన తరువాత ఆ లెక్కను కేంద్ర ప్రభుత్వం సవరించి, 5.21 లక్షల మరణాలుగా ప్రకటించిందని తెలిపారు. యుపిలో కరోనా మరణాలపై ప్రధాన మీడియా మౌనంగా ఉందని, ఎందుకంటే ఇడి, సిబిఐ వంటి దర్యాప్తు సంస్థలతో ప్రభుత్వం బెదిరిస్తుందని విమర్శించారు.

దాదాపు రెండు కోట్ల మంది వలస కార్మికులు రోడ్లపై వందల కిలో మీటర్ల నడిచి స్వస్థలాలకు వెళ్తే, ఒక్కరు కూడా జాతీయ రహదారిపై లేరని కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తెలిపిందని చెప్పారు. 14 రోజుల తరువాత మరో అఫిడవిట్‌లో 23 వేల ఫుడ్ సెంటర్లు తెరిచినట్లు సుప్రీంకోర్టుకు తెలిపిందని అన్నారు. ఈ రెండు విరుద్ధ అంశాలపై సుప్రీం కోర్టు కేంద్రాన్ని ప్రశ్నించిందని పేర్కొన్నారు. ఇండియన్ రైల్వే శ్రామిక్ రైలు పేరుతో 25 రోజుల్లో 91 లక్షల మంది వలస కార్మికులను తరలించినట్లు చెప్పిందని పేర్కొన్నారు.

అసమానతల పెరుగుదల

దేశంలో బ్రిటీష్ పాలన నాటి అసమానతలు పునరావృతం అవుతున్నాయని సాయినాధ్ పేర్కొన్నారు. సంపద కొంతమంది చేతుల్లోనే కేంద్రీకృతమైందని, బిలియనీర్లలో మనదేశం మూడో స్థానంలో ఉందని అన్నారు. ఈ ర్యాంక్‌పై మోడీ సర్కార్ సంతోషంగా వేడుకలు చేసుకుంటుందని చెప్పారు. అదే మానవాభివృద్ధి సూచీ (హెచ్‌డిఐ) 132వ స్థానంలో ఉందని యుఎన్ఒ ఇచ్చిన నివేదికను మోడీ ప్రభుత్వం వ్యతిరేకించిందని, యుఎన్ఒపై దాడికి పూనుకుందని తెలిపారు. వారికి అనుకూలంగా రిపోర్టులు ఉంటే స్వాగతిస్తారని, వ్యతిరేకంగా ఉంటే దాడి చేస్తారని విమర్శించారు. ఆకలి సూచీలో 121వ స్థానం, ప్రెస్ ఫ్రీడం సూచీలో 161వ స్థానం, పర్యావరణ సూచీలో 180 స్థానంలో ఉన్నామని పేర్కొన్నారు. 1991 నుంచి 2001 వరకు భారతదేశంలో 98 మంది బిలియనీర్లు ఉంటే, ఇప్పుడు ఆ సంఖ్య 160కి పెరిగిందన్నారు. ఇటీవల చేరిన బిలియనీర్లు హెల్త్, ఐటి, ఉత్పత్తిదారుల రంగంలో ఉన్నారని తెలిపారు. జిడిపిలో ఐదో వంతు సంపద కేవలం 160 మంది వద్ద ఉందన్నారు. దేశంలో 30 శాతం మంది సంపద మైనస్‌లో ఉందని, 50 శాతం మంది సంపద కేవలం ఆరు శాతమేనని తెలిపారు.

సహజ వనరుల దోపిడీ

ప్రజలకు సంబంధించిన సహజ వనరులు కార్పొరేట్లకు దోచిపెట్టడంతోనే కార్పొరేట్ల సంపద పెరుగుతుందని అన్నారు. 2006 గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోడీ ఉన్నప్పుడు అదానీ సంపద మిలియన్ డాలర్లని, ప్రధాని మోడీ కావడానికి ముందు 2013 నాటికి ఆయన సంపద 3.8 బిలియన్ డాలర్లని, 2022 నాటికి 129 బిలియన్ డాలర్లకు పెరిగిందని తెలిపారు. ప్రపంచంలోని ఏ బిలినీయర్ సంపద ఇంతలా పెరగలేదని పేర్కొన్నారు. ఇటీవలి కేంద్ర ప్రభుత్వం వ్యవసాయానికి సంబంధించిన రెండు కీలకమైన ఒప్పందాలను చేసుకుందని అన్నారు. వీటివల్ల వ్యవసాయ రంగానికి, భద్రతకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన సెంట్రల్ డేటాబేస్‌ను ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసిఎఆర్) మాన్‌శాంటో, అమెజాన్ వంటి కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్నారని, డేటాబేస్‌పై మొత్తం అమెజాన్, మాన్‌శాంటో నియంత్రణలోకి వెళ్తుందని పేర్కొన్నారు. ఇది చట్ట విరుద్ధమని తెలిపారు.


సిఎంకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం తెలంగాణ నాయకులు

పోడు భూములకు పట్టాలివ్వండి

- వ్యవసాయ కార్మికుల కనీస వేతన జిఒను సవరించాలి
- అర్హులైన పేదలకు ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షలు ఇవ్వాలి
- సిఎం రేవంత్‌కు సిపిఎం తెలంగాణ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం పోడు భూములకు పట్టాలివ్వాలనీ, కౌలు రైతులకు రైతు భరోసాను అమలు చేయడంతో పాటు ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం నేతృత్వంలో పార్టీ కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, టి జ్యోతి, పి సుదర్శన్, డిజి నర్సింహారావు, జాన్ వెస్లీ బృందం శనివారం సచివాలయంలో సిఎంను కలిసి వినతి పత్రం అందజేసింది. ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రజలకిచ్చిన వాగ్దానాల మేరకు ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ సిఎంను అభినందించారు. అలాగే మిగతా హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తమ్మినేని మీడియాతో మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం తమతో కలిసి రావాలని సిఎం చేసిన విజ్ఞప్తికి తాము కూడా సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపి ఓటమే ధ్యేయంగా పనిచేయనున్నట్టు తెలిపారు. ఎన్నికల నాటికి ఉన్న పరిస్థితులను బట్టి పొత్తు నిర్ణయాలు ఉంటాయని చెప్పారు.

ప్రధాన డిమాండ్లు

అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం పోడు రైతులకు పట్టాలివ్వాలి,- కౌలు రైతులకు రైతు భరోసాను వెంటనే అమలు చేయాలి, తొమ్మిదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న వ్యసాయ కార్మికుల కనీస వేతన జీవో సవరించాలి, అర్హులైన పేదలకు ఇంటి స్థలంతో పాటు రూ.ఐదు లక్షలు ఇవ్వాలి, ఇండ్లస్థలాలు, ఆర్‌టిసి సమ్మె తదితర సమస్యల కోసం జరిగిన ఉద్యమాల సందర్భంగా ప్రజలు, కార్యకర్తలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించాలి, సీలింగ్, మిగులు భూములను నిరుపేదలకు పంచడంతో పాటు రాజకీయ పార్టీలతో అసైన్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేయాలి, రాష్ట్రంలో ఉన్న 73 రకాల షెడ్యూల్డ్ ఉద్యోగులకు పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనాలు సవరించాలి, కొత్త బస్సులు కొనుగోలు చేసి, ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి, సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతాక్రమంలో నిర్మించాలని, పోలవరం ముంపు ప్రాంతాల సర్వే చేపట్టడంతో పాటు పరిహారం చెల్లించాలి, ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు, ఖాళీ పోస్టుల నియామకాలు చేపట్టాలి, ధరణి పోర్టల్‌కు సవరణలు చేసి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి, ప్రభుత్వరంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రాధాన్యతనివ్వాలి, చేతివృత్తుల సంక్షేమ పథకాల్లో లోపాలను సవరించి, అవినీతిని అరికట్టడంతో పాటు అర్హులందరికీ అందించాలి, అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇవ్వాలి. హెల్త్ కార్డుల వ్యవస్థను ప్రక్షాళన చేసి కొత్త విధానం రూపొందించాలని డిమాండ్ చేశారు.

సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేయాలి

- క్యాంపు కార్యాలయాలపై రాష్ట్రం అప్పీలు

ప్రజాశక్తి, అమరావతి

ఉత్తరాంధ్ర అభివద్ధిపై సమీక్ష నిమిత్తం విశాఖపట్నంలో ప్రభుత్వ క్యాంపు కార్యాలయాల ఏర్పాటు జీవో అమలుకు బ్రేక్ వేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించింది. ధర్మాసనం ఎదుట రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరుగా మూడు అప్పీళ్లు దాఖలు చేసింది. క్యాంపు కార్యాలయాల ఏర్పాటుపై ఏవిధమైన చర్యలు తీసుకోవద్దని సింగిల్ జడ్జి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని కోరింది. అప్పీళ్లను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుల డివిజన్ బెంచ్ మంగళవారం విచారణ చేయనుంది.ప్రభుత్వ పరిపాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకునేలా ఉత్తర్వులు ఉన్నాయని అప్పీళ్లల్లో పేర్కొంది. సుప్రీంకోర్టు వివిధ కేసుల్లో ఇచ్చిన తీర్పులకు వ్యతిరేకమని పేర్కొంది. త్రిసభ్య ధర్మాసనం విచారణ చేయాల్సిన కేసుల్లో మధ్యంతర ఉత్తర్వుల జారీ చెల్లదని కూడా పేర్కొంది. రాజధాని అంశంతో ముడిపడి ఉన్న నేపథ్యంలో వీటిపై త్రిసభ్య ధర్మాసనమే విచారించాలని ప్రభుత్వం కోరింది.

సరైన ఆధారాలు లేకపోతే ముందస్తు బెయిల్ పిటిషన్ రద్దు : హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి, అమరావతి

నేర తీవ్రత, ఆరోపణల నేపథ్యంలోప్రాథమిక ఆధారాలను సమర్పించలేనప్పుడు ముందస్తు బెయిల్ మంజూరు చేయడానికి వీల్లేదని హైకోర్టు తీర్పు చెప్పింది. నిందితుడు కోర్టు విధించిన షరతుల మేరకు సమర్పించాల్సిన సాల్వెన్సీ (వ్యక్తి తన ఆర్థిక పరిస్థితిని తెలియచేస్తూ సమర్పించే పత్రం) సర్టిఫికేట్ విషయంలో మోసానికి పాల్పడ్డారని, నకిలీ సాల్వెన్సీ సర్టిఫికేట్ సమర్పించారంటూ చంద్రశేఖర్ అనే వ్యక్తి ముందస్తు బెయిల్ మంజూరుకు నిరాకరించింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ఇటీవల తీర్పు చెప్పారు. చంద్రశేఖర్, అతని 65 ఏళ్ల తండ్రి రామయ్యపై నెల్లూరు దిశా పోలీసులు వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. ఈ కేసులో కింది కోర్టు రెండు పూచీకత్తులతో పాటు సాల్వెన్సీ సర్టిఫికేట్లు సమర్పించాలని చెప్పి బెయిల్ మంజూరు ఆదేశించింది. రామయ్య కింది కోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. వీరిద్దరూ న కిలీ సాల్వెంట్ సర్టిఫికేట్ సమర్పించారని చంద్రశేఖర్ భార్య ఫిర్యాదు చేయడంతో బెయిలు రద్దు అయ్యింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని హైకోర్టులో వేసిన రామయ్య పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది.

సమ్మె విచ్ఛిన్నానికి కుట్ర


(మొదటి పేజీ తరువాయి)

కార్మికుడు మోషే నిలిచాడు. పోటీ కార్మికుడు దురుసుగా ప్రవర్తిస్తూ ట్రాక్టర్‌ను ముందుకు నడపుతూ మోషేను ఢీ కొట్టాడు. దీంతో గాయపడిన ఆయనను తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించారు. మోషే ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ సంఘటనపై ట్రాక్టర్ డ్రైవర్‌పై పోలీసులు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం గేట్లు మూసి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

విశాఖ జివిఎంసి పరిధిలో పోటీ డ్రైవర్లను పెట్టి వాహనాలను తీయడంతో పలుచోట్ల మున్సిపల్ కార్మికులు అభ్యంతరాలు తెలిపి, అడ్డగించారు. దీంతో ఎక్కడకక్కడ పోలీసులు మోహరించి కార్మికులను అరెస్టులు చేశారు. జివిఎంసి పరిధిలోని ఎనిమిది జోన్లల్లో 300 మంది కార్మికులను అరెస్టు చేశారు. గాజువాకలో సిఐటియు నేత ఎం.రాంబాబును వేకువజామున మూడు గంటలకే అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఒంగోలులో పలు పారిశుధ్య డివిజన్‌లలో పోటీ కార్మికులతో పని చేయించేందుకు అధికారులు ప్రయత్నించగా అడ్డుకున్నారు. పోలీసు పహారాలో పారిశుధ్య పనులు చేపట్టేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలను కార్మికులు తిప్పకొట్టారు. కొన్ని చోట్ల క్యాబ్ ఆటోల ద్వారా చెత్త సేకరణకు అధికారులు ప్రయత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. చెత్త ఆటోలు, ట్రాక్టర్లకు అడ్డంగా కూర్చొని నిరసన తెలియజేశారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో కార్మికులతో మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్, ఛైర్‌పర్సన్ శ్రీమంతరెడ్డి చర్చలు జరిపారు. బొబ్బిలి, కర్నూలు జిల్లా గూడూరులో బయటి వ్యక్తులతో పారిశుధ్య పనులు చేయించేందుకు ప్రయత్నించగా మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు.

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో ధర్నాచౌక్ వద్ద వేలాది మంది పారిశుధ్య కార్మికులు ధర్నా, మానవహారం నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు సిహెచ్.బాబూరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, అంగన్‌డీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మద్దతిచ్చారు.

అక్షరం




పుస్తకంలో ఉంటుంది అక్షరం
ఆ అక్షరాలే పదాలవుతాయి
పదాలే ఒక వాక్యమైతే
వాక్యాలే మనకు పాఠాలు
అట్టి పాఠాలే మనకు చదువులు
అందుకే పుస్తకమంటే మనకిష్టం
గురువుల బోధనలు మనకు ప్రాణం
మనలో ఉన్న జ్ఞానాన్ని తెలుసుకొని
మనకు తేజస్సును నింపుతారు
ఆటలలో పాటలలో అన్నింటా
మమ్ములను ముందు నిలిపేది గురువులు
అందుకే మనకు అక్షరం అమృతం
మన గురువులకు వందనం!



- నవదీప్,
6వ తరగతి,
హవేలీ ఘనపూర్, మెదక్ జిల్లా,
91824 46399.

లెక్క తేల్చండి



చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 17

నేను గీసిన బొమ్మ



షేక్ ముబష్షిర,
7వ తరగతి,
బూడిదపాలెం,
కందుకూరు,
నెల్లూరుజిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



అమ్మ పాత్రకు ఆమె వెండితెర రూపం



వెండితెరపై తమ అభినయాన్ని పరిచయం చేస్తూ తమకంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవాలని చాలామంది భావిస్తారు. అయితే సినిమా అనే రంగుల ప్రపంచంలో అది అంత తేలిక కాదు. దానికి ఎంతో కష్టపడాలి. బ్యాక్‌గ్రౌండ్ ఉండాలి. అయితే అలాంటిదేమీ లేకుండానే టాలీవుడ్‌లో తన కంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు వైష్ణవిశ్రీ రూపలక్ష్మి. ఇప్పుడు ఆమె వెండితెరపై అమ్మగా ప్రేమను కురిపిస్తూ విమర్శకుల ప్రశంసలు అందుకుంటున్నారు. అయితే ఆమెకు ఈ అవకాశాలు ఊరకే రాలేదు. 'ఈమెకు నటన వచ్చా? నటించగలదా?..చూద్దాంలే...! అని నిట్టూర్పులు విడిచిన వారూ ఉన్నారు. సినిమాల్లో నటించాక కూడా ఆడిషన్స్‌కు రావాలని కోరిన సందర్భాలూ చాలానే ఉన్నాయి. అయితే అవేమీ పట్టించుకోలేదామె. ఆమె నటనను చిన్న పాత్రలకే పరిమితం చేసినా భరించారు. మొండిగా ముందడుగు వేశారు. తాను నమ్మిన సినిమా రంగంలో ఆర్టిస్టుగా రాణించాలనే ఆశతో అవకాశాల కోసం ఎదురుచూశారు. 'బలగం' సినిమాతో ఆమె తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. ఇంతకీ ఆమె ఎవరు? ఎక్కడి నుంచి ఇండస్ట్రీకి వచ్చారు? ఇప్పుడెలా రాణిస్తున్నారో? తెలుసుకుందాం.

చిత్తూరు జిల్లా మదనపల్లెకు చెందిన రూపలక్ష్మి తల్లిదండ్రులది వ్యవసాయ కుటుంబం. సొంత తల్లిదండ్రులు గోపాల నాయుడు, నాగమ్మ. పెంచిన తల్లిదండ్రులు వైష్ణవిశ్రీ, సీతారామ్. రెండు నెలల వయసులోనే ఆమెను ఓ ఎకనామిక్స్ లెక్చరర్‌కు దత్తత ఇచ్చేశారు. ఆయన వద్ద పెరిగిన ఆమెకు విద్యాబుద్ధులు నేర్పించి యుక్తవయస్సు రాగానే పెళ్లి చేశారు.

టాలీవుడ్‌లో 'మదర్' ఫేమ్‌కు కేరాఫ్

అందం, అభినయమే కాదు, ఆత్మవిశ్వాసంతో తనకు నచ్చిన, మెచ్చిన, వచ్చిన పాత్రల్లో తల్లిగా నటిస్తూ మెప్పిస్తున్నారు. టాలీవుడ్‌లో హీరో, హీరోయిన్లకు తల్లి పాత్రల్లో నటిస్తూ తెలుగు పరిశ్రమలోనే నేడు బిజీ క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఉన్నారు. దూరదర్శన్, ఈటీవీ సీరియళ్లలో బుల్లితెరపై నటిగా మెప్పించి, షార్ట్ ఫిలిమ్స్‌లో రాణించిన ఆమె వెండితెరపైనా తన అభినయాన్ని పండిస్తూ 'బలగం' ద్వారా మంచి నటిగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు.

బుల్లితెరలోనూ మెప్పించారు

చిన్నప్పటి నుంచే రూపకు సినిమాల్లో నటించాలనే కోరిక బలంగా ఉంది. ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు అద్దం ఎదురుగా డ్యాన్సులు చేయటం, డైలాగులు చెప్పటం ప్రాక్టీస్ చేసేవారు. సెలవు రోజుల్లో సినిమాలను బాగా చూసేవారు. ఆ తర్వాత తమ్ముడి స్నేహితుడి ద్వారా వచ్చిన అవకాశాలతో ఈటీవీ పలు ధారావాహిక కార్యక్రమాల్లో నటించారు. పలు షార్ట్‌ఫిలిమ్స్‌లో అనేక పాత్రలను పోషించి గుర్తింపు తెచ్చుకున్నారు. వీటి ద్వారా వచ్చిన పరిచయాలతో సినిమాల్లో మొదట్లో ఇలా కనిపించి అలా వెళ్లిపోయే పాత్రలకు అవకాశం వచ్చింది.

తల్లిపాత్రల్లో మెప్పిస్తున్నారు

జయ జానకి నాయక, వినయ విధేయ రామ, సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ తదితర సినిమాల్లో రూపకు ఎక్కువ నిడివి ఉన్న పాత్రలను పోషించారు. ఆయా పాత్రల్లో ఆమె నటించి మెప్పించారు. పలు సందర్భాల్లో కామెడీని సైతం పండించారు. శ్రీ విష్ణు హీరోగా నటించిన 'నీది నాది ఒకటే కథ'లోనూ తల్లి పాత్రలో ఆమె డైలాగులు ఆలోచింపజేస్తాయి. కామెడీ పంచులను కూడా ప్రేక్షకులు ఆదరించారు. జాంబిరెడ్డి, సరిలేరు నీకెవ్వరు, మహర్షి, నర్తనశాల, టెన్త్‌క్లాస్ డైరీస్ వంటి చిత్రల్లో ఆమె పాత్రకు పేరొచ్చింది. హరీష్ శంకర్, బోయపాటి శ్రీనివాసరావు వంటి అగ్ర దర్శకులు పలు సినిమాలకు అవకాశం వచ్చేలా చేశారు.

సినిమాకు 'బలగం'

తెలుగు సినీ చరిత్రలోనే సరికొత్త రికార్డు సృష్టించిన 'బలగం' చిత్రం ఆమెకు మరింత పేరు తెచ్చిపెట్టింది. తెలంగాణాలోని గ్రామీణ ప్రాంతాల్లోని కథను ఓ కుటుంబం పెద్ద దిక్కు మరణాన్ని ఇతివృత్తంగా చేసుకుని సినిమా సాగుతుంది. అంత్యక్రియలు, దశ దినకర్మ, పిట్టకు పిండం పెట్టడం, ఆత్మీయుల మధ్య సాగే కలహాలు, అనుబంధాలు, మనస్పర్థలు, భావోద్వేగాలు వంటి అంశాల్లో ప్రతి సందర్భంలోనూ ఆమె పాత్రలో ఒదిగిపోయి నటించారు. సందేశాత్మకంగానూ, హాస్యపూరితంగానూ ఎమోషనల్ కామెడీ డ్రామాగా సాగుతుందీ సినిమా. హీరోగా ప్రియదర్శి (సాయిలు), హీరోయిన్‌గా కావ్య కళ్యాణ్‌రామ్ (సంధ్య) నటించారు. మరణించిన తండ్రి కొమరయ్య (సుధాకర్‌రెడ్డి)కి కూతురిగా రూపలక్ష్మి (లక్ష్మి-లచ్చవ్వ) పాత్రలో జీవించేశారు. ముఖ్యంగా తండ్రి కొమరయ్య శవానికి చివరగా స్నానం చేయించే సీన్‌లో భౌతికకాయాన్ని హత్తుకుని ఏడ్చే సీన్ ప్రేక్షకులకు సైతం కన్నీళ్లు తెప్పించింది. ఆమె అందులో అంతగా ఒదిగిపోయారంటే అతిశయోక్తి కాదు. దర్శకుడు ఈ సీన్ చెప్పకపోయినా ఇది ఉంటే బాగుంటుందని ఆమె చెప్పగా అంగీకరించారు. హీరోయిన్‌కు తల్లిగా, హీరోకు మేనత్తగా ప్రతి సందర్భంలోనూ ఆమె పాత్రలో ఒదిగిపోయారనే చెప్పొచ్చు. దర్శకుడు వేణు ఇచ్చిన రోల్‌కు ఆమె న్యాయం చేశారనే చెప్పొచ్చు.

ఏ పాత్రలోనైనా జీవిస్తారు

పల్లెటూరి అమ్మాయిగా మాస్ రోల్‌లోనైనా, సిటీ యువతిగా లేటెస్ట్ ట్రెండ్‌తో ఆకట్టుకునేలానూ, అమ్మతనానికి వన్నెతెచ్చేలాగా నటించి మెప్పిస్తున్నారు రూపలక్ష్మి. టీవీ సీరియళ్లలో చెల్లెలు, అక్క, విలన్ పాత్రలు పోషించారు. చిన్న హీరోల నుంచి నేడు పెద్ద హీరోలకు వరకూ తల్లి పాత్రలో ఆమె ఒదిగిపోతున్నారు. స్వతహాగా తనకున్న జ్ఞాపకశక్తి, ఏది చెప్పినా ఇట్టే పట్టేసే తత్వంతో డైలాగులు సులభంగా చెప్పగలుగుతారు. పల్లెలో కుటుంబ నేపథ్యం, సంప్రదాయాలు, ప్రేమానురాగాలను పండింపజేసే పాత్రల్లో మెప్పిస్తున్నారు.

ఛాలెంజింగ్ పాత్రలు చేయాలనుంది

కెరీర్‌పరంగా సినిమాల్లో ఎలాంటి ఛాలెంజింగ్ పాత్రలు వచ్చినా చేయటానికి సిద్ధంగా ఉన్నాను. మంచి క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణించాలని వుంది. పెద్ద హీరోలకు తల్లి పాత్రల్లో నటించాలని అవకాశాలు వస్తున్నాయి. ఈ రంగంలోకిరావటానికి, నిలబడటానికి ఎన్నో కష్టాలను ఎదిరించా. ఆత్మవిశ్వాసంతోనే ముందుకు సాగుతున్నాను. జీవితంలో మహిళ సంతృప్తిగా ఉండే స్థానం అమ్మ.. అందుకే అలాంటి పాత్రల్లో నటించటాన్ని ఇష్టంగా భావిస్తాను.

-వివిఎస్ రూపలక్ష్మి,
సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్

క్యారెక్టర్ ఆర్టిస్టుగా ప్రస్థానం

జయ జానకి నాయక, సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ సినిమాలో ఆమె కామెడీ టైమింగ్‌తో మెప్పించారు. నటనతోనూ మెప్పించి ప్రశంసలు పొందారు. ఇప్పటికి 50కిపైగా సినిమాల్లో నటించారు. ఆమె ప్రభావవంతమైన నటనకు ప్రేక్షకులు ఆమోద ముద్ర వేస్తున్నారు.

కొత్త సినిమాల్లోనూ...

కరుణాకరణ్ దర్శకత్వంలో వస్తున్న మట్కా, ఎన్టీఆర్ నటిస్తున్న దేవర, నాగార్జున 'నా సామిరంగ' వంటి పలు సినిమాల్లో ఆమె నటిస్తున్నారు.

సంభాషణ : యడవల్లి శ్రీనివాసరావు



రంగవల్లి



కె.రాధిక,
జోహార్‌పురం,
కర్నూలు జిల్లా. 94945 50091.

16 చుక్కలు 6 వరుసలు 6 వచ్చేవరకు

ముగ్గులు పంపవల్సిన మా చిరునామా :
మెయిల్ ఐడి : jeevanapageps@ gmail.com
వాట్సాప్ : 83329 25496

'నా బుజ్జికొండవే' పాట విడుదల



హీరో వెంకటేష్ నటించిన 75వ చిత్రం 'సైంధవ్'. శైలేశ్ కొలను తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా మూవీని వెంకట్ బోయనపల్లి నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. రుహాని శర్మ, ఆండ్రియా, బేబీసారా, నవాజుద్దీన్ సిద్ధిఖీ తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ సినిమా జనవరి 13న విడుదల కానుంది. శుక్రవారంనాడు ఈ చిత్రం నుంచి 'బుజ్జికొండవే.. నా బుజ్జికొండవే' అన్న పాటని చిత్ర నిర్మాతలు విడుదల చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన కూతుర్ని తలచుకుంటూ వెంకటేష్ పడే ఆవేదనను వీడియోలో ఈ పాట ద్వారా భావోద్వేగ భరితంగా చూపించారు. రామజోగయ్యశాస్త్రి రాసిన ఈ పాటను ఎస్‌పి చరణ్ పాడగా సంతోష్ నారాయణ్ సంగీతం అందించారు. ఈ సినిమాకు కూర్పు గ్యారీ బిహెచ్, ఛాయాగ్రహణం ఎస్ మణికందన్.

ప్రేక్షకుల అభిమానంతోనే : నయనతార



'రెండు దశాబ్దాలుగా సినీ పరిశ్రమలో ప్రేక్షకుల అభిమానంతో ముందుకు సాగుతున్నా. ఇండస్ట్రీలో నేను నిలబడటానికి అభిమానులే కారణం. నాకు బలమైన శక్తిగా, గుండె చప్పుడుగా నిలుస్తున్నారు' అని హీరోయిన్ నయనతార పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె తన కెరీర్ గురించి వివరాలతో కూడిన ఓ పోస్టు పెట్టారు. 'నా సినిమా జీవితం పరిపూర్ణం కావటానికి..75 సినిమాల మైలురాయిని దాటడానికి అభిమానుల ప్రోత్సాహకమే కారణం'గా పేర్కొన్నారు. బుల్లితెరపై యాంకర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన నయనతార మలయాళంలో 'మనసినక్కరే' సినిమా ద్వారా సినీ రంగ ప్రవేశం చేశారు. పలు భాషల్లో నటించారు. ఆమె నటించిన జవాన్ ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే.

చాలా ఆనందంగా ఉన్నా : రష్మిక



'జీవితం గురించి కొన్నిసార్లు ఆగి ఆలోచించాలి. అదంతా ఎలా జరిగింది? ఎప్పుడు జరిగింది? అసలెందుకు ఇదంతా జరిగింది. వెనక్కి తిరిగి చూసుకుంటే ఎన్నో మలుపులు.. మైలురాళ్లు... ఏదైనా ఇప్పుడు నేను చాలా ఆనందంగా ఉన్నా. ఇదంతా జరిగినందుకు ప్రశాంతంగా, చాలా సంతోషంగా కూడా ఉంది' అని హీరోయిన్ రష్మిక వ్యాఖ్యానించారు. ఆమె నటించిన యానిమల్ సినిమా ఇటీవల విడుదలై హిట్ టాక్‌ను అందుకున్న విషయం తెలిసిందే. పుష్ప-2లో నటిస్తున్న ఆమె తాజాగా తన ఇన్‌స్టాలో చేసిన పోస్టు వైరలవుతోంది. 'సరైన వ్యక్తులతో ఉండటం వల్ల మీరు కొన్నిసార్లు ఆగి... దాన్ని గ్రహించాల్సి వుంటుందని తెలుసుకుంటారు' అని పేర్కొన్నారు.

కల్కి కోసం స్పెషల్ గన్స్



హీరో ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం కల్కి 2898 ఏడీ'. దీపిక పదుకొనె కథానాయిక. కమల్‌హాసన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. అమితాబ్ బచ్చన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. మరో 90 రోజుల్లో ట్రైలర్ వస్తుందని నాగ్ అశ్విన్ తెలిపారు. ఈ సినిమాలో ఉపయోగించే స్పెషల్ గన్స్‌ను ఎలా తయారుచేసే వీడియోను చిత్రబృందం విడుదల చేసింది.



రేవంత్‌ను కలిసిన నాగార్జున దంపతులు

తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సినీనటుడు అక్కినేని నాగార్జున శనివారంనాడు మర్యాదపూర్వకంగా కలిశారు. సతీమణి అమలతో కలిసి హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.



విజయాన్ని సొంతం చేసుకుంటాం

కౌశల్ మంద, లీషా ఎక్లైర్స్ హీరో హీరోయిన్లుగా శంకర్ దర్శకత్వంలో నిర్మించిన 'రైట్' చిత్రం విజయాన్ని సొంతం చేసుకోవటం ఖాయమని చిత్ర నిర్మాతలు లుకలాపు మధు, మహంకాళి దివాకర్ వెల్లడించారు. ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హీరో మంచు మనోజ్ హాజరై మాట్లాడారు. ట్రైలర్ బాగుంది..ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు.

మూడు పరుగుల దూరంలో...

- ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓటమి
- దీప్తి, రీచా శ్రమ వృథా
- సిరీస్ 2-0తో ఆసీస్ కైవసం



రీచా ఘోష్ (96పరుగులు)

ముంబయి: ఆస్ట్రేలియా మహిళలతో జరిగిన ఏకైక టెస్ట్‌లో సంచలన విజయం సాధించిన భారత మహిళల జట్టు వన్డేల్లో ఆ స్థాయిలో రాణించలేకపోయింది. మూడు వన్డేల సిరీస్‌లో చేజార్చుకోకుండా ఉండాలంటే తప్పక గెలవాల్సిన రెండో వన్డేలో టీమిండియా మూడు పరుగుల తేడాతో ఓడి సిరీస్‌ను చేజార్చుకుంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 258పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో హర్మన్‌ప్రీత్ సేన్ నిర్ణీత 50 ఓవర్లు పూర్తయ్యే సరికి 8వికెట్లు కోల్పోయి 255పరుగులే చేయగల్గింది. చివరి 18బంతుల్లో 22పరుగులు చేస్తే గెలిచే అవకాశమున్నా.. వరుసగా వికెట్లు కోల్పోయి ఓటమిపాలైంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ బ్యాటర్లలో యువకెరటం లిచ్‌ఫీల్డ్(63), ఎలిసా పెర్రీ(50) మరోసారి అర్ధ శతకాలతో కదం తొక్కారు. చివర్లో అలనా కింగ్(28నాటౌట్), తహ్లియా మెక్‌గ్రాత్(24) ధనాధన్ ఆడారు. కెప్టెన్ అలీసా హేలీ(13) స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగినా.. ఎలీసా పెర్రీ, లిచ్‌ఫీల్డ్ బాధ్యతగా ఆడి జట్టును ఆదుకున్నారు. అయితే.. దీప్తి శర్మ సూపర్ స్పెల్‌తో మిడిలార్డర్‌ను దెబ్బకొట్టింది. కానీ, చివర్లో వచ్చిన సథర్లాండ్(23), వరేహాం(22), మెక్‌గ్రాత్(24) బ్యాట్ ఝుళిపించడంతో కంగారూ జట్టు 250కు పైగా పరుగుల స్కోర్ చేయగలిగింది.

ఛేదనలో టీమిండియాను మంధాన(34), రీచా(96) ఆదుకున్నారు. వీరిద్దరూ జాగ్రత్తగా ఆడి స్కోర్‌బోర్డును పరుగెత్తించారు. ఆ తర్వాత వైస్ కెప్టెన్ మంధాన ఔటైనా.. ఆ తర్వాత జెమీమా రోడ్రిగ్స్‌తో కలిసి రీచా ఘోష్ 3వ వికెట్‌కు ఏకంగా 88పరుగులు జతచేసింది. దీంతో టీమిండియా సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించింది. ఈ క్రమంలో జెమిమాను వారేహామ్ ఔట్ చేయడం.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా 5పరుగులకే ఔట్ కావడంతో టీమిండియా ఒత్తిడిలో పడింది. సెంచరీకి చేరువలో రీచా ఘోష్(96) ఔటవ్వడం, దీప్తి ధాటిగా బ్యాటింగ్ చేయకపోవడంతో ఓటమిపాలైంది. చివరి ఓవర్లో 16పరుగుల చేయాల్సిన ఉండగా.. భారత్ కేవలం 13పరుగులే చేసింది. ఆస్ట్రేలియా బౌలర్లు సథర్లాండ్‌కు మూడు, వారేహామ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఈ గెలుపుతో మూడు వన్డేల సిరీస్‌ను ఆసీస్ 2-0తో చేజిక్కించుకోగా.. మూడో, చివరి వన్డే జనవరి 2న జరగనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సథర్లాండ్‌కు దక్కింది.

స్కోర్‌బోర్డు..

ఆస్ట్రేలియా మహిళల ఇన్నింగ్స్: లచ్‌ఫీల్డ్ (సి)రీచా (బి)శ్రేయాంక 63, హీలీ (బి)పూజ వస్త్రాకర్ 13, ఎలీసా పెర్రీ (సి)శ్రేయాంక (బి)దీప్తి 50, మూనీ (ఎల్‌బి) దీప్తి 10, మెక్‌గ్రాత్ (బి)దీప్తి 24, గార్డినర్ (సి)అమన్‌జ్యోత్ కౌర్ (బి)స్నేహ్ రాణా 2, సథర్లాండ్ (సి అండ్ బి)దీప్తి 23, వారేహామ్ (సి)స్మృతి మంధాన (బి)దీప్తి 22, అలానా కింగ్ (నాటౌట్) 28, కిమ్ గరాత్ (నాటౌట్) 11, అదనం 12. (50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 259పరుగులు. **వికెట్ల పతనం:** 1/40, 2/117, 3/133, 4/160, 5/170, 6/180, 7/216, 8/219 **బౌలింగ్:** రేణుక సింగ్ 7-0-35-0, పూజ వస్త్రాకర్ 10-0-59-1, అమన్‌జ్యోత్ కౌర్ 3-0-21-0, శ్రేయాంక పాటిల్ 10-0-43-1, స్నేహ్ రాణా 10-0-59-1, దీప్తి శర్మ 10-0-38-5.

భారత మహిళల ఇన్నింగ్స్: యాస్తికా భాటియా (ఎల్‌బి)కిమ్ గరాత్ 14, స్మృతి మంధాన (సి)మెక్ గ్రాత్ (బి)కింగ్ 34, రీచా ఘోష్ (సి)లిచ్‌ఫిల్డ్ (బి)సథర్లాండ్ 96, జెమిమా రోడ్రిగ్స్ (సి)లిచ్‌ఫీల్డ్ (బి)వారేహామ్ 44, హర్మన్‌ప్రీత్ కౌర్ (సి)హీలీ (బి)వారేహామ్ 5, దీప్తి (నాటౌట్) 24, అమన్‌జ్యోత్ కౌర్ (బి)సథర్లాండ్ 4, పూజ వస్త్రాకర్ (సి)గార్డినర్ (బి)సథర్లాండ్ 8, హర్లిన్ డియోల్ (బి)గార్డినర్ 1, శ్రేయాంక పాటిల్ (నాటౌట్) 5, అదనం 20. (50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 255 **వికెట్ల పతనం:** 1/37, 2/71, 3/159, 4/171, 5/218, 6/224, 7/240, 8/243 **బౌలింగ్:** గార్డినర్ 10-0-46-1, బ్రౌన్ 7-0-37-0, కిమ్ గరాత్ 6-0-24-1, సథర్లాండ్ 9-0-47-3, కింగ్ 7-0-43-1, మెక్‌గ్రాత్ 4-0-15-0, వారేహామ్ 7-0-39-2.

మళ్లీ ఓడిన తెలుగు టైటాన్స్

ప్రొ కబడ్డీ సీజన్-10

నోయిడా: ప్రొ కబడ్డీ సీజన్-10లోనూ తెలుగు టైటాన్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఈ సీజన్‌లో ఇప్పటికే 6 మ్యాచుల్లో ఓడిన టైటాన్స్ శనివారం యు ముంబ చేతిలోనూ చిత్తుగా ఓడింది. తొలి అర్ధభాగంలో యు ముంబను నిలువరించిన టైటాన్స్.. రెండో అర్ధభాగంలో చేతులెత్తేసింది. సూపర్ ట్యాకిల్స్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిన యు ముంబ జట్టు 52-34పాయింట్ల తేడాతో తెలుగు టైటాన్స్‌ను చిత్తుచేసింది. ఈ మ్యాచ్‌కు కెప్టెన్ పవన్ షెహ్రావత్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. రైడ్‌లలో రాంబిన్(7), రజనీష్(8), ప్రఫుల్(7) రాణించగా.. ట్యాకిల్స్‌లో నిరాశపరిచింది. ఇక యు ముంబ జట్టులో గుమన్ సింగ్(10), జఫన్‌దేశ్(8) రైడ్స్‌లో రాణించగా.. రింకు(8), సోంబిర్(8) ట్యాకిల్స్‌లో మెరిసాడు. ఈ ఓటమితో టైటాన్స్ 8మ్యాచులు పూర్తయ్యేసరికి 7 ఓటములు, ఓ గెలుపుతో 12వ(చివరి) స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 35-25పాయింట్ల తేడాతో యుపి యోధాను చిత్తుచేసింది.


ప్రొ కబడ్డీలో నేడు..
గుజరాత్ జెయింట్స్ × బెంగాల్ వారియర్స్(రాత్రి 8.00గం॥లకు)
తమిళ్ తలైవాస్ × బెంగళూరు బుల్స్(రాత్రి 9.00గం॥లకు)

బెంగాల్ రంజీ కెప్టెన్‌గా తివారి

కోల్‌కతా: బెంగాల్ రంజీజట్టు కెప్టెన్‌గా సీనియర్ క్రికెటర్ మనోజ్ తివారి ఎంపికయ్యాడు. ఈమేరకు బెంగాల్ క్రికెట్‌బోర్డు శనివారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. బెంగాల్ క్రికెట్‌బోర్డు ప్రకటించిన 18మంది ఆటగాళ్ల జట్టుకు కెప్టెన్‌గా తివారి ఎంపికైనట్లు తెలిపింది. రంజీట్రోఫీ తొలి మ్యాచ్‌ను బెంగాల్ జట్టు జనవరి 5నుంచి ఆంధ్రప్రదేశ్‌తో 12నుంచి ఉత్తరప్రదేశ్‌తో ఆడనుంది. ఆంధ్రతో జరిగే మ్యాచ్ విశాఖపట్నంలోని డా.వై.ఎస్ రాజశేఖరరెడ్డి(ఎడె-విడిసిఎ) క్రికెట్ స్టేడియంలో జరగనుంది. గత ఏడాది రంజీట్రోఫీ ఫైనల్లో బెంగాల్ జట్టు సౌరాష్ట్ర చేతిలో9వికెట్ల తేడాతో ఓడి రన్నరప్‌గా నిలిచింది.

జట్టు: మనోజ్ తివారి(కెప్టెన్), మజుందార్, సుదీప్ ఘరామి, అభిషేక్ పోరెల్, సౌరవ్ పాల్(వికెట్ కీపర్), శ్రేయంత్ ఘోష్, రంజోత్‌య సింగ్, శుభమ్ ఛటర్జీ, ఆకాశ్ దీప్, ఇషాన్ పోరెల్, ప్రామానిక్, కరణ్ లాల్, కౌశిక్ మింటీ, మహ్మద్ కైఫ్, అంకిత్ మిశ్రా, పి.ఆర్. బర్మన్, సూరజ్ సింధు జైస్వాల్, సుమన్ దాస్.

లంక టి20 కెప్టెన్‌గా హసరంగ



కొలంబో: శ్రీలంక పురుషుల క్రికెట్‌జట్టు టి20 కెప్టెన్‌గా పవసంతు హసరంగ ఎంపికయ్యాడు. శ్రీలంక క్రికెట్‌బోర్డు(ఎస్-ఎలోసి) శనివారం ఓ ప్రకటనలో ఈమేరకు ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇక వైస్ కెప్టెన్‌గా ఛరిత్ అసలంక ఎంపికయ్యాడు. అలాగే వన్డే కెప్టెన్‌గా కుశాల్ మెండీస్ ఎంపికయ్యాడు. కెప్టెన్‌గా ఎంపికైన లసిత్ హసరంగా ఆసియాకప్‌తోపాటు ఐసిసి వన్డే ప్రపంచకప్‌కూ దూరమైన సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68